
ఆంధ్ర సచిత్ర వారపత్రిక




29-8-80
90 పైసలు


మన్నికతో నిలిచేలా రూపొందించింది కరోనా
నడిచేటప్పుడు మంచి పట్టుకోసం ఎత్తు పల్లాలుగా ఉండే అడుగు భాగం.
మెత్తదనం, మన్నిక. ధరిస్తే ఎంతో హాయి.
Carona VIJAY 8
విజయ్ రబ్బర్ స్లిప్పర్స్
విజయ్
విజయ్ సుందర్
విజయ్ ఆరామ్
విజయ్ హీల్
Carona
తయారుచేయువారు:
కరోనా సాహు కం. లి.
221, దాదాభాయ్ నౌరోజీ రోడ్, బొంబాయి 400 001
కరోనా లాలిస్తుంది.
CHAITRA-CS-217 TEL



ఎందుకంత
నాకోసం శ్రమ తీసికొని
యిప్పుడు ఫిల్టర్ కాఫీ
తయారుచేశావు?
అదేంకాదు...
ఇది రికొరీ
ఇన్‌స్టెంట్
రికరీ®
ఇన్‌స్టెంట్
STORAGE JAR OFFER
Ricory
A COFFEE CHICORY BLEND
Ricory
H-STRENGTH
A COFFEE CHICORY BLEND
ఇది ఫిల్టర్
కాఫీ వలెనే యెంతో
రుచిగా ఉంటుంది కాబట్టి
తేడాచెప్పడం చాలాకష్టం.
నెస్ కఫే ఉత్పత్తిదార్లనుండి-ప్రపంచమంతటా కాఫీ శ్రేష్టత తెలిసినవారు
SAA/FSL/R/113

లోకంపోకడ * డిమెన్



ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]
శుక్రవారం : 29-8-'80
రౌద్రినామ సం॥ శ్రావణ బ. చవితి
సంపుటము 73 : సంచిక 53
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
పోస్టులో ఏడాది చందా రు. 49-40
ఆరు మాసాల చందా రు. 24-70
విడి ప్రతి వెల 90 పైసలు
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ఉత్తరాలు

మంచి ముఖ చిత్రాలు అందించటంలో ఆంధ్రపత్రికది అందె వేసిన చెయ్యి. అలాటిది 1.7.80 నాటి సంచికలో 'మాధవి' ముఖచిత్రం చాలా అసభ్యంగా ఉంది. ఈ వారం ప్రచురించిన కథల్లో కొన్ని, దొంగలకు దొరకనిది ఈ చదవతగ్గ చక్కని కథ అవడంలో సందేహం లేదు.

కందిగట్ల ప్రభాకర్ [జనగాం]

వ్యూమెన్ కార్ట్యూన్స్

ఆంధ్రపత్రిక వారపత్రిక 1.8.80 చూడ రంజింపుగా ఉన్నది. రెండు సీరియల్స్ నుంచి అందాలలో ఒకదానికొకటి పోటీపడుతున్నాయి! అన్ని బాగున్నవి. ప్రచురిస్తున్న మీకు నా ధన్యవాదములు. కపోతే పూ మోహన్‌గారి కార్టూనులు ప్రతివారం పాఠకులను కడుపుబ్బ నవ్విస్తున్నాయనడంలో సందేహం లేదు.

నందిగామ మణిమోహనకృష్ణ [హైదరాబాద్]

* * *

అక్కినేని ముఖచిత్రముతో వెలువడిన [వివా[హా] ఆంధ్రపత్రిక వారపత్రిక చాలా బాగుంది మోహన్‌గారి లోకంపోకడ చదవాలనిపించినది. కార్టూనులు బాగున్నాయి. చీరకట్టిన జయమాలిని చక్కగా ఉన్నది. పుస్తకము ఆఖరి పేజీలో శోభన్ బాబు, జయప్రదలు అందంగా ఉన్నారు.

జూన నాగేశ్వరరావు, రామారావు, వెంకటేశ్వరరావు, కోటేశ్వరి, సత్యవతి, సురేష్, సుబ్బారాయుడు, నాగమణి [వారి]

సీరియల్స్

ప్రముఖ రచయిత్రి ఆర్. సంధ్యాదేవిగారి నవల ఆంధ్రపత్రికలో ఎప్పుడు వస్తుందోనని ఆత్రుతగా ఎదురు చూస్తున్న మాకు 'స్వప్నం చెదిరి' విస్తృతి వింతగా అనిపించింది. హీరో తల్లిదండ్రుల త్యాగధనం [పేజీ 30, 31] కండ్లకు కట్టినట్లుంది. నవలలో పాత్రలకే కండ్లతో మాట్లాడించే నేర్పు ఈ ఒక్క రచయిత్రికే ఉంది. కానీ, "నా కోడలిగా ఇలాంటి అమ్మాయే రావాలి. ఈ అమ్మాయి నాకెంతో నచ్చింది" అంటుంది కళ్లతో విజయమ్మ [పేజీ 31] అంత పెద్ద డైలాగు కండ్లతో ఎలాగండీ బాబూ చెప్పడం?! ప్రయత్నిస్తే మాకు చేతకావడం లేదు. హీరో నల్లటి మీసాలు, తెల్లటి పండ్లు, హీరోయిన్ బొట్టు, కాటుక, ఏ కంపెనీవో, ఆవిడ కట్టిన చీరపై పూలు ఏ రంగువి, ఎన్ని గజాలయితే ఎన్ని సెంటీమీటర్లు ఇలా హీరో హీరోయిన్ల అందచందాలు వివరంగా, చక్కగా కండ్లకు కట్టినట్లు వర్ణించడం రచయిత్రి గొప్పదనం. పాఠకులలో సాహిత్యాభిలాష పెంచే ఇటువంటి రచనలు చేస్తున్న రచయిత్రిని అభినందిస్తున్నాను.

బి. అప్పమాంబ [తిరుపతి]

* * *

25—7—80 వారపత్రిక ముఖచిత్రం ఆకర్షణీయంగా లేదు. అనుభూతి—అనుబంధం సీరియల్ అంత రసవత్తరముగా లేదు. జీవితగమ్యం సీరియల్ చాలా మలుపులు తిరుగుచున్నది. ఈ సంచికలో ప్రారంభమైన మనుష్యుల మనసులలో రచయిత్రి కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రాజమండ్రిలో ఆగినట్లు, సారిక టీ త్రాగినదని, ఇంకా ఎవరైనా ప్రయాణికులు వస్తే బాగుంటుందని అనుకున్నట్లు రాశారు. మాకు తెలిసినంత వరకూ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రాజమండ్రిలో ఆగదు.

ఎం. జయలక్ష్మి, మాల్లీశ్వరి [ఏలూరు]

* *

25—7—80 సౌదామిని ముఖచిత్రం చాలా బాగుంది. సామాన్యుని సణుగుళ్ళు, ధర్మపథం ద్వారా మంచిని గ్రహించగలిగాము. కథలు బాగున్నాయి. ముఖ్యంగా జి. రా. మూర్తిగారి సీరియల్ అయిపోయినందుకు మంచి స్నేహితుడిని పోగొట్టుకున్నంత బాధ కలిగింది. కానీ మనుష్యుల మనసులు ఆ లోటు తీర్చింది.

స్వర్ణలతా బాబు [బోధన్]

సీరియల్

అనుభూతి అనుబంధం ముగింపు చాలా, దయనీయంగా, హృదయాన్ని కలచి వేసినది. భానుమూర్తి అల్లరిచిల్లరిగా తిరిగినా మానవత్వముతో ఎన్నో మంచి పనులు చేసినాడు. జైలులో చలపతి పరిచయమువల్ల చలపతి కోరికపై చలపతి ఇంటికి వెళ్లి పరిస్థితుల కారణంగా చలపతి ఇంటిలోనే ఉండి, చలపతి తల్లిని, చెల్లెలిని ఆదరించి, చలపతి తల్లి

ఉత్తరాలు

చనిపోతే కూడా చలపతి చెల్లెలు జ్యోతికి ఎలాంటి బాధలు లేకుండా, ఎలాటి కొరత లేకుండా చూచుకుంటే, అఖరుకు కొంచెమైనా విశ్వాసము లేకుండా భానుమూర్తికి లెప్రసీ ఉందని విడిచిపోవడము చాలా ఘోరముగా ఉన్నది. భానుమూర్తికి ఆఖరు వరకూ ఒంటరి బ్రతుకే అయినది. ఇంత మంచి నవల అందించినందుకు అభినందనలు.

బి. కరుణమ్మ [గుంతకల్లు]

* * *

కథలు

[1—8—80] వారం పత్రికలో పొడవేల రేడికా కథ బాగాఉంది. కథ చెప్పడం మామూలుగా ఉన్నా కథలోని విమర్శ వాస్తవం. ముగింపులో సున్నిత హాస్యం వుంది.

ధర్మపథం శీర్షికలో నాలుగు హెచ్చరికలు చాల బాగున్నాయి. ప్రశ్నావళి శీర్షికలో ప్రశ్నలు ఒకే రీతిగా ఉంటున్నాయి.

బద్వేలి రమేష్ [అనంతపురం]

* * *

ఆగస్టు 1వతేదీ ఆంధ్ర సచిత్ర వారపత్రికలో పొడవేల రేడికా కథలోని సుబ్బారావు పాత్ర, రచనలు ప్రచురించబడని రచయితగా నన్ను కలచి వేసినది.

స్పందన కవిత హృదయాన్ని స్పందింప జేసేటట్లుగా ఉంది. కార్టూన్లు నవ్వించేలా లేవు.

జి. కమలారామం [వినుకొండ]

ఫాలాక్షుని డైరీ

చావడానికి హక్కు!

ఢిల్లీకి చెందిన 85 ఏళ్ళ గోపాల్. ఎస్. మాండ్రే తనకు జీవితేచ్ఛ నశించి, మరణేచ్ఛ పుట్టుకొచ్చి, పుష్టిగా పెరిగిందనీ, తనకు చావడానికి గాను ప్రభుత్వం హక్కు ప్రసాదించాలని కోరాడట. పుట్టిన ఇద్దరు పిల్లలు పిల్లలుగానే మరణించారనీ, భార్య 1976 లో చనిపోయిందనీ, ఏకాకిగా తానిహ జీవితాన్ని నెట్ట ఇష్టపడటం లేదనీ, కనుక జీవితాన్ని అంతం చేసుకునే హక్కు కావాలనీ ఆయన కోరారట. ఎవరికీ పనికి రాని వాడు, ఎవరూ లేనివాడు, ఎందుకూ కొరగానివాడూ చావడంవల్ల దేశానికి మంచే గాని, చెడు జరగదని ఆయన అన్నారట. బ్రిటన్లో 'ఎగ్జిట్' సంస్థ వలె మన దేశములో కూడా ఏదో ఒక సంస్థ వుండి తీరాలని ఆయన అన్నారట. తన దేహాన్నీ కళ్ళనీ, ఆయన ఇది వరకే దానం చేసివున్నారట. చని పోవడం ఆరోగ్యంగా అయితే గా అవయవాల వల్ల యింకెవరికైనా వుపయోగం వుంటుంది కదా అన్నారటాయన.

చీమలపాలైన శిశువు!

కోట్‌ద్వారా అనే వూరిలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో శకుంతల అనే ఆవిడ ప్రసవించిన శిశువు మరణించిందని ప్రకటించి ఆ శిశువును లేబర్ వార్డ్‌లో వదిలేసింది, ఒక దుప్పటి కప్పి. ప్రసవించిన పద్దెనిమిది గంటలకు ఆసుపత్రికి వచ్చిన శకుంతల భర్త శవం కోసం ఎంతో సంతాపాన్వితుడై ఆ లేబర్ వార్డుకు వెళితే ఆ పసి గుడ్డు కదులుతోంది. ఆ పిల్ల వంటి నిండా కొన్ని వందల చీమలు తిరుగుతున్నాయట. గగ్గోలు పెట్టిన ఆ తండ్రి ఆస్పత్రి అధికారులను దుమ్మెత్తి పోసి, పిల్ల మీది చీమలు పీకే లోగానే ఆ పిల్ల నిజంగా మరణించిందట— అయ్యో! ఆస్పత్రులలో యిలాంటివి అనాస్థ్య సర్వసాధారణమై పోయాయి. వెలుగు చూడనివి ఎన్ని వున్నాయో!!

పట్టాలకోసం పసిపిల్ల ప్రాణం!

ఆత్మకూరులో ముంతాజ అనే 18 ఏళ్ల అమ్మాయి అఫీజా అనే ఆరేళ్ల పిల్లను మంచి మాటలు చెప్పి వూరు చివరికి తీసుకు పోయి, అక్కడ ఆమె కాళ్లకున్న మూడు తులాల వెండి పట్టాలు వూడలాక్కొని, ఆ పిల్లను నూతిలో పడేసి, చక్కా పోయిందట.

సన్యాసికెక్కిన రహస్య ప్రేమాయణం!

సన్యాసిపట్టికి చెందిన 25 ఏళ్ళ సెంగోడన్ అనే అతనికి పది నెలల క్రితం వివాహ మయ్యిందట. అతను ఆ వూరిలో డబ్బు చీటీ నడుపుతూ వుండేవాడట. ఈ చీటీ వ్యవహారాలలో 22 ఏళ్ళ పెరుమాళ్ అతనికి సహాయంగా వుంటూ వుండేవాడట. ఈ సందర్భంగా పెరుమాళ్ సెంగోడన్ యింటికి తరుచుగా వెళ్తూ వుండేవాడట. తత్ఫలితంగా సెంగోడన్ భార్య 16 ఏళ్ళ చెల్లమ్మకూ పెరుమాళ్ళుకూ రహస్య ప్రేమాయణం ఏర్పడి, అది ముదిరి యిద్దరూ వూరొదిలి సేలంలో కాపురం పెట్టారట. పెరుమాళ్ కన్నవారు చెల్లమ్మ కన్న వారూ వారిద్దరినీ సొంతవూరు తీసుకుపోయి, పంచాయితీ పెట్టారట. చెల్లమ్మ భర్తతో కాపురం చెయ్యాలనీ, అలా యిష్టం లేకపోతే భర్తకు నష్ట పరిహారంగా పద్నాలుగొందలు యివ్వాలనీ తేలిస్తే, ఆమె రెండోదానికే ఒప్పుకున్నదట. దాంతో కోపం వచ్చిన సెంగోడన్ చెల్లమ్మను కొడవలితో నరికి చంపేశాడట.

మోతాదు మించిన ప్రేమ

త్రివేండ్రంలో సుధ అనే ఆమె విశ్వనాథ నాయర్ అనే అబ్బాయిని ప్రేమించి, తన ప్రేమ వెల్లడించడానికి పార్కుని తగిన స్థలంగా ఎన్నుకున్నదట. దీనికతనూ ఒప్పుకుని ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో పార్కులో ప్రేమను చూపడం ప్రారంభించారట. ఓ నాటి ఆ కార్యక్రమం మోతాదు మించడంతో పోలీసులు చూసి, అంతా అయ్యాక పట్టుకుని కోర్టులో నిలబెట్టారట.

గ్రామం స్వాధీనం దొంగలదే!

వరంగల్ జిల్లాకు చెందిన చింతనెక్కొండ అనే గ్రామానికి పది మంది వచ్చిన దోపిడీదార్లు విజయం చేసి, నాటు బాంబులను ప్రయోగించి ఆ వూరు వారిని హడలెత్తించి, బాగా డబ్బు కల మూడు కుటుంబాల నుంచి 22 వేల రూపాయల కిమ్మత్తు గల నగలు నట్రా వగైరా వస్తువులు దోచుకు చక్కా పోయారట.

ఆత్మహత్యకు దారితీసిన నిస్పృహ!


బద్వేల్‌కు చెందిన 18 ఏళ్ళ తగాడిమంచిల రెడ్డి అనే కుర్రాడు బాలుర్ణల రామచంద్రరావు కాలేజీలో ఇంటరు మొదటి సంవత్సరం చదివి పరీక్షలలో ప్యాసయినా, రెండో ఏడు చదవనివ్వలేదని, వున్నా అన్న పొలాల వ్యవహారాలూ అవి చూసుకుంటే చాలనీ అతని తల్లిదండ్రులు అతని ఉత్సాహం మీద నీళ్ళు చల్లారట. చదువుమీదుండే ఆశ కొద్దీ తన తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటరు రెండో ఏడు ఫీజు కట్టి ఆనక కాలేజీకి వెళ్లేదెలా అని ఆలోచించి, నిరాశతో, నిస్పృహతో రైలు క్రింద పడి, ఆత్మ హత్య చేసుకున్నాడట.

వారానికి 30 వేల కార్లు!

ఇంగ్లండులో ప్రతీ వారానికి 30,229 కార్లు తయారు అవుతున్నాయట. నెలకు యాభై మూడువేలకార్లు ఆ దేశం నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్నాయట. ప్రపంచ దేశాలలోకెల్లా అమెరికా తరువాత ఇంగ్లండు స్థానం సంపాదించిం దటీనాడు.

భార్యకోసం బావమరిది అపహరణ!

మంగళగిరికి చెందిన తాసి పూర్ణలో ఒక పెళ్లికొడుకు తన భార్యని తనతో పంపడానికి అత్త మామలప్పటికప్పుడే యిష్ట పడకపోవడంవల్ల కోపంతో తన స్నేహితుల అండతో తన బావమరిదిని ఎత్తుకు పోయి, నీకొడుకు కావాలంటే నా భార్య నా కివ్వు అని కబురెట్టాడట. ఈ విషయంలో పోలీసులు కల్పించుకుని వెతికితే పలానా వూరుకు చెందిన ఓ అడవిలో ఆ కుర్రాణ్ణి ఓ చెట్టుకు కట్టేసి కాపలా కాస్తూ అంతా దొరికారట.



వారఫలం

29-8-1980 శుక్రవారం మొదలు 4-9-1980 గురువారం వరకు

మేషం : గ్రహాలలో మార్పులు రావటంచేత, గ్రహచారం, నానావిధాల అనుకూలించకపోవటంచేత, వృత్తి వ్యాపారంలో ప్రగతి, ఉద్యోగానుకూలం, కళారంగంలో ప్రగతి చెప్పదగిన వారం. వ్రతిభా ప్రదర్శనకు, గ్రంథ ప్రచురణకర్తలకు, అనుకూలవారం. స్త్రీలకు: ప్రయాణానుకూలత, ఉన్నత విద్యలో రాణింపు గల వారం.

వృషభం : రాశికి మూడింట, నాల్గింటగల గ్రహాలు, సర్వ విధాలా అనుకూలించగలవు గాని, ఆదాయం అందిరాదు. శత్రుబాధ ఋణబాధ చెప్పదగియున్నది. అనవసరంగా విలాసవస్తు సేకరణకై ధనం వ్యయం చేయగలరు. అలాటి పని ఏమంత మంచిది! స్త్రీలకు:— ఆటపాటల్లో అవకాశం, గృహాలంకరణకై, వస్తుసేకరణకు అధికంగా వ్యయించటం కూడా ఈవారం సంభవం.

మిథునం : చాల రోజులుగా రావలసియున్న ధనం చేతికి చిక్కటం, చాల మందికి క్రీడా రంగావకాశాలు సంభవించటం, కొందరకు విదేశ పర్యటనకు అవకాశాలు చిక్కటం, భూలాభం కల్గటం, ఉద్యోగంలో చాలమందికి ప్రమోషను చిక్కటం జరగనుంది. స్త్రీలకు:— క్రీడారంగంలో కొంతవరకు గౌరవ, ధైర్య, సాహసకార్యాలు నెరవేరటం, ప్రమోషన్ ఉద్యోగంలో లభించటం వారవిశేషం.

కర్కాటకం : పలుగుల బాధ్యతలు మీదవేసుకొనవలసి వచ్చినవి. సంఘ సేవలో కాలం వ్యయించటం, హఠాత్తుగా యింట్లో చేరిన బంధువులనాదరించటం, తప్పనిసరిగా వ్యయం చేయ వలసివచ్చే వారమిది. స్త్రీలకు: అన్నిరంగాలలో అనుకూలత, అప్రయత్న ధనలబ్ధి చెప్పదగినవారం.

సింహం : క్రమంగా మీకు అనేక అవకాశాలుంటాయి. చిక్కిన అవకాశాలను జాగ్రత్తగా ఉపయోగించుకొని ధనలబ్ధిని పొందండి. ఎంతకృషి చేస్తే అంత లాభించే వారం. వ్యాపారంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జరిగిపోయే వారం. ఉద్యోగంలో పొరపాట్లు దొర్లకుండా చూచుకోండి. స్త్రీలకు:— చాల మందికి ఉన్నతవిద్యావకాశాలు, బంధువులరాక వలన, వారి సలహాల మూలాన విశేషధనం సంపాదనను గ్రహించండి.

కన్య : ఉద్యోగంలో చికాకు కల్గుతుంది. మనశ్శాంతి కొరవడగలదు. చేసే ప్రయత్నాలు ఫలవంతంగావు. విరోధులు తల ఎత్తుతారు. వస్తువులు పోగొట్టుకుంటారేమో జాగ్రత్త. వర్తకులకు ఋణవ్యవహారాల ధనాన్నిగూర్చి వత్తిడిరాగలదు. స్త్రీలకు:— విద్యా వైజ్ఞానిక రంగాలలో అవకాశాలు, వృత్తిలో ప్రగతి మొదలైన గలవారం.

తుల : తలచిన కార్యాలు సుకరంగా సాగవు. మధ్య మధ్య అంతరాయాలుండగలవు. అయితే అంతంత మాత్రమే. అధిక వ్యయం అనుకోకుండా సంభవించనున్నది. జాగ్రత్తగా ఉండటం, భారీ వ్యాపారంలో నిపుణతతో జాగరూకతతో వ్యవహరించటం ఎంతైనా న్యాయం. స్త్రీలకు:— గృహ కార్యాలలో భారమనిపించటం, క్రీడారంగంలో ఇంతవరకు అవకాశాలులేకపోవటం గమనించగలరు.

వృశ్చికం : మీ ఉద్యోగం యథా ప్రకారం సాగిపోతుంది. గృహ విస్తరణ కార్యక్రమంచాలా మంది చేపట్టగలరు. అనుకున్న మార్గాలలో ధనం సంభవించినా, మానసికంగా అంత బాగుండే వారంగాదు. ఇరుగు పొరుగులతో, నింతశాంతంగా వ్యవహరిస్తే అంత మేలు. తగాదాలకు, మనస్తాపానికి దారి తీయగల గ్రహస్థితి గలదు. స్త్రీలకు:— ఉద్యోగ వృత్తులలో, వ్యాపారంలో జోక్యమున్నవారికి లాభదాయకం.

ధనుస్సు : నగలు కొనే ప్రయత్నం చేయగలరు. చాల మంది విషయంలో శుభ కార్య ప్రస్తావనలుండగలవు. క్రీడారంగంలో ప్రావీణ్యత గల వారికి అనుకూలతగల వారం. పదిమందిలో పేరు ప్రతిష్టలు సభాగౌరవం, పత్రికాగౌరవం, సంఘసేవలో రాణింపు చెప్పదగినవారం. స్త్రీలకు: భూముల వలన, క్రితము గావించిన లావాదేవీల వలన ధనాదాయం చెప్పదగిన వారం.

మకరం : మీ ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపవలసి రావచ్చు, రిక చెల్లించగల గ్రహస్థితిగలదు. వయసుమీరిన వారు, ఎంత జాగ్రత్త వహిస్తే అంత మేలు. ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నవారికి సర్వవిధాలా అనుకూలించేనవారం. అప్తమిత్రులమూలాన మీకు ఉపకారకాలు లభించగలవు. స్త్రీలకు: శుభ కార్య ప్రస్తావనలు, విలాస వస్తు సేకరణకు అవకాశాలు లభించగలవు.

కుంభం : పది మందిలో మీకు గౌరవం లభించనున్నది. పలు మార్గాలలో ధనాదాయం రానున్నది. పలుగుల వలన కావలసిన కార్యాలలో అనుకూలత సంభవించనున్నది. కృషి చేయండి. తోటలు, దొడ్లు వలన లాభం. వారం-వారాదినాలుగా జరుగని పనులు, ఈవారం సులువుగా నెరవేరగలవు. స్త్రీలకు : లలితకళా ప్రావీణ్యతగల వారికి, మంచి అవకాశాలుండగలవు.

మీనం : ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారు, గట్టిగా కృషిచేయాలి. అలాగైతే అవకాశాలుండగలవు. చాల మంది దూర ప్రయాణాలు చేయనున్నారు. ఉత్తరాల మూలాన లాభదాయకమైన వార్తలందగలవు. ఆరోగ్యలోపం లేదు. స్త్రీలకు:— చాల మంది ప్రమోషన్ లభించదగిన వారం. శుభకార్యానుకూలత, సభా గౌరవం, బహుమతి లభించటం, స్త్రీలకు చెప్పదగిన వారం.

— విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి

(గత సంచిక తరువాయి)

సీరియల్

జీవితగమ్యం

శ్రీమతి యర్రగుంట్ల వరలక్ష్మీదేవి

కోమలి తన చరిత్రను క్లుప్తంగా చెప్పింది తనకి చిన్నప్పుడే తన తండ్రి యాక్సిడెంటులో పోయాడని, తను పెద్దదయాక తల్లి పోయిందని, తరువాత తను అన్న దగ్గరకు వెళ్ళిందని, అక్కడ ఉద్యోగం దొరక్కపోతే ఈ వూరు వచ్చిందని, తన అదృష్టం బాగుండబట్టి ఈ ఉద్యోగం దొరికిందని చెప్పింది. మాలిని తల్లి కోమలిని ఆప్యాయంగా పలకరించింది.

"ఏమమ్మా! పెండ్లి చేసుకోవా? మీ అన్న నీకు పెండ్లి చెయ్యకుండా ఉద్యోగంలో పెట్టాడేమిటి?"

"దొడ్డమ్మగారూ! మా అన్నయ్యకు పెండ్లి చేయాలనుంది. నాకు పెండ్లి చేసుకోవాలని వుంది; కాని ఏ పెండ్లికొడుకు నన్ను చేసుకుందుకు రావడంలేదు. ఏం చెయ్యమంటారు చెప్పండి?" అని నవ్వుతూ కోమలి చెప్పింది. మాలిని తల్లికి అందులో ఉన్న హాస్యం అర్థం కాలేదు.

"అదేమమ్మా! బంగారపు బొమ్మలా వున్నావు. నిన్ను పెండ్లి చేసుకోడానికి ఎవరూ రాకపోవడమేమిటి? వాళ్ళకేం తెగులు?"

"అదేనండీ! డబ్బు తెగులు, కట్నాల తెగులు. అందుకే కట్నం లేకుండా ఏదైన రాయో ఏ దానయ్యో చేసుకుంటానంటే నేను సిద్ధమే."

"ఏమే కోమలి! ఈ మాటను గట్టిగా అనకు, కొంప మునిగిపోతుంది. మన ఆఫీసులోని గుమాస్తాలందరు నీవంటే, నీవని పోట్లాడుకోగలరు."

"ఏం? వాళ్ళకింకా పెండ్లి కాలేదా?"

"ఏదో మాటవరసకన్నానంతే. అందరికీ పెండ్లి అయింది, పిల్లలు కల్గారు. కాని నీవంటి అందగత్తె అతి సులువుగ పెండ్లి చేసుకుంటానంటే, ఉన్న భార్యల్ని పాపం వదిలేస్తారేమోనని నా భయం."

"ఛా మాలినీ! నువ్వు నీ మాటలు" ఇద్దరు హాయిగా నవ్వుకున్నారు.

భోజనాలయాక కోమలిని ఇంటి వరకు దిగబెట్టూ చెప్పింది మాలిని, "మా సొంత కథ మా కుటుంబ పరిస్థితిని. అందుకే నేను బయట ఎంత ఫ్రీగా, సరదాగా ఉన్నా ఆఫీసులో మాత్రం యువర్స్ మోస్టు ఒబీడిగంట్లీగా ఉంటాను. రాత్రిపడుకునే ముందు గమ్యంలేని, ఎడారి లాంటి నా బతుక్కు ఎంతో దిగులు పడ్తాను."

27

కోమలి డబ్బులు కూడబెట్టి ఎవ్వరికీ పంచవవసరం లేదు. కోమలికి ప్రస్తుతం నా అన్న వాళ్ళెవరూ లేరు. కోమలి పార్వతీపురంలో ఉన్నప్పుడే అన్న భాస్కర్ ఆమె క్షేమ సమాచారాలు కనుక్కోడం మానుకున్నాడు. ప్రభాకరం ఆనాడు కోమలికి వీడ్కోలు చెప్పడానికి పార్వతీపురం స్టేషనుకు వచ్చినప్పుడు, మాట వరసకైనా కాకినాడ చేరిన తరువాత క్షేమ సమాచారాల్ని తెలియజేస్తూ ఉత్తరం వ్రాయమన లేదు. కాని కోమలే మనస్సుండబట్టలేక తన ఆఫీసు అడ్రసిస్తూ, తనకు ఉద్యోగమైందని, క్షేమంగా ఉన్నానని వ్రాసింది. దానికి జవాబు రాలేదు.

ఇక మిగిలినవారు విశ్వనాధం మామయ్య, ఆయన సుపుత్రుడు సత్యం. కోమలికి తప్ప

జరిగినకథ 11 విమలమ్మ భర్త గోపాలం బ్యాంకులో హెడ్ అకౌంటెంటుగా పని చేస్తుంటాడు. వీరి పిల్లలు భాస్కర్, కోమలి. గోపాలం బావ రాఘవరావు విలాస పురుషుడు. ఉద్యోగంలో చేరిన దగ్గర్నుండి గోపాలం కూడబెట్టిన డబ్బును వ్యాపారంలో నష్టమొచ్చిందనే నెపంతో రాఘవరావు నోటు వ్రాసి తీసుకుంటాడు. గోపాలం అన్న బలరాం కూతురు లక్ష్మి రామునాయుడిని ప్రేమిస్తుంది. అతనితో 'లేచి'పోతూ ఉత్తరం వ్రాసి పెట్టి పోతుంది. ఓ యాక్సిడెంట్‌లో గోపాలం మరణిస్తాడు. అతనికి వెనకతను వ్రాసిచ్చిన నోటును అపహరిస్తాడు రాఘవరావు. విమలమ్మ ఇంట్లో తన కుటుంబంతో అద్దెకుంటున్న ధనంజయరావు ఆమెను బలాత్కారం చేయబోగా, అతనిని ఇంటినుండి గెంటివేస్తుంది. మొదట్నుంచి అనుకుంటున్నట్లుగా, తన కూతురు కోమలిని శేఖర్‌కిచ్చి మేనరికం చేస్తానని అడగ దానికి వచ్చిన విమలమ్మను రాఘవరావు అవమానిస్తాడు. తన మేనమామ విశ్వనాధం కూతురు సరోజని కాదని, తమ ప్రక్క వాటాలో అద్దెకుంటున్న జనార్దనస్వామి కూతురు శ్రీదేవిని ప్రేమించి పెండ్లి చేసుకొని ఆమె ద్వారా టాటా నగర్‌లో వచ్చిన ఉద్యోగంలో చేరాడు భాస్కర్. బలవంతం చేయబోయిన సత్యానికి తగినబుద్ధి చెబుతుంది కోమలి. తన పెద్దకొడుకు ఇంజనీరు శేఖర్ విషయంలో రాఘవరావు పెంచుకున్న ఆశలు అడుగంటిపోతాయి, అతను పైసాకట్నం తీసుకోకుండా ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ ఈశ్వరయ్య కూతురు జానకిని ప్రేమించి పెండ్లి చేసుకొంటాడు, ఆమె తన భర్త తరపు వాళ్ళనిగాని, చివరకు అత్తమామలను గూడా ఆదరించి ఇంట్లో ఉండనిచ్చేదికాదు. రామచంద్రయ్య కొడుకు కృష్ణమూర్తితో కోమలి పెండ్లి నిశ్చయమైన తరువాత, కొన్ని అనివార్య కారణాలవల్ల ఆ సంబంధం చెడిపోతుంది. ఆ తరువాత కృష్ణమూర్తితో సరోజ పెండ్లి జరుగుతుంది. కూతురు పెళ్ళి ఆగిపోయిందనే దిగులుతో విమలమ్మ చనిపోగా కోమలిని భాస్కర్ తనతో తీసుకువెళ్తాడు. అక్కడ శ్రీదేవి కోమలిని నానాబాధలూ పెడుతూ వుంటుంది. శ్రీదేవి చెప్పే ఇంటి పనులు చెయ్యలేక ఆమెను ఎదిరించి, ఆ ఇంటినివదిలి తన పెదనాన్న బలరాం కొడుకు ప్రభాకరం ఇంటికి చేరుకుంటుంది కోమలి. కోమలికి కాకినాడలో ఉద్యోగం రాగా వెళ్ళి జాయిన్ అవుతుంది. అక్కడ ఆమెకు మాలినితో పరిచయం ఏర్పడుతుంది.

పోయిన సంబంధం విశ్వనాథం కూతురుకు అయినప్పటి నుండి ఏదో తెలియని గోడ కోమలి అంత రంగంలో లేచింది. ఆ అడ్డంకును దాటి, ఆ కుటుంబం వైపు విరుకో చూడలేక పోతూంది కోమలి. ఇంక సత్యం! సత్యంకున్న ప్రలోభమంతా కోమలిని పొందుదామనే!కాని కోమలికిప్పటికీ సత్యం మీద సదభిప్రాయం కలుగలేదు. తన కన్నా తక్కువ చదువుకున్నాడనో, మోటారు షెడ్డులో మెకానిక్కనో, తొందరపడి కోమలి అభీష్టాన్ని తెల్సుకో కుండా ఆనాడు అసభ్యంగా ప్రవర్తించా డనో ఏమో సత్యంపై కోమలికి మంచి అభిప్రాయం లేదు.

నిజమే! సత్యం ప్రవర్తన టాటూ వచ్చి నప్పుడు చాల మర్యాదగా, హుందాగానే ఉంది. సత్యం తన గురించి అలా తప్పుగా పెండ్లివారికి వ్రాసి తన పెళ్ళి చెడగొట్ట డానికి ప్రయత్నించడం నీచంగానే తోచింది కోమలికి. కాని, సత్యం పశ్చాత్తాపం, తను ఎంత నీచంగా ప్రవర్తించిందీ గుర్తించి బాధపడడం చూస్తే కోమలికి అతనిమీద జాలి కలుగకపోలేదు. తన పెండ్లి చెడడానికి అతడి ఉత్తరమే కారణం కాదు, విశ్వనాథం మామయ్య స్వయంగా ఆ రాజమండ్రి సిద్ధాంతి వ్రాసిన ఉత్తరం చదివానని చెప్పాడు. ఆ సిద్ధాంతే జాతకాలు పడలేదని, ఆ వివాహం జరపకపోవడమే మంచిదని వ్రాసాడుట. ఇంతకీ తన ఖర్మని ఎవరు తప్పించగలరు. ఎవర్ని నిందించి ప్రయో జనం లేదు.

అందుచేత కోమలి ఒంటరిదై పోయింది. ఇదికూడా ఒకందుకు మంచికే దారితీసింది. తనిప్పుడు స్వేచ్ఛాజీవి. ఆరోగ్యం బాగుంది, అందంగా వుంది. తను బాగా ఆర్జించు కుంటూ కావల్సిన తిండీ, కావల్సిన బట్ట, కొనుక్కోగల్గుతూంది. మంచి ఉద్యోగం, ఆప్తులలాంటి తోటి ఉద్యోగులు. అందుకే ఇప్పుడు కోమలికి ఏ చింతా లేదు. పైగా గర్వించేది, సంతోషించేది. కాని ఒక్కొక్క ప్పుడు అంతమంది బంధువులుండి కూడా తను ఏకాకి కావడం కోమలికే ఆశ్చర్యంగా ఉండేది.

కోమలికి ఇప్పుడున్న ఆప్తురాలు మాలినే. మిగతా సహోద్యోగులు వారి వారి పనుల్ని చూసుకుని ఆఫీసు పని ముగియగానే



ఎవరిళ్ళకు, ఎవరి సంసార బాధ్యతల్ని వారు నిర్వర్తించడానికి వెళ్ళిపోయేవారు. కోమలికి దగ్గరగా చేరిన స్నేహితురాలు మాలిని మాత్రమే. దానికి కారణం మాలిని తన లాంటి స్థితిలో ఉండడమే. పైగా మాలినికి ఎన్నో బరువు బాధ్యతలు. మానసికంగ మాలిని కూడ కోమలి లాగే ఒంటరిదే. అందుకే కోమలి, మాలిని అల్పకాలంలోనే అతి సన్నిహితులయ్యారు.

చిల్లర ఖర్చులన్నీ కోమలే పెట్టేది. అప్పుడప్పుడు సినిమాలకు, హోటళ్ళకు మాలినిని తన ఖర్చుపైనే కోమలి తీసుకుని వెళ్ళేది.

"చూడు కోమలీ! రిక్షాకి డబ్బులు నువ్వే ఇస్తున్నావు, ఇంకా సినిమా టిక్కెట్లు నువ్వేకొంటున్నావు. ఎప్పుడూ ఈ వన్‌వే ట్రాఫిక్ నాకు నచ్చటంలేదు. నువ్వుతెచ్చు కొంటున్నంత జీతం నేను తెచ్చుకుంటు న్నాను గనుక నన్ను అప్పుడప్పుడు ఖర్చు పెట్టనీయ్."

"అదికాదు మాలినీ! నన్ను అర్థం చేసుకో. నీ ఆత్మాభిమానంకు భంగపాటు కల్గించాలని నా ఉద్దేశంకాదు. నీకు బాధ్యత లున్నాయి, నీ మీద ఆధారపడేవాళ్ళు ముగ్గు రున్నారు. నాకెవరున్నారు చెప్పు? మిగిలిన

డబ్బును కూడబెట్టి నన్నేమి చెయ్యమన్నావు చెప్పు? అధికమైన డబ్బు వ్యర్థం కాదూ?"

"డబ్బును బాగా కూడబెట్టి, అయిదు వేలయ్యాక కట్నం ఇచ్చి పెండ్లి చేసుకో."

"గొప్ప సలహా ఇచ్చేవు మాలినీ! డబ్బు పెట్టి మొగాణ్ణి కొనుక్కోమని సలహా ఇస్తున్నావా? దాని బదులు డబ్బును అందానికి విలువగ పుచ్చుకుని, ఎవరైనా ఉంచుకోడం ఇంతకన్నా గౌరవం కాదూ?"

"బాగున్నాయిలే నీ పాడు ఊహలు. నోరు మూసుకో ఎవరేనా వింటే సిగ్గు చేటు"

"నా నోరు మూయించాలంటే ఒకటే మార్గం! నేను ఈ చిల్లర మల్లర ఖర్చులు చేస్తున్నప్పుడు నువ్వు నోరు తెరవక పోవడమే! ఏం?"

"సరే! పదా, షో మొదలెట్టినట్టుంది"

శలవురోజుల్లో ఇద్దరు, మాలిని చెల్లెల్ని తమ్ముణ్ణి తీసుకుని యానాం వెళ్ళి గోదావరి ఒడ్డున కూర్చునేవారు సరదాగా. లేదా ద్రాక్షారామం వెళ్ళి భీమేశ్వరుని దర్శనం చేసుకునేవారు. కోటిపల్లి వెళ్ళి కోటిఫలాలను దర్శన మాత్రం చేత ఇచ్చే ఈశ్వరుని సేవించేవారు. ఒక్కోసారి అన్నవరం వెళ్ళి సత్యదేవుని ఆరాధించివచ్చేవారు. అప్పుడప్పుడు సముద్ర తీరంకు వెళ్ళి హాయిగా గడిపి వచ్చేవారు. కార్తీక మాసంలో హాయిగా ఆఫీసు స్టాఫంతా సర్పవరం తోటలలో పిక్ నిక్ చేసుకుని వచ్చేరు. మేనేజరు మోహనరావు మాత్రం పనుండి హైదరాబాదు వెళ్ళడం వల్ల రాలేక పోయేడు.

అలా ఆనందంగ ఓ ఎనిమిది నెలలు గడిచిపోయేయి. ఇప్పుడు మేనేజరు వద్ద కోమలికి మునుపున్న జంకు, భీతి ఇప్పుడు లేవు. గౌరవం మాత్రముంది. అందుకే స్వేచ్ఛగా మసలేది. ఒక్కొక్కప్పుడు అతిధులు లేనప్పుడు కోమలిని తన టేబిల్ వద్ద కూర్చుని తనతో టిఫిన్ తీసుకోమనేవాడు. ఒక్కొక్కసారి టైపువేసిన కాగితాలు అందిస్తున్నప్పుడు చేతులు తగులుతే, కోమలి ముఖంలోకి చిరునవ్వుతో చూచేవాడు. కోమలి మనస్సు అదోలా అయ్యేది. మేనేజరు మోహనరావు అందమైనవాడు. అతడి చూపులో చాలా ఆకర్షణ ఉంది. మంచి మాటకారి. అతడి మాటల్ని వింటుంటే కోమలికి ఏదో అవ్యక్తానందంగ ఉండేది. ఇంటిలో కన్నా

జీవితగమ్యం

ఆఫీసులో ఉన్నప్పుడే కోమలి సరదాగా కాలం గడిపేది.

ఏనాడేనా మేనేజరు క్యాంపుకు వెళ్ళిన నాడు అంతగా పని లేకపోతే ఆఫీసులోకి వెళ్ళి జగన్నాధంగార్ని అడిగి ఆఫీసులో ఏమైనా టైపింగుచేయడానికి కాగితాలుంటే తీసుకుని వచ్చేది. మేనేజరుకు చేరువలో ఉన్న స్టెనో నన్నగర్వం వ్యక్తపరచేదికాదు. ఆఫీసులోని ఉద్యోగులందరి తోటి చనవుగ ప్రవర్తించేది. అనవసరంగా ఇతరుల గొడవలలో తల దూర్చేది కాదు. అందుకే అందరికీ కోమలంటే మంచి అభిప్రాయముండేది. ముఖ్యంగా జగన్నాధంగార్కి సన్నిహితురాలైంది. అతడు తన కూతురులా చూచుకునేవాడు కోమలిని. కోమలి తన మంచితనంతో అందరి అభిమానాన్ని సంపాదించింది.

ఒకనాడు కోమలి ఏవో రెండు తువ్వాళ్ళు కొనుక్కొందుకు బజారుకెళ్ళింది. ఆనాడు మాలిని వాళ్ళింటికి ఎవరో బంధువులు వచ్చేరని కోమలి వెంటబజారుకు రాలేకపోయింది. కోమలి అలా బజారులో ఉన్న అందమైన దుకాణాల్ని చూస్తూ, ఓ షాపులో రెండు టర్కీటువ్వాళ్ళను కొనుక్కుని వస్తోంది. ఇంతలో కారొకటి వచ్చి తన ప్రక్కనఆగింది.

"కోమలీ! మీరా! కారెక్కండి," అని మేనేజరు మోహనరావు ముందువైపు కారు తలుపును తెరిచేడు. కోమలి మోహనరావును గుర్తించి చిరునవ్వు నవ్వింది. మరే ఆలోచన చెయ్యక కారులోకి పోయి మోహనరావు ప్రక్క సీటులో కాస్త దూరంగా, తలుపుకు దగ్గరగ కూర్చుంది.

"ఎక్కడకు వెళ్తున్నారు?"

"ఏవో రెండు తువ్వాళ్ళను కొనుక్కుని అలా షాపులన్నీ చూసుకుంటూ ఇంటికి పోతున్నాను. మీరెక్కడికి సార్, ఇలా పోతున్నారు?"

"ఊసుపోక, న్యూ థియేటరుకు మంచి ఇంగ్లీషు పిక్చరొస్తే చూద్దామని పోతున్నాను. ప్లీజ్. మీరు కూడా రండి, కాస్త కంపెనీగా ఉంటుంది."

"సార్! నేను ఇంటికి..."


"వెళ్దురుగాని తొందరేం! ఇంటి వద్ద మీ వాళ్ళెవరూ లేరుగా!"

"అది నిజమేగాని..."

"మరి అభ్యంతరం చెప్పకండి. ఒకణ్ణి ఎలాగడపడమా అని దిగులు పడుతుంటే, అదృష్టవశాత్తు మీరు తటస్థపడ్డారు. నా ఆనందాన్ని పాడుచెయ్యకండి. ప్లీజ్! రండి."

"సరే!"

సినిమా హాల్లో మోహనరావు ప్రక్కన కూర్చుందిగాని ఏమిటో జంకుగానే ఉంది. ఇంటర్వెల్లో లాబీలో కాఫీ త్రాగుదాం రమ్మన్నాడు. తనకి ఆ టైములో కాఫీ త్రాగడం ఇష్టంలేదని చెప్పింది. మోహనరావు వెళ్ళి మళ్ళీ పిక్చరు మొదలెట్టేక వచ్చేడు. [illegible] కోమలి చేతిని అందుకున్నాడు. కోమలి గుండెలువేగంగాకొట్టుకోడం మొదలెట్టేయి. ఆ భయంతో బాటు ఆనందము లేకపోలేదు. ఒక్క నిముషం పాటు కోమలి మెత్తని చేతిని మృదువుగా పట్టుకుని ఆ చేతిలో తను తెచ్చిన కేకుని ఉంచేడు.



"తినండి! బాగుంది కేక్."

కోమలి సిగ్గుపడుతూనే ఆ చీకట్లో ఆ కేకుని తిని, హేండు బాగులోంచి రుమాలు తీసి తుడుచుకుంది. సినిమా జరుగుతూంది. ఓ మంచి రసికమైన ఘట్టం వచ్చింది. హీరో, హీరోయిన్‌ని గాఢంగా కౌగలించుకుని ముఖమంతా ముద్దులాడేస్తున్నాడు. కోమలికి అదోలా అయిపోయింది శరీరం. మోహనరావు అనుకోకుండా జరిగినట్టు తన చేతిని మెల్లగా జార్చి, కోమలి తొడను మోకాలుకు చేరువలో గట్టిగా ఒత్తి పట్టుకున్నాడు. ఒక్కసారి కోమలి శరీరంలో విద్యుత్ ప్రవహించింది. దేహంలో ఏదో తియ్యని బాధ ప్రవేశించింది. మెల్లగా తన చేతితో మోహనరావు చేతిని తోసేసింది.

"సారీ! సారు నేను..." ఏదో ఇంకా చెప్పబోయి ఊరుకున్నాడు.

సినిమా అయిపోయింది. బయటకు వచ్చేసేరు!

"మీరిప్పుడు ఇంటికివెళ్ళి ఏం వండుకుంటారు మాయింటికి రండి. మా వంటవాడు చాలా బాగా వంట చేస్తాడు. నాతో భోజనం చేద్దురుగాని. డిన్నరు అయిపోగానే నేనే మీ యింటికి కారులో దిగబెడతాను. ప్లీజ్," తన ఆకర్షణంతా ఉపయోగిస్తూ అందంగా, చిరునవ్వుతో కోమలి కళ్ళలోకి చూస్తూ కోరాడు.

ఒక్కక్షణం కోమలి లొంగి పోయింది. సరేననబోయింది! మరుక్షణం ఆ ఆకర్షణ నుండి బయటపడి తెలివి తెచ్చుకుని, "క్షమించాలి సార్! నేను మా యింటికే పోతాను. ఇంకా తొమ్మిదైనా కాలేదు. అరగంటలో వంటచేసుకోగలను. ఇక్కడికు దగ్గరే మా ఇల్లు. నేను నడుచుకునే పోతా, మీరు వెళ్ళిపోండి సార్!"

మోహనరావు కోమలి ముఖంలోకి చూసి మరి లాభంలేదని గ్రహించి, "సరే! గుడ్ నైట్," అని చెయ్యిచాచేడు. మళ్ళీ అదే అందమైన చూపు, తన మనస్సును లాగుతున్న చిరునవ్వు. ఆ ఆకర్షణకు తట్టుకోలేక చెయ్యి చాచింది. మోహనరావు ఆ చేతిని మృదువుగా నొక్కి వదిలేసాడు. కారులో వెళ్ళిపోయాడు.

కోమలి దగ్గరలో ఉన్న హోటల్లో రెండు చపాతీలు పాకెట్టు కట్టించుకుని, కిళ్ళీ బడ్డీలో నాలుగు అరటిపండ్లు కొను

జీవితగమ్యం

క్కుని ఇంటికిపోయి అవి తినేసి పడుకుంది. కాని నిద్ర పట్టలేదు. మనస్సులో ఏవేవో ఆలోచనలు గజిబిజిగా అలుముకుంటున్నాయి. ఒకవైపు ఏదో భీతి, మరోవైపు ఏదో తియ్యని అనుభూతి. తనుగాని మోహనరావుని ప్రేమిస్తూందా? మోహనరావు తనను ప్రేమిస్తున్నాడా? లేక అతడికి తనపట్ల ఉన్నది వట్టి వ్యామోహం మాత్రమేనా? మోహనరావు చూపు, ఆ అందమైన నవ్వు జ్ఞప్తికి వచ్చి కోమలిని గిలిగింతలు పెడుతున్నాయి.

ఏ మూడో జాముకో కోమలికి నిద్రపట్టింది. ఆ నిద్రలో ఓ మధురమైన కల వచ్చింది. పెండ్లి పీటలమీద కూర్చుని కోమలి, మోహనరావు తలంబ్రాలు పోసుకుంటున్నారు. తరువాత ఇద్దరు పడవలాంటి ఓ పెద్ద కారులో ఊరేగుతున్నారు. కారులో గట్టిగా కోమలి మెత్తని ముంజేతిని నొక్కుతున్నాడు. తన ప్రక్కన కారులో కూర్చున్న మాలిని అది చూసి విరగబడి నవ్వుతూంది.

"గట్టిగా నొక్కకండి సార్! అది గాజుబొమ్మ! విరిగిపోగలదు జీవితాంతం అంటి పెట్టుకోగలదు." ఆ మాటవిని కొందరు పెండ్లివారు గొల్లున నవ్వేసారు. కోమలికి చెప్పలేనంత సిగ్గు వచ్చింది.

పాలవాడి కేకతో 'కల' చెదరిపోయింది!

28

నాలుగు రోజుల తరువాత ఓ చల్లని సాయంత్రం గదిలో కూర్చుని స్నేహితురాండ్రిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. మాలినికి తను కొన్న దుస్తులు చూపించింది.

"చాలా బాగున్నాయే! ఎంత అయ్యాయి?"

"ఒక్కొక్కటి పదేసి రూపాయలు. ఏ. పి. ఎస్. షాపులో కొన్నాను."

"నేను వచ్చే నెలకి ఒకటి కొనుక్కుంటాను. నిన్న రంగుది. అన్నట్టు కోమలీ, స్వప్నలో ఓ మంచి ఇంగ్లీషు పిక్చరొచ్చిందోయ్. అందులో అన్నీ ప్రణయ ఘట్టాలేనట. అకౌంటు క్లర్కు కామాక్షి చెప్పింది. ఒక్కొక్క సీను చూస్తుంటే ఆపిడగారిక్క ప్రక్కనున్న భర్తని అమాంతం కౌగలిం

చేసుకోవాలనిపించిందట. రేపు మధ్యాహ్నం వెళ్తామా ?"

కోమలి ఇబ్బందిలో పడిపోయింది. మాలినికి చెప్పాలా వద్దా ? స్నేహితురాలి దగ్గర రహస్యం దాచడమా ? ఒకవేళ ఈ వ్యవహారంలో తనకి మాలిని సహాయం కావల్సి వస్తుందేమో మున్ముందు.

"మాలినీ! నేనా సినిమా చూశాను."

మాలిని ఆశ్చర్యపోయింది.

"ఎప్పుడోయ్ ? నాకు చెప్పనైనా లేదే!"

"అంత చెప్పదానికేముందని! అందుకే చెప్పలేదు."

"నువ్వు ఒక్కర్తివే వెళ్ళావా ?" అను మానంగా చూసింది.

"లేదు."

మాలినికి అనుమానం ఎక్కువైంది.

"ఏమిటే! పబ్లిక్ పరీక్షల్లో జవాబు వ్రాస్తున్నట్లు అసలు జవాబులు, వివరింత వెళ్ళావు. నన్ను మరి సస్పెన్సులో ముంచే యక ఆ బోయ్ ఫ్రెండెవరో చెప్పేయ్" అని నవ్వుతూ కోమలిని కాస్త గిల్లి అడిగింది.

కోమలి కాస్త జంకుతూ, తటపటా యించి, "మన బాస్ మోహనరావుగారితో" అని చెప్పేసింది అల్లరికి.

"ఆం!" అని మాలిని చాల ఆశ్చర్య పోయింది. ఓ రెండు నిముషాలు మాట్లాడ లేకపోయింది. మాలిని నవ్వు మాయమై పోయింది. ముఖం గంభీరంగ మారింది. మాలిని తనకి అభినందనలు తెల్పుతుందనుకుందిగాని అలా చెప్పలేదు. మాలిని సూటిగ కోమలి ముఖంలోకి చూసింది.

"కోమలీ! మన మేనేజరు మోహన రావుకి వివాహమైందని, మూడేళ్ళ కొడుకు, ఒక సంవత్సరం అమ్మాయి కూతురు ఉన్నారని నీకు తెలుసా ?"

"ఏమిటీ!!"—అప్పుడు ఆశ్చర్యపోవడం కోమలి వంతయింది.

"నిజంగానా ?"

"నీతో అబద్ధమాడవల్సిన అవసరం నాకేముంది చెప్పు. పోని మన మేనేజరు గారి ప్యూను రామయ్యను అడుగు. వాడే చెప్తాడు."

"నీకెలా తెల్సు ?"

"నాకెలా తెలిస్తేనేమిలే! అదిమాత్రం అనుమానంలేని నిజం. మోహనరావు భార్య మాధురిదేవి చాల అందంగా ఉంటుంది కూడ."

కోమలి నిశ్చేష్టురాలైంది. తల దిమ్మె క్కిపోతూంది. తను చిన్నపిల్లా కన్నది! తను ఎంత పొరబాటు చెయ్యబోయింది! అంత చక్కని భార్యను పెట్టుకుని అతడికి దేమిబుద్ధి ? తనను అతడు ఎందుకు ఆ రాత్రి భోజనం నెపంతో తనింటికి రమ్మని పిలిచినట్టు ? కళ్ళతో కాంక్ష తొంగి చూస్తూండెనే—ఎంతమోసం! తను ఒక విధంగా అదృష్టవంతురాలు. లేకుంటే అతడి ఆకర్షణకు లొంగి, పరిస్థితుల్ని తెల్సుకోక అతడితో అతడింటికి వెళ్ళుంటే తను పతనమైపోయుండేది. ఆ విషయాన్ని తల్చుకుంటేనే కోమలికి చెమటలు పట్టేసాయి.

"కోమలీ! నువ్వు నాకు ప్రాణ స్నేహితురాలివి. నీ మేలును నేను కోరేంతగ ఎవ్వరు కోరరు. నాదో చిన్న సలహా. నువ్వుమాత్రం మన బాస్‌తో స్నేహం చెయ్యకు. అతడి మనస్సు రూపమంత అందమైంది కాదు. అతడికి ఎంత దూరం ఉంటే అంత మంచిది."

మేనేజరు మోహనరావు గురించి మాలినికి ఇంతగా ఎలా తెల్సా అని ఆశ్చర్య పోతూ మాలిని ముఖంలోకి చూసింది. మాలిని ఆ చూపును తట్టుకోలేక తల దించుకుంది.

చెల్లని రూపాయి

నా దగ్గ
ఓ చెల్లని రూపాయి
దాన్ని పట్టుకొని
ఉద్యోగం కోసం
నిర్విరామంగా
వెతికి — చితికి
క్రుంగి — కృశించి
విసిగి — విసిగి
చిట్టచివరకు
దాచుకొన్నానెప్పో
ఆశలు తీర్చని
అభయ హస్తాలను
ఆరని మారని ఈ
జఠరాగ్ని హృదయంలో!

—నాని గిరి.

ఆ మరునాడు కోమలి ఆఫీసుకు వెళ్ళ గానే ప్యూను రామయ్యను తన రూములోకి పిలిచింది. అప్పటికింకా మేనేజరు రాలేదు.

"రామయ్యా! మన మేనేజరుగారికి ఎంతమంది పిల్లలు ?"

"ఆ బాబుకాండీ, ఒక కొడుకు, ఓ చిన్న పిల్ల. పిల్లలు బొమ్మలాగుండి, చాల ముద్దొస్తారండీ. అమ్మగారు కూడా చాలా బాగుంటారండీ. ఆ అమ్మగారి పుట్టింటోరు బాబుగారికంటే చాలా గొప్పోళ్ళట."

"బాబుగారిల్లెక్కడ ?"

"అలా వీధికి టౌను మండి వెళ్తాంటాంకదండి. ఆ రోడ్డు ప్రక్కగా వీధికి ఓ పర్లాంగు దూరంలో ఉంటుందండి. ఆ గులాబీరంగు మేడండి—చాల బాగుంటుంది."

"సరే! నువ్వెళ్ళు."

కోమలి అనుమానం నివృత్తి అయింది.

ఆ మరునాటి నుండి కోమలి తన ఉద్యోగ నిర్వహణలో పరిధుల్ని దాటకుండా ప్రవర్తించడం మొదలెట్టింది. అవసరానికి మించి చిరునవ్వులు మానుకుంది.

"కోమలిగారూ రండి! నా ఛేంబరులోనే ఫలహారం చేద్దాం."

"క్షమించాలి సార్! నాకు కడుపు నొప్పిగా వుంది. ఈపూట టిఫిను మానేద్దామనుకుంటున్నాను" అని చెప్పి తన గదిలోకి వచ్చి వెంటనే టైపు చెయ్యడం మొదలెట్టింది. మేనేజరుకు ఒకవేళ కోపం వచ్చిందేమోనని కాస్త జంకు కల్గింది.

ఆశ్చర్యపోతూ, అనుమానంగా కోమలి వెళ్ళిన వేపే చూస్తుండిపోయాడు. కోమలి చూపులో, ప్రవర్తనలో మార్పును మోహన రావు గమనించాడు. అతడికి ఏదో సందేహం కల్గింది. బెల్ నొక్కి ప్యూనుని పిలిచి మాలినిని పిలవమన్నాడు. మేనేజరు గదికి స్టెనో గదికి మధ్యన స్ప్రింగు డోరుంది. అది మూసి ఉంది. తను ఏం మాట్లాడినా ఆ ప్రక్క గదిలోకి వినిపించదు, తను ఇంటర్ కామ్ ఫోనులో పిలిచేవరకు.

మాలిని వచ్చింది— "గుడ్ మార్నింగ్ సార్."

"గుడ్ మార్నింగ్! అలా కూర్చో."

"ఏమిటి సంగతి సార్! చాల రోజుల తరువాత నేను జ్ఞాపకానికి వచ్చాను."

"మాలినీ! నువ్వుగాని నా విషయమై కోమలితో చర్చిస్తున్నావా ?"

ధర్మపథం

దైవశక్తి తారతమ్యాలు

సర్వ వ్యాపియగు భగవంతుడు జీవాత్మ రూపంలో ప్రతి ప్రాణిలోనూ ఉంటాడు. ఆ పరాత్పరుడు సాటిలేని గొప్ప శక్తి కలవాడు కాబట్టి ఆతని శక్తి సర్వ ప్రాణులలోనూ ఉండనే ఉంటుంది. అయితే—అందరిలోనూ ఆ శక్తి ఒక్కమాదిరిగా ఉండదు. అందులో వ్యత్యాసం కానవస్తుంది. ఎలాగంటే — త్రిమూర్తులకున్న శక్తి తక్కిన దేవతలకు లేదు. వారికున్న శక్తి ప్రజాపతులకు లేదు. ఇక—మనుష్యులకుండే శక్తి పై వారి శక్తుల కంటె చాలా తక్కువ అని వేరే చెప్పనక్కరయే లేదు.

ఇలా వ్యత్యాసం కలగడానికి కారణమేమిటి? అని ప్రశ్న కలగవచ్చును. దీనికి సమాధానంగా చక్కని ఉదాహరణను ప్రాచీనులు చూపియే ఉన్నారు. అగ్ని ఒక చోటనే ఉన్నప్పుడు దగ్గరగా ఉన్నవారికి ఎక్కువ వెలుగు, వేడిమి ఉంటాయి. దూరమయినకొద్దీ ఆ వెలుగు, వేడిమి తగ్గిపోతాయి. ఆ విధంగానే భగవంతుని శక్తిలో తారతమ్యం కానవస్తుంది. అది సమీప, దూరాలనుబట్టి ఎక్కువ తక్కువలుగా ఉంటుంది.

"ఏక దేశ స్థితస్యాగ్నేః
జ్యోత్స్నా విస్తారిణీ యథా,
పరస్య బ్రహ్మణః శక్తిః
తథేద మఖిలం జగత్.
తత్రాప్యాసన్న దూరత్వాత్
బహుత్వ స్వల్పతామయః."

పరాత్పరుని శక్తి ఎవరిలో ఎలా ఉండేదీ ఈ క్రింది శ్లోకాలనుబట్టి తెలుసుకోవచ్చు.

"బ్రహ్మ విష్ణు శివా బ్రహ్మన్
ప్రధానా బ్రహ్మశక్తయః,
తతశ్చ దేవా మైత్రేయ!
న్యూనా దక్షాదయ స్తతః,
తతో మనుష్యాః పశవో
మృగపక్షి సరీసృపాః.
న్యూనా న్యూనతరా శ్చైవ
వృక్ష గుల్మాదయ స్తథా."

పయి విషయం విష్ణు పురాణంలో ఉన్నది. ఈ విషయాన్ని పరాశరుడు మైత్రేయునికి తెలియజేస్తున్నాడు.

పరబ్రహ్మ యొక్క శక్తి బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురిలోనూ ప్రధానంగా ఉంటుంది. తర్వాతివారు దేవతలు. వారిలో ఈ శక్తి అంతకంటె తక్కువ. దేవతలలో ఉన్న దైవశక్తి కంటె దక్షాది ప్రజాపతులలోని శక్తి తక్కువ. తర్వాత మానవులు వస్తారు. వారి తర్వాత పశువులు, పక్షులు, మృగాలు, సరీసృపాలు ఆ వెనుక చెట్లు చేమలు వస్తాయి. వీటన్నింటిలోనూ ఆ శక్తి క్రమంగా తగ్గిపోతూ ఉంటుంది.

— బులుసు వెంకటరమణయ్య

జీవితగమ్యం

మాలిని ఆశ్చర్యాన్ని అభినయిస్తూ "ఏంలేదే! మీ ప్రస్తావనే రాలేదే! ఏంసార్, ఏం జరిగింది? మీ స్నేహానికి ఏమైనా అంతరాయం కల్గిందా?"

"షటప్! నేనేమి కోమలితో స్నేహం చెయ్యడంలేదు."

"నాకు మీ సంగతి తెలియదా సార్!"

"మాలినీ! నువ్వుగాని నా విషయమై ఏమైన కోమలిక చెప్పేవంటే జాగ్రత్త — నీ ఉద్యోగం ఊడిపోగలదు."

"మీరు మీ నీడనే చూసుకుని బెదరుతున్నారు. నేను నా ఉద్యోగాన్ని పోగొట్టుకునే పనేమి చెయ్యలేదు, చెయ్యనుకూడ."

"గుడ్! మాలినీ, నువ్వు తల్చుకుంటే నాకు కొన్ని సహాయాలు చెయ్యగలవు. ఆలోచించుకో—నీకు ఒక ఇంక్రిమెంటు ఇప్పిస్తా. ఆఫీసు పని మీద మద్రాసు వెళ్ళేప్పుడు నిన్ను తీసుకుని వెళ్తా—ఏం?"

"సరే! మరి నేను నా సీట్లోకిపోవచ్చా సార్."

"నేను చెప్పింది మాత్రం గుర్తుంచుకో."

ఆ రాత్రి ఎవ్వరు వినకుండా మాలిని తన గదిలో ఎంతోసేపు దుఃఖించింది తన స్థితికి.

ఆ తరువాత మోహనరావు మామూలుగానే, తను మేనేజరు కోమలి తన ఉద్యోగి అన్నట్టుగానే ప్రవర్తించాడు. కోమలి తను పొరబడి మోహనరావు గురించి తప్పుగా ఊహించానేమో అనుకుంది. ఓ రెండు నెలలు గడిచిపోయాయి.

ఒకనాటి మధ్యాహ్నం నాలుగు గంటలకి స్టెనోని పిలిచాడు మేనేజరు.

"మిస్ కోమలి! ఇవాళ ముఖ్యమైన ఉత్తరాలు చాల ఉండిపోయేయి. రేపు ఆదివారం. నా కింటిదగ్గరకు కొంతమంది ఫామిలీ ఫ్రెండ్సు వస్తారు. అందుచేత నేను ఆఫీసుకు రాలేను. నేను ఈ సాయంత్రం ఇంటికి వెళ్తున్నప్పుడు ఈ ఉత్తరాల ఫైల్ని, మీ టైప్‌రైటర్ని, తెల్లకాగితాల్ని కారులో నా ఇంటికి తీసుకుని వెళ్తాను. మీరు రేపు మధ్యాహ్నం మూడు గంటల తరువాత నా బంగళాకు వస్తే, అక్కడ ఈ ఉత్తరాలన్నిటికీ జవాబులు డిక్టేటుచేస్తాను. మీరు టైపుచేసి నా సంతకాలు తీసుకుంటే రేపు సోమవారంనాడు మొదటి పోస్టులో పంపించేయొచ్చు. అందుకు కావల్సిన మెమో కాగితాలు, నేవీఫోల్డ్ కాగితాలు ఈ సాయంత్రం నా కారులో పెట్టించండి. ఏం, వస్తారుకదూ?"

"సార్! మీ ఇంటికి..."

"ఏం మా ఇంటికి రావడానికి మీకు భయమా? ఇది చాల ముఖ్యమైన వ్యవహారం. ఆ జవాబులు అర్జంటుగ వెళ్ళవల్సిందే! మీరు దయచేసి నాతో కోపరేటు చెయ్యాలి, ప్లీజ్."

మోహనరావు చిరునవ్వు నవ్వలేదు. గంభీరంగా మేనేజరు మాట్లాడినట్టుగ మాట్లాడేడు. కాదంటే కోపం తెచ్చుకొని ఘర్షణ పడేటట్టున్నాడు. తొందరపడి ఈ ఉద్యోగానికి ఉద్వాసన చెప్పి వీధిని పడడానికి కోమలికి మనస్కరించడంలేదు. 'ఇంతకీ ఫామిలీ ఉందిట కదా, ఫామిలీ ఫ్రెండ్సు వస్తున్నారు. అందరు ఉన్నప్పుడు నాకేం భయం దేనికి' అని కోమలి ధైర్యం చెప్పుకుంది.

"సరేసార్! వస్తాను."

భాగ్యలక్ష్మి

మిమ్ముల్లను వరించబోతోంది



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాటరీ

టికెట్ ఖరీదు
రు 1/-

మొదటి డ్రా:
1-9-80

బహుమతుల విలువ:
రూ. 15,00,000


ప్రత్యేక బహుమతి: రూ. 5,00,000/- (అన్ని సిరీసులకు చేర్చి)

బహుమతుల మొత్తము : 40,157

విక్రయిదార్లు:
ఆంధ్రప్రదేశ్ స్టేట్
ట్రేడింగ్ కార్పొరేషన్ లి.

ఆంధ్రప్రదేశ్ స్టేట్ లాటరీస్ డైరెక్టరుచే జారీ చేయబడినది.

ప్రతి 99 టికెట్లకు 1 బహుమతి గ్యారంటీ



జీవితగమ్యం

"చాల థాంక్స్! మీరు డ్యూటీలో చాల సిన్సియర్ అని నాకు తెల్సు. మీరు మీ రిక్షా ఖర్చులకు మీ ఇంప్రెస్టు డబ్బుల్లో వాడండి."

"అలాగే సార్!"

29

సత్యం శుక్రవారమే కాకినాడ వచ్చాడు. సత్యం శారీరకంగ, మానసికంగ చాల పరివర్తనచెందాడు. ప్రస్తుతం విశాఖపట్నంలో డాబా గార్డెన్స్‌లో ఓ ఆటోమొబైల్సు షాపు, ప్రక్కన ఓ రిపేరుషాపు పెట్టుకున్నాడు. రాఘవరావు రెండో కొడుకు మురళితో కల్సి జాయింటుగ వ్యాపారం చేస్తున్నాడు. కాకినాడ ఎస్. ఆర్. ఎమ్. టిలో ఆటోమొబైల్ స్పేర్సు కొనుక్కుందుకు వచ్చాడు. కొన్ని కొన్నాడు - మరికొన్ని భాగాలు సోమవారం నాడు ఖార్ఖానా నుండి షాపుకి వస్తాయంటే, వాటికోసం ఆగేడు. మధ్యాహ్నం మూడున్నరకి హోటల్లో టిఫిను చేసి బయటకు వచ్చి కిళ్ళీ వేసుకుంటుంటే, కోమలి రిక్షాలో వెళ్తుండడం చూసాడు.

గతుక్కుమన్నాడు! 'కోమలి కదూ! ఆ వెళ్ళేది. అయితే ఈ ఊరులో ఏం చేస్తున్నట్లు? ఎంత ఆరోగ్యంగా, అందంగా ఉంది' అని ఆశ్చర్యం నుంచి తేరుకొనేసరికి కోమలి రిక్షా దూరంగ పోతుంది— తను కూడ రిక్షాలో వెంటబడదామని రిక్షా కోసం గాలించాడు. రెండు నిముషాల తర్వాత ఓ రిక్షా దొరికింది. వెంటనే ఆ రిక్షా ఎక్కి "అదుగో! దూరంగ పోతుందే ఆ రిక్షా, దాని వెంటపడు. ఎక్కడికెళ్ళాలో నాకు తెలియదుగాని ఆ రిక్షా ఎక్కడికెళ్తే అక్కడకు నువ్వుపోవాలి. నీ కష్టమేమీ నేను ఉంచుకోను లే."

"ఆ మాటన్నారు చాలు! ఇక చూసుకోండి, విమానంలా లాగించేస్తాను."

ముందు రిక్షా కూడ తొందరగానే పోతూంది. బహుశా ఆ ముందు రిక్షావాడు కుర్రాడయ్యుంటాడు. సత్యం ఎక్కిన రిక్షా పాతది, అంత తొందరగ పోవడంలేదు. కాని ముందుపోతున్న ఆ రిక్షా, అందులో కూర్చున్న కోమలి తల, గులాబిరంగు చీర పమిట కనిపిస్తున్నాయి. 'కోమలి ఎటో బీచి వైపు మధ్యాహ్నం వెళ్తోంది — ఎందుకని?' సత్యంకు బోధపడలేదు. మనస్సులో ఏదో సందేహం పీకుతూంది.

సముద్రానికి ఓ ఫర్లాంగు దూరంలో, బీచికి పోయే రోడ్డుకు కొంచెం దూరంలో, గులాబిరంగు మేడొకటి కనిపించింది. ఇంటిచుట్టూ పూలమొక్కలు, చిన్న కాంపౌండు గోడ. దగ్గరలో మరే ఇళ్ళులేవు. ఆ ఒంటరి ప్రదేశంలో ఉన్న ఆ ఇంటిని చూడగానే కోమలికి కొంచెం భయము కల్గింది. కాని మోహనరావు కుటుంబంతో ఉన్నాడు; భయమేమిటిలే అనుకుంది.

/ ఇంకా వుంది /

అదృష్టం

అదృష్టం అంటే అనుకోకుండా వచ్చిపడిన ఆనందం. తెలిసివచ్చిన మేలు దృష్టం. ఊహించని విధంగా సంభవించిన శుభం అదృష్టం. ఇలాంటివి జీవితంలో చాలా జరుగుతుంటాయి. దేవుని నమ్ముకొని ఆయనకు ప్రార్థనా విజ్ఞాపనలు చేసేవారు ఆశ్చర్యకరంగా వచ్చే ఆశీర్వాదాలు దేవుడి దయాదానాలు అని చెబుతారు. మరికొందరు అవి తమ నక్షత్రబలసిద్ధి, జాతకఫలం అని నమ్ముతారు, మరికొందరు అవి వారి పూర్వజన్మ సుకృతఫలం అని సంబరపడతారు. చాలా మందికి అలా ఎందుకు జరిగిందో తెలియక దాన్ని అదృష్టం అని అంటారు.

ఓసారి యేసుస్వామి ఒక యింట్లో ఉపదేశిస్తున్నాడు, పక్షవాత రోగంచేత దీర్ఘకాలం పీడితుడైన ఓ వ్యక్తిని కొందరు ఆయనవద్దకు తేవాలని ప్రయత్నించి, క్రిక్కిరిసివున్న జనం మధ్యగా అతడ్ని తీసుకపోవడానికి వీలుగాక చివరకు తెగించి ఆ ఇంటి పైకప్పును అవసరమైనంత మట్టుకు ఊడదీసి తాళ్లతో రోగి పండుకొన్న పరుపు తానే యేసు పాదాలదగ్గర దించారు, సభకు అంతరాయం కలిగింది. ప్రజలు సణగడం ఆరంభించారు. ఇంత అసభ్యంగా ప్రవర్తించిన ఈ రోగిని యేసు ఎలా పలకరిస్తాడా ? అని కనిపెట్టి చూస్తున్నారు. వాతావరణం బహు నాటకీయంగా వుంది పాపం ! ఆ రోగికూడా భయంతో రెప్ప కొట్టకుండా చూస్తున్నాడు.

యేసు తన ప్రసంగం ఆపేసి ఆ రోగిని చూసి, కుమారా, అని సంబోధించాడు. రోగికి దాదాపు 50 యేండ్లుంటవచ్చు. యేసు అప్పటికి 30 సంవత్సరాల వయస్సు అయినా తన దైవత్వాన్ని ఒక్కమారు పరస్కరించుకొని కొడుకా, అని పిలిచాడు. ఆమాటతో పరలోకమే వచ్చి ఆ రోగి హృదయంలో నిండిపోయినట్లయింది. దీర్ఘవ్యాధితో బాధపడే వాని తల్లి సొంతవారే చచ్చినవాడితో సమంగా చూస్తుండవచ్చు. బాంధవ్యం రెక్కలు కట్టుకొని ఎగిరిపోయి వుండొచ్చు. గానీ దేవునితో వున్న బాంధవ్యం పాపంలో సహితం హరించుకుపోదు. ఆ మాట వినేసరికి ప్రజలందరికీ ఒళ్లు పులకరించింది. యేసుక్రీస్తు ద్వారా దేవుడు అందరిని కుమారా, కుమారీ అని పలకరిస్తాడు. అదే ఆయన అవతార ప్రసాదం.

వెంటనే నీ పాపాలు క్షమించాను, అన్నాడు యేసు. ప్రజల్లోని ఆశ్చర్యం ఆగ్రహంగా మారిపోయింది. పాపాలు క్షమించడానికి యితడెవడు ? అని గుసగుసలు పోయారు. అసలు రహస్యమేమంటే, మనలో వున్న కోపం మన బాంధవ్యాన్ని మాసు పరచి, మనల్ని అన్యుల్నిగా దేవుడికి చూపుతుంది. బాంధవ్యం మరుగైపోయిందిగానీ, మాయమైపోలేదు. ఆ పాపాన్ని దేవుడు క్షమించినాడు. ఆ బంధుత్వం మళ్ళీ ఊపిరి పోసుకొంటుంది. పాపాలు క్షమించే అధికారం కలవాడు గనుక, అలా క్షమించడానికి విశ్వసృజనం చేయగల ప్రజాపతిగా బట్టి కుమారుడా అని పిలిచాడు, అంతేగాక, యిన్నాళ్లూ నీవు ఏడుస్తూ నీ కన్నీటితో తడిసిన నీ పరుపును చుట్టబెట్టి నీ భుజాన వేసుకొని వెళ్ళిపో అన్నాడు. ఆ మరుక్షణమే ఆ దేవుడి కొడుకు నవయౌవనంతో లేచి, తన పరుపు నెత్తుకొని, ఒక నూతన ప్రపంచంలోనికి నడకగా నడిచిపోయాడు. యేసు అనుగ్రహం పొందినవారికి ఆధ్యాత్మికంగానూ, భౌతికంగానూ అద్భుతమైన మేళ్లు లభిస్తాయి. అవి ఆశీర్వాదాలేగాని అదృష్టాలు గావు.

షరా : ఈలాంటి అనుభవాలు యేసుస్వామిద్వారా పొందాలంటే ఏమి చేయాలి ?

వెంటనే ఈ క్రింది చిరునామాతో సంప్రదించండి. ప్రియశిష్య....

ప్రశ్నావళి!

కె. రామలక్ష్మి

ఎం. యు. కె. — ఎమ్మిగనూరు

మనిషి పుట్టుక పుట్టినందుకు ఏదైనా సాధిం చాలనే తపన ఒకవైపు, పరిస్థితుల ప్రభావం వల్ల ఏమీ సాధించలేక పోతున్నాననే బెంగమరోవైపు నన్ను వేధిస్తున్నాయి.

"చేసేది చేయించేదీ నేనే అయితే వ్యధ నువ్వు పడటం ఎందుకు?" అన్నట్టు వెనకటికి శ్రీకృష్ణుడు అర్జునుడితో. అంచేత—కాగల కార్యం గంధర్వులే తీరుస్తారని, దైనందిన జీవితం మీద దృష్టిని కేంద్రీకరించండి. భవిష్యత్తుపై బెంగతో, భూతకాలంపై మమకారంతో ముఖ్యమైన వర్తమానం మరిచిపోతే ఎలా?

కె. ఎస్. ఏ. ఆర్. — విజయవాడ

నేటి తెలుగు సినిమాలు ఇంత దిగజారి పోవడానికి కారకులెవ్వరు? దర్శకులా? నిర్మాతలా? నటులా?

వీరెవ్వరూ కాదు. పాపిష్టి డబ్బు కారణం. డబ్బు కోసం వేస్తున్నారు, డబ్బిచ్చి మీరు ప్రోత్సహిస్తున్నారు.

కె. వి. బి. ఎల్. — హైదరాబాదు.

రామలక్ష్మిగారూ! నవలలు రాయాలంటే ఏ సైజు పేపరు కావాలి?

బేబీ రోటరీ సైజు రోలు ఒకటి ప్రస్తుతానికి కొనండి! లేకపోతే ఏమిటి తమ్ముడూ ఈ ప్రశ్న?! ఏ సైజు కాగితం మీద వద్దంటుంది నవల?

వి. ఎన్. ఆర్. సి. ఆర్. కె - ఇరువారం.

స్త్రీకి స్త్రీయే శత్రువన్నారు. మరి మీరు మగవారిని దుయ్యబట్టడం ఎందుకు? చేతకాకనా?

ప్రతి స్త్రీ వెనుకా ఉండేది వో పురుషుడే కదా! అందుకని, నేను దుయ్యపట్టను. నిజం చెప్తాను.

మనం ఏం రాసినా చెల్లుతుందని ప్రతివారం వో పేజీ నింపుతున్నారు. మీ స్త్రీపక్షపాత సమాధానం చదివిన తరువాత ఏ మగానికైనా స్త్రీ జాతిపట్ల కసి పెరిగేలా ఉంటుంది. మీ రాతలు స్త్రీలకు వ్యతిరేకులను పెంచుతోంది.

అబ్బా! నా జవాబులకి అంత శక్తి వుందా? వోసారి వోల్టుమీటరు పెట్టి చూడాలి!

ఎమ్. వి. ఎన్. — కామారెడ్డి.

ఆడది తన వయస్సు చెప్పదు. మగాడు తన జీతం సరిగా చెప్పడు. కారణం?

ఏదెక్కువున్నా చిక్కని!

రామలక్ష్మిగారూ! సంపాదన అనేది భయంకరమైన వ్యాధి అంటారు. మరలాంటప్పుడు జీవితం? వ్యాధిగ్రస్తమే అనాలి!

డి. ఎస్. బి. — డోని.

మీ జవాబులు చదువుతూ నేను "ఆడవారి మాటలకు అర్థాలే వేరులే!" అనుకుంటూ ఉంటాను. నిజమేనంటారా?

నిజమే! మీరూహించుకున్నది అక్కడ ఉండవు కనుక అలా అనుకుంటారు. ఉన్న అర్థం తీసుకుందుకు జంకుతారు. అందుకే నా స్నేహితురాలొకావె అంటూ ఉంటుంది—ఆడవారి మాటలకు అర్థాలు వేరైనా ఉన్నాయి. మగవారి మాటలకు అర్థాలే లేవుతే! బహుశా మీరామెతో ఏకీభవించరేమో!

జి. బి. పి — మంగళగిరి

నా పరిస్థితి కార్తీక దీపంలో శోభన్‌బాబులా ఏర్పడింది. ఏం చెయ్యను?

ఏముందీ గోరింటాకులో సుజాతలా చెయ్యండి.

పి. టి.ఎస్. పి. — నర్సాపూర్

పది సంవత్సరాలనుంచి ఒకే ఆఫీసులో ఉద్యోగం చేస్తూ పెళ్ళి చేసుకున్నాం. ఇప్పుడు ఇంటర్వ్యూకని వెళ్ళి. . వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నారు. ఈయనని ఎందుకు బాధ పెట్టాలని.. చనిపోవాలనిపిస్తోంది. .

బాగుంది. అప్పుడు 'త్యాగశీలివమ్మా' అంటూ పొంగిపోతారనుకుంటున్నావా చిట్టితల్లీ పెళ్ళి పబ్లిక్‌గానో— లీగల్‌గానో చేసుకోవాలనడం. ఇలాంటి పెళ్ళిళ్ల వల్ల నష్టపోయేది ఆడదే గాని మగాడు కాదు. పెళ్ళంటూ చేసుకున్న ఆడది తెగించి కట్టుకున్న వాడిని కోర్టుకు లాగదన్న ధైర్యం మగవాడిది. అంతే కాదు. గుడిలో పెళ్ళికో బొమ్మ ముందు, 'స్వంతం' చేసుకోడానికో, సాక్ష్యం వుండదు కదా! ఉద్యోగం చేస్తూ ఇదేం పిరికితనం? చేవుంటే ఆ వ్యక్తిని మళ్ళీ గడప తొక్కనివ్వకుండా ధైర్యంగా బ్రతికి చూపెట్టాలి. సాక్ష్యం [మీ పెళ్ళికి] వుంటే బైగమీ కింద కోర్టుకి లాగి బుద్ధి చెప్పాలి. అంతేగాని చావడం దేనికి? ఇక పరువంటారా? అది మిమ్మల్ని వదిలి ఇంకొర్ని చేసుకున్న వాడికే లేనిది మీకెందుకు? మగవాడికక్కరలేని పరువు ఆడదానికీ అక్కర లేదని రంగంలోకి దిగితే తప్ప —దొంగ పెళ్ళిళ్ళు నశించి పోవు. ఈ రకం పెళ్ళిళ్లకి సృష్టి పల్కనంత కాలం 'అక్రమ సంతానం' అనబడే పిల్లలు వుంటూనే వుంటారు? పాపం పిల్లలదేం దోషం?

పి. హెచ్. ఆర్ — మడకశిర

రామాయణం కల్పితం కాదని శ్రీ బి.బి. లాల్ నాయకత్వాన త్రవ్వకాలు జరిపిన శాస్త్రజ్ఞులు అంటున్నారు. నేను మాత్రం కల్పితమే అంటాను. మీరేమంటారు?

రామాయణ విషయంలో మీరేమంటారు? నేనేమంటాను కాదు ముఖ్యం. మనం ఏమనుకున్నా చెల్లదు. విశ్వనాథ వారికి కల్ప వృక్షంగానూ, రంగనాయకమ్మ వారికి విష వృక్షంగానూ కన్పించవచ్చు. రామాయణం గొప్ప కావ్యం. ఇతిహాస పురాణాలలో జమ కట్టలేదు దీన్ని. రామాయణ త్రవ్వకాలు — ప్రారంభం అయ్యాయి. కాని ముగిసి పోలేదు. రామాయణంలో ఎంత చరిత్ర వున్నదీ తేల్చవలసినది శాస్త్రజ్ఞులూ, పరిశోధకులూనూ. మీరూ, నేనూ కాదు! ఇంకా చాలా పరిశోధనానంతరమే గాని ఈ విషయంలో ఏదీ నికరంగా చెప్పడానికి— వారే సాహసించరే— మీరెందుకు సాహసిస్తున్నారు?!


టి. ఎస్. సి. ఆర్ — పొట్ట్నా

గోడమీద పిల్లివాటం అంటే?

అటూ ఇటూ కాకుండా ఇండిపెండెంటుగా నిలబడి— గెలిచిన పార్టీలో చేరాలనుకోవడం.

పల్లె పడుచుకి పట్నం పడుచుకి తేడా ఏమిటి?

పల్లె పడుచే నాలుగు పాటాలు నేర్పగలదు ఈ రోజుల్లో— పట్నం పిల్లకి.



మువ్వల మురళి



సీరియల్ — ఆర్. సంధ్యాదేవి

17

(గత సంచిక తరువాయి)

మర్నాడు కృష్ణసుమంత్ కోర్టుకు వెళ్తూ కారు ఆపి, దిగి మల్లికార్జునరావు ఇంటి కాలింగ్ బెల్ నొక్కాడు. రెండు నిముషాల తరువాత తలుపు తెరుచుకుంది. గుమ్మంలో నవ్వుతూ నిలబడిన కృష్ణసుమంత్‌ని చూస్తూనే ఒక్కసారి ఉలిక్కిపడినట్టు అయి, "మీరా!" ఆశ్చర్యంగా చూసింది.

"కోపం తెచ్చుకోకండి నే వచ్చేనని. నిన్న మీరు కారులో ఈ ప్యాకెట్ మర్చిపోయారు. ఇచ్చేసి వెళ్ళిపోదామని వచ్చాను." చిరునవ్వుతో ఆమెకు ప్యాకెట్ అందిచ్చాడు.

థ్యాంక్స్ చెప్పి ఆ ప్యాకెట్ అందుకుంది. 'అతను ఆ రోజు సంఘటన ఇంకా మరిచిపోలేదులా ఉంది' అనుకుని తలవంచేసింది, అతని కళ్ళల్లోకి చూడలేక.

కృష్ణసుమంత్ వెళ్ళిపోయాడు.

రెండు రోజులు తీరుబడిలేక అతను రోజా యింటికి వెళ్ళలేదు. ఆ రోజు వెళ్ళి పది నిముషాలు కూర్చుని యింటికి వచ్చేశాడు. కారులో కూర్చున్నాక చూసుకున్నాడు, సీటుమీద కవరు పడి ఉండటం. ఆశ్చర్యంతో చూసి వెంటనే గ్రహించుకున్నాడు, 'అది రోజా పెట్టివుంటుంది' అని. పెళ్ళి గురించి అడిగితే 'రేపు చెప్తాను' అంది. ఆ తరువాత తను రెండు రోజులు వెళ్ళలేదు. "నోటితో చెప్పడానికి సిగ్గేసి కాగితంమీద వ్రాసింది కాబోలు" నవ్వుకుని కవరు తీసి జేబులో పెట్టుకున్నాడు, యింటికి వెళ్ళి తీరిగ్గా చదువుదామని.

యింటికి వెళ్ళగానే అతని కోసం కాసుకు కూర్చున్నట్టు ఓ పదిహేనుమంది హాలులో ఇతని రాకకోసం చూస్తున్నారు. కేసులు గురించే కాక వేరే పనివుండి కూడా వస్తుంటారు. వాళ్ళందరితో మాట్లాడి, వాళ్ళని పంపేసి, బట్టలు మార్చుకుని భోజనం చేసి, హాలులో కాస్సేపు కూర్చుని, తన గదిలోకి వెళ్ళి రోజా ఇచ్చిన కవరు తీసి తీరిగ్గా ఉత్తరం చదవసాగాడు —

"కృష్ణసుమంత్‌గారూ!

నేను తండ్రిపోయిన తరువాత అదోక రకం అయిన జీవితానికి అలవాటు పడిపోయాను. ఆశలన్నీ సమాధి చేసుకుని జీవచ్ఛవంలా బ్రతుకుతున్న నాకు మీ పరిచయం, మండుతున్న గుండెలపై పన్నీటిజల్లు అయింది. మీ ప్రేమాభిమానాలు నా ఆశాసౌధాలకి కొత్త పునాదులు వేశాయి. మీ ఆదరణ, ఆప్యాయత మోడువారిన నా జీవన లతకు చిగుర్లు వేశాయి. ఇక ఈ జీవితం ఇంతే! అని నిరాశ చెందిన ఈ మూగ విపంచిని రాగాలు పలికించి, తిరిగి మామూలు మనిషిగా చేసిన మీకు నేను ఈ జన్మాంతరం ఋణపడి వుంటాను.

పెళ్ళి చేసుకుని నేనూ అందరి స్త్రీల్లాగే జీవితం సాగించాలన్న వెర్రి ఆశలకి దాసినయిపోతున్నాను, రోజు రోజుకి.

కృష్ణసుమంత్‌గారూ! నేను ఒకరికి మనసు ఇచ్చాను. వారే నాకు భర్త కావాలని ప్రతిదేముడికి, ప్రతిక్షణం మొక్కుకుంటున్నాను. నా కళ్ళలో, నా హృదయంలో, నా ఊహల్లో అతనే ప్రతిక్షణం కదులుతూ నన్ను ఏవో లోకాల్లోకి తీసుకుపోతుంటే, పెళ్ళిమాట తలపెట్టకుండా ఎలా వుండగలను!

పేరు చెప్పమని అడుగుతారని నాకు తెలుసు. కాని, ఎలా చెప్తాను! మనసు పారేసుకున్నంత సులభంగాదే మనిషిని స్వంతం చేసుకోవటం!

అందుకే సందేహిస్తున్నాను. అతని అంతస్తు ఎక్కడ! నేను ఎక్కడ! నింగికి నేలకు ఎంత దూరం వుందో మా మధ్య అంత దూరం వుందేమో! అనిపిస్తోంది. అతను ఐశ్వర్యవంతుల ఏకైక పుత్రుడు. మరి నేను లేమిలో పుట్టి, లేమిలో పెరిగినదాన్ని.

మరి నన్ను భార్యగా ఆయన అంగీకరిస్తారా! ఒక్క ఆయన మాటమీదే నా జీవితం ఆధారపడి వుంది. ఆయనే కాదంటే ఇక నాకు జీవితమే లేదు. ఆయనే నా భర్త అని నిశ్చయించుకున్న నాకు వారు కాదంటే నేను కట్టుకున్న ఆకాశ హర్మ్యములు కూలిపోయి, ఇక నా జీవితం అంతా గాఢాంధకారమైపోతుంది. అందుకే నేను ప్రేమించినవారి పేరు చెప్పడానికి నాకు భయం వేస్తోంది.

ఒక వారం తరువాత నేను మీకు వారి పేరు చెప్తాను. మీరు చెప్పమని ధైర్యం చెస్తేనే ఆ పేరు చెప్తాను!

రోజా"

ఉత్తరం చదవటం ముగించి ఆలోచనల్లో పడిపోయాడు. రోజా చెప్పిన మాటల్లో నిజం లేకపోలేదు. అందుకని ఆమెను అలా వదిలేస్తాడా తను! రోజా కోరిక తప్పక తీరుతుంది.

దృఢ నిశ్చయంతో అనుకుని కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు మూసుకున్నా రోజా దీనవదనమే కళ్ళల్లో కదలసాగింది. ఆమెపై జాలి ముంచుకు వచ్చింది. అప్పటికి అప్పుడు వాళ్ళ యింటికి వెళ్ళి, "నీకు నేను వున్నాను! నీకా భయాలు, సందేహాలు వద్దు"ని చెప్పాలనిపించింది.

"అమ్మా, నాన్నగార్ని నేను ఒప్పించి నీ కోరిక తీర్చి, నీకు సంతోషాన్ని కలిగించేలా చేస్తాను" అనుకున్నాడు మనసులో!

* * *

ఆ రోజు తల్లి తండ్రి వస్తున్నట్టు ఫోన్ చెయ్యగానే ఆశ్చర్యపోయాడు కృష్ణసుమంత్.

కారు తీసుకుని స్టేషన్‌కి వెళ్ళాడు. 'అనుకోకుండా వచ్చేరు అంటే ఏదో కారణం వుండే వుంటుంది' అని ఊహించాడు.

మర్నాడు అతను కోర్టుకి వెళ్తుంటే చెప్పారు, 'సాయంత్రం త్వరగా వచ్చేస్తే ఒకచోటకి వెళ్ళాలి' అని.

కృష్ణసుమంత్ లోలోపలే ఆశ్చర్యపోయాడు. తల్లిదండ్రుల మాటలకి అలాగే అని చెప్పి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అతను వచ్చాక అంతా కలిసి కారులో మల్లికార్జునరావు యింటికి వెళ్ళారు.

కారులో కూర్చున్నాక తెలిసింది అతనికి అసలు విషయం! కృష్ణసుమంత్‌కి క్షణంసేపు మతిపోయినట్టు అయింది.

తను అనుకున్నది ఏమిటి! జరుగుతున్నది ఏమిటి?

మరి రోజా సంగతి?

రోజాకు, వాళ్ళమ్మకు తను అన్ని కబుర్లు

జరిగిన కథ — ఏ: పి. యు. సి. పాసయిన మల్లికార్జునరావు చెల్లెలు హారితకు, తెచ్చిన ఏ సంబంధమూ నచ్చటంలేదు. తన పెద్ద మామయ్య శంకరంగారి కూతురు లీల పెళ్ళికి మద్రాస్ వెళ్తుండగా ఆమెకు ట్రైన్‌లో 'కృష్ణసుమంత్'తో పరిచయ మేర్పడుతుంది. అతని అందాన్ని మనసులో మెచ్చుకొంటుంది. మళ్ళీ అతను లీల పెళ్ళిలో కనబడ్డప్పుడు ఆమె కలవరపడుతుంది. మామయ్య కొడుకయిన కుమార్ భార్య శైలజ కోరగా ఆమెతో బలభద్రరావుగారింటికి వెళ్తుంది హారిత. విజయమ్మా, బలభద్రరావుగార్ల ఏకైక పుత్రుడే ఈ కృష్ణసుమంత్ అని తెలుసుకుంటుంది హారిత. విశాఖపట్నంలో లాయర్‌గా పనిచేస్తున్న కృష్ణసుమంత్‌కి రామనాథం మేష్టారు ద్వారా పరిచయమైన తండ్రిలేని రోజాను, ఆమె తల్లి సీతమ్మను సంరక్షిస్తుంటాడు. తన ఫ్రెండ్ తమ్ముడికి ఉద్యోగం వేయించమని అడగటానికి వస్తాడు మల్లికార్జునరావు. అతనికే విషయమూ మరునాడు చెబుతానని చెప్పి, వచ్చేటప్పుడు హారితను కూడా తీసుకురమ్మని వాళ్ళని డిన్నర్‌కి ఆహ్వానిస్తాడు కృష్ణసుమంత్. మల్లికార్జునరావు చాకచక్యంగా హారితను డిన్నర్‌కు తీసుకువెళ్తాడు. కృష్ణసుమంత్ ఫ్రెండ్ శాస్త్రి ద్వారా అతని తల్లిదండ్రుల అడ్రస్ కనుకొని, వెళ్ళి హారిత పెండ్లి విషయం మాట్లాడివస్తాడు మల్లికార్జునరావు.

చెప్పాడు. ఇప్పుడు తల్లిదండ్రుల మాట విని తను పెళ్ళి చేసేసుకోవాలా!


ఇప్పుడు ఏమిటి చెయ్యటం!

ఆలోచిస్తుంటే అంతలో కారు వాళ్ళ యింటి ముందు ఆగింది. మల్లిఖార్జునరావుకి ఆరోజు ఉదయమే బలభద్రరావుగారు ఫోన్ చేసి చెప్పారు, సాయంత్రం అబ్బాయి కోర్టునుంచి వచ్చాక అందరం కలిసి మీ యింటికి వస్తాం అని.

ముచ్చ్వల మురళి

మల్లిఖార్జునరావు ఆఫీసుకి ఒక పూట శెలవు పెట్టేసి, యింటి దగ్గర పెద్ద హడావుడి చేసేశాడు. సోఫాల కవర్లు మార్పించి, గుమ్మాలకి కర్టెన్లు మార్పించి, ఇల్లు అంతా నీటుగా సర్ది, హోటల్‌నుండి వాళ్ళకోసం రకరకాల స్వీట్స్ తెప్పించి, ఊపిరి తీసుకోవడానికి అయినా తీరిక లేకుండా యిల్లు అంతా కలయతిరిగేశాడు, అందర్నీ కంగారు పెట్టేస్తూ. గోవిందమ్మ, విశాలికి కూడా చాలా సంతోషంగా వుంది. హరిత సరేసరి! విశాలి ఆమెను ఇటు వెళ్ళి, అటు వెళ్ళి, ఏదో ఒక మాట అని ఉడికిస్తూనే ఉంది.

మల్లిఖార్జునరావు తన చెల్లెల్ని అనటం చూసి 'నా చెల్లెల్ని అంటావా! ఉండు నీ పని చెప్తాను' అంటూ అతను విశాలిని ఉడికించటం



MCA PDC/62/Tel

మొదలుపెట్టాడు. అత్తాకోడలు ఒక పార్టీ, అన్నాచెల్లెళ్లు ఒక పార్టీ అయి యిల్లు అంతా నవ్వులతో, హాస్యాలతో నింపేశారు.

వాళ్ళకోసమే ఎదురు చూస్తున్నట్టుగా కారు ఆగగానే మల్లిఖార్జునరావు, ఆ వెనక విశాలి వెళ్ళి వాళ్ళని ఎంతో మర్యాదగా లోపలకు ఆహ్వానించి, సోఫాలు చూపించి కూర్చోమని, వాళ్ళతోపాటు మల్లిఖార్జునరావుదంపతులు కూడా అక్కడే కూర్చున్నారు.

విజయమ్మ విశాలితో లోపలకు వచ్చి, గోవిందమ్మతో మాట్లాడి హరితను తనదగ్గరే కూర్చోబెట్టుకుంది ఆప్యాయంగా. ఆవిడకు ఆ అమ్మాయి అంటే చాలా ఇష్టం. పెళ్ళిలో చూసినదగ్గరనుండి ఆమె తన యింటి కోడలు కావాలని అనుకుంది. కొడుక్కి తను కోరుకున్న సంబంధం కోరిరావటంతో ఆవిడ ఎంతో మురిసిపోతూంది. కాఫీ, టిఫిన్ తీసుకోవటం పూర్తి అయింది. బలభద్రరావు హరితను చూసినా, విజయమ్మ ఆమెను తీసుకువెళ్ళి భర్తకు చూపించింది.

భార్యాభర్తలు ఇద్దరూ మల్లిఖార్జునరావుకి చెప్పారు — "మాకు అమ్మాయి నచ్చింది. ఇక మేము ఏమీ ఆలోచించుకోవలసింది లేదు" అని.

ఆ మాటతో మల్లిఖార్జునరావుదంపతులు, గోవిందమ్మ పొంగిపోయారు. కృష్ణసుమంత్ ఆలోచనల్లో పడిపోయాడు.

ఒక గంట కూర్చుని యింటికి బయలుదేరారు వాళ్ళు అంతా !

18

ఆ రాత్రి భోజనాలు అయ్యాక, తల్లీ,తండ్రీ, కొడుకు తీరిగ్గా కూర్చుని పెళ్ళి విషయాలు మాట్లాడుకోసాగారు. బలభద్రరావుగారు కొడుకు అభిప్రాయం ఏమిటో తెలుసుకుందామని ఆ అమ్మాయి నచ్చిందా ? లేదా ? అని ప్రశ్నించారు. అతను తండ్రి మాటలకి వెంటనే సమాధానం చెప్పలేదు. కొడుకు మౌనం చూసి ఆవిడ అన్నది, "నీకు ఇష్టమా ? కాదా ? చెప్పుబాబూ ! నీకు ఇష్టమైతే సంబంధం నిశ్చయించుకుని ముహూర్తం పెట్టిస్తాం"

"అది కాదమ్మా ! ఇప్పుడప్పుడే నాకు పెళ్ళి చేసుకోవాలనిలేదు" మెల్లగా చెప్పాడు.

ఆతని కళ్ళకి రోజాయే కనిపిస్తూంది !

"ఏం ! ఎందుకని ? నీకు ఆ అమ్మాయి నచ్చలేదా ?" అడిగారు ఆయన.

"ఆహా ! నచ్చలేదనికాదు." చెప్పడానికి సందేహిస్తున్నట్టుగా అన్నాడు.

"మరి ?"

కృష్ణసుమంత్ మాట్లాడలేదు. కొడుకు ఏదో చెప్పబోయి సందేహించటం గమనించి, భార్యాభర్తలు ఇద్దరూ ముఖముఖాలు చూసుకున్నారు కారణం ఏమైవుంటుందా ! అన్నట్టు.

"ఏదో చెప్పబోయి ఆగిపోయావు. చెప్పు బాబూ ?" అంది ఆవిడ.

"ఏమీలేదు. కొద్దిరోజులు పోయిన తరువాత చేసుకుందామని."


"కారణం !" తిరిగి ప్రశ్నించింది ఆవిడ.

"కారణం అంటూ ఏమీలేదు."

విజయమ్మ క్షణంసేపు ఊరుకుని అంది — "మాకు నువ్వు ఒక్కడివే ! నీ పెళ్ళి మా కళ్ళతో చూడాలని, కోడలు వచ్చి యింట్లో కళకళ లాడుతూ తిరగాలనీ, మనమలతో ఆడుకోవాలనీ మాకు ఎన్నెన్నో కోరికలు, ఆశలు వున్నాయి. 'ఇప్పుడుకాదు, తరువాత ఎప్పుడో పెళ్ళి చేసుకుంటాను' అంటే మాకు ఎలా వుంటుందో ఆలోచించావా ! నీ పెళ్ళి ఎప్పుడా ! అని కలవరిస్తున్నాం ! నువ్వు ఇక ఎప్పుడు చేసుకుంటావు చెప్పు ?"

అతను మాట్లాడలేదు.

"నీకు ఇంతవరకూ ఏ అమ్మాయిగా ఎలా



నచ్చలేదో, నాకు కోడలిగా ఏ అమ్మాయి నచ్చలేదు. హరితను మెద్రాసు పెళ్ళిలో చూశాను. చూసిన వెంటనే అనుకున్నాను 'ఈ అమ్మాయే నాకు కోడలు కావాలని!' అలాగే, ఆ సంబంధమే కాళ్ళ దగ్గరకు వచ్చింది. అమ్మాయి అంత చక్కగా ఉంటే నీకు నచ్చలేదా!'' అన్నది ఆవిడ.

కృష్ణసుమంత్ తల్లి మాటలకి చిరునవ్వు నవ్వాడు.

''అసలు నీ మనసులో ఉద్దేశం ఏమిటో చెప్పు ?'' అన్నారు ఆయన.

తండ్రి అలా అడగటంతో రోజా విషయం చెప్పేయాలని నోటిదాకా వచ్చింది. మాట పైకి రాకుండా అతి కష్టంమీద ఆపుకున్నాడు. 'తొందర పడుతున్నానేమో!' అని మనసులో అనుకున్నాడు.

''బాబూ!'' అంటూ కొడుకువైపు చూసింది.

''ఆ అమ్మాయి నాకు కోడలు కావాలని ఎంతో ఆశపడుతున్నాను. ఒక్కగా నొక్క కొడుకువు అయిన నువ్వు నా కోరిక తీర్చవా ?'' అన్నట్టు వున్నాయి ఆవిడ చూపులు.

కృష్ణసుమంత్ ఎటూ నిర్ణయించుకోలేక గాఢంగా నిట్టూర్చాడు. బలభద్రరావుగారు క్షణంసేపు మౌనంగా ఊరుకుని, శాంతంగా చెప్పారు —

''నీవు మాకు ఇప్పుడే సమాధానం చెప్పాలనీ లేదు. రేపు ఉదయం చెప్పు ? నీకు ఇష్టమైతే సంబంధం నిశ్చయించి ముహూర్తం పెట్టించేస్తా! లేదా మేము రేపు వెళ్ళిపోతాం. ఇక నీ యిష్టం. నీవు ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావో ఏమిటో! ఇక మేము ఏమీ నీ విషయాలలో జోక్యం కలగజేసుకోం! అంతా నీ యిష్టానికే వదిలేస్తున్నాం! నీకు నచ్చిన అమ్మాయి మెడలో తాళి కట్టేముందు మాకు తెలియచేస్తే, మాకు అదే సంతోషం. ఆ క్షణముకి మీ అమ్మా, నేనూ వచ్చి చూసి వెళ్ళిపోతాం.''

తండ్రి మాటలకి కాస్త నొచ్చుకున్నట్టుగా అన్నాడు — ''అదేమిటి నాన్నగారూ! అలా మాట్లాడుతున్నారు! మీకు చెప్పకుండా నేను నా యిష్టంమీద పెళ్ళి చేసుకుంటానా!''

ఆయన నవ్వారు, ''దీనిలో తప్పు ఏముంది బాబూ! రోజులు అలా మారిపోతున్నాయి. వాటితో మనుష్యుల మనసులూ మారిపోతున్నాయి. అది నీ తప్పు కాదు.''

''ఎవరు ఎలా మారినా నేను మాత్రం అలా ఎప్పటికీ మారను. నేను మీ కొడుకుని. మీ చేతుల మీదే నా పెళ్ళి జరుగుతుంది'' దృఢ నిశ్చయంతో అన్నాడు.

కొడుకు మాటలకి ఆ దంపతులు ఇద్దరూ సంతోషంగా, గర్వంగా ముఖముఖాలు చూసుకున్నారు. ఇక ఆ తరువాత సంభాషణ మరి సాగలేదు.

కృష్ణసుమంత్ తన గదిలో మంచంమీద పడుకుని రోజా విషయం ఆలోచించసాగాడు.

తల్లికి, తండ్రికి ఆమె గురించి చెప్పేస్తే!
వాళ్ళు మంచి మనసుతో అంగీకరిస్తారా!

రోజా దక్షిణామూర్తిగారి అమ్మాయి అని తెలిస్తే వాళ్ళు ఏమంటారు!

రోజా తన పెళ్ళిగురించి ఎన్నెన్ని కలలు కంటూ తనకి ఉత్తరం వ్రాసింది. ఇప్పుడు తను హరితను పెళ్ళి చేసుకుంటే! ఆమె ఏమను కుంటుంది!

అప్పటికప్పుడు వెళ్ళి తల్లిదండ్రులకి ఆ సంగతి చెప్పేయాలనిపిస్తుంది అతనికి. తీరా చెప్పాక, 'అలా జరగడానికి వీల్లేదు. మా కంఠంలో ప్రాణం ఉండగా ఆమె మన యింట్లో అడుగు పెట్టడానికి వీల్లేదు' అని అంటే! అప్పుడు ఎలా!

హరితను ఇప్పుడు తను పెళ్ళి చేసుకోను అంటే తల్లిదండ్రులకు ఇద్దరికీ కోపం వచ్చి వెళ్ళిపోతారు.

తను అనుకున్నది ఏమిటి! జరుగుతున్నది ఏమిటి!

'హరితే ఈ ఇంటికి కోడలు' అని అమ్మ చాలా ఖచ్చితంగా చెపుతూంది. రోజా సంగతి ఏం చెయ్యాలి! ఆమె ఎన్ని ఆశలు పెట్టుకుంది. కృష్ణసుమంత్ మనసులో సుడిగుండాల మాదిరి పరిభ్రమిస్తున్నాయి ఆలోచనలు.

అతని మస్తిష్కంలో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది. ఆ ఆలోచన రావటంతో, సంతృప్తితో కూడిన చిరునవ్వు అతని పెదవులమీద మెరిసింది. హరితను పెళ్ళి చేసుకున్నంత మాత్రాన రోజాని దూరం చేసుకోవాలని ఎక్కడ ఉంది! తన నుంచి రోజాని ఎవ్వరూ దూరం చెయ్యలేరు. తన కంఠంలో ప్రాణం ఉండగా అది ఎవ్వరికీ సాధ్యం కాని పని!

తల్లిదండ్రుల మాట ప్రకారం హరితను వివాహం చేసుకుంటాడు. రోజా యింటికి తను వెళ్తుంటాడు, వస్తుంటాడు. ఈ సంగతి ఎవ్వరికీ తెలియనివ్వకుండా తను తగిన జాగ్రత్త తీసుకోవాలి! మెల్లగా తల్లిదండ్రులకి సమయం చూసుకుని ఈ సంగతి చెప్పాలి! అప్పుడు వాళ్ళేం చేస్తారు! తను చెప్పినట్టు వాళ్ళు విని తీరాలి! వినరా సరే! రోజా తన యింటి దగ్గరే వుంటుంది.

అప్పుడు హరిత ఏమంటుంది! అన్నిటికీ ఇష్టపడి భర్త మాటకు విలువ ఇచ్చి, రోజాకు ఈ యింట్లో స్థానం ఇస్తే సరి! లేదా! కట్టుకున్న భార్యను కూడా దూరం చేసుకోవడానికి తను సిద్ధమే!

రోజాని మాత్రం తను దూరం చేసుకోడు. మనసులో గట్టిగా ఒక నిశ్చయానికి వచ్చాడు. ఈ సంగతి అంతా రోజాకు, ఆమె తల్లికి చెప్పి ఒప్పించి, ధైర్యం చెప్పాలి. ప్రస్తుతానికి తను చెయ్యవలసింది ఇంతే మరి ముందు ముందు వాళ్ళకే అన్ని విషయాలు తెలుస్తాయి.

తనని అర్థం చేసుకోకపోతే, అంత మూర్ఖులు ప్రపంచంలో లేరనే అనుకోవాలి. అంతే! తన గురించి ఎవరేమనుకున్నా, తను లెక్క చెయ్యవలసిన అవసరంలేదు. తను ఎవ్వరికీ భయ పడడు!


కృష్ణసుమంత్ మనసు ఒక్కసారి తేలిక అయినట్టు అయింది.

* * *

మర్నాడు తల్లిదండ్రులకి తన అంగీకారం తెలియచేశాడు. కొడుకు మాట వినటంతోనే బలభద్రరావు దంపతులు మురిసిపోయారు. ఈ సంగతి మల్లిఖార్జునరావుకు యింటికి ఫోన్ చేసి, చెప్పి ''పదిగంటలు తరువాత మీ యింటికి వచ్చి అన్ని విషయాలు మాట్లాడుకుంటాం'' అని చెప్పారు.

కృష్ణసుమంత్ తనకా విషయంతో సంబంధం లేనట్టు టైము అవటంతో కోర్టుకి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అతను వచ్చేసరికి తల్లిదండ్రులు ఇద్దరూ హాలులో కూర్చుని వున్నారు. సంబంధం నిశ్చయం చేశాం అని చెప్తూ, ముహూర్తం కూడా



పెట్టించేసినట్టు చెప్పారు. సరిగ్గా ముహూర్తం ఆ రోజునాటికి పదిరోజులు ఉంది.

ఇంత త్వరగా పెట్టించేశారా! అని ఆశ్చర్య పోయాడు అతను.

'ఇక ఆ తరువాత మంచి ముహూర్తాలు లేవని, అందుకే ఆ ముహూర్తమే ఖాయపరిచేశాను' అని చెప్పారు కొడుకు ఆశ్చర్యపోవటం గమనించి.

తల్లీ, తండ్రీ ఆ మర్నాడే మెడ్రాసు వెళ్ళిపోయి, అక్కడ అంతా చూసుకుని అయిదవ రోజునాటికి వైజాగ్ రావడానికి నిశ్చయించుకున్నారు. పెళ్ళి అయిపోయాక కొడుకుని, కోడల్ని తీసుకుని మెడ్రాస్‌వెళ్ళి అక్కడ సత్యనారాయణ స్వామి వ్రతం చేయించి అందరికీ భోజనాలు పెట్టుకుని, సాయంత్రం రిసెప్షన్ ఏర్పాటు చేయించాలని అనుకుంటున్నారు.

కృష్ణసుమంత్ మౌనంగా వారి మాటలు వింటూ కూర్చున్నాడు. బలభద్రరావుగారికి, విజయమ్మకి చాలా సంతోషంగా ఉంది కొడుకు పెళ్ళి నిశ్చయం అయినందుకు. తను కోరుకున్నట్టు హారతే ఆ యింటికి కోడలు కావటం ఆవిడ చాలా మురిసిపోతూంది. ఆవిడకా పది రోజులూ పదినెలలుగా తోచాయి. ఎంత వేగంగా పెళ్ళి అయిపోతుందా! కోడలు ఎంత త్వరగా యింటికి వస్తుందా! అని ఆవిడ క్షణాలు లెక్క పెడ్తూంది.

19

బలభద్రరావుగారు, విజయమ్మ ఆ రోజు మెయిల్లో మెడ్రాసు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి కృష్ణసుమంత్ రోజాకి ఒక వుత్తరం వ్రాసి కవర్లో పెట్టి అంటించేశాడు. మర్నాడు ఆ ఉత్తరాన్ని శాస్త్రితో తను పంపినట్టు రోజాకి ఇమ్మన్నాడు.

అతను చెప్పినట్టే శాస్త్రి ఆ వుత్తరాన్ని ఆమె చేతికి ఇచ్చేసి వెళ్ళిపోయాడు.

రోజా ఆ ఉత్తరం ఆశ్చర్యంగా అందుకుంది. సుదీర్ఘమైన ఆ వుత్తరాన్ని రెండు మూడుసార్లు చదువుకుంది కళ్ళనీళ్ళు జలజల రాలి చెంపలు తడిశాయి. తనలో తను కుమిలి కుమిలి ఏడ్చింది.

కృష్ణసుమంత్‌కి పెళ్ళి అయిపోతుంది. అయితేనే! తనకి అతను పరాయివాడు కాదు. తన కోసం, తన సుఖం కోసం ఏం చెయ్యడానికి అయినా సిద్ధంగా ఉన్నాడు. ఆ మాట చాలు తనకి. అతనిమీద తనకి నమ్మకం ఉంది, తనకి అన్యాయం చెయ్యడని. ఇక ఎవరు ఏమనుకుంటే తనకు లెక్కేమిటి!

మొండికేసిన వాళ్ళని ఈ ప్రపంచంలో ఎవ్వరూ ఏం చెయ్యలేరు. తన గురించి ఎవరెన్ని అవమానకరంగా మాట్లాడినా తను పట్టించుకో నవసరంలేదు. అతని నీడ తనకు ఉంటే అంతే చాలు! తను కోరుకున్నది అదే!

ఈ సంగతి అమ్మకి తెలిస్తే ఏమంటుంది! అర్థం చేసుకుని అతన్ని క్షమించి, ఎప్పటిలాగే మాట్లాడుతుందా! లేక అతన్ని తన గుమ్మం ఎక్కవద్దని ఖచ్చితంగా చెప్పేస్తుందా!

రోజా తల ఆలోచనలతో, సమ్మెటలతో గట్టిగా బాదుతున్నట్టుగా వుంది. భరించరాని బాధతో తల పట్టుకుని మంచంమీదకు ఒరిగి పోయింది. అతను ఈ యింటికి రాకపోతే తను భరించలేదు. అతన్ని చూడకుండా తను క్షణం ఉండలేదు. కృష్ణసుమంత్ తనకి పరాయివాడు కాదనుకుంటుంటే మనసు అంతా తేలికయి గాలిలో తేలిపోతున్నట్టుగా ఉంది. ఎవరు ఏమన్నా తనకి మాత్రం దూరం కాడట!

ఆ ఊహ, తలంపులు ఆమె మనసులో బాధని మాయం చేశాయి. ఆ ఉత్తరం చదవగానే వేలాది పిడుగులు నెత్తిన వర్షించినట్టు అయ్యాయి. కట్టుకున్న ఆశాసౌధాలు కూలిపోయినట్లు అయ్యాయి. కాని, అది నిజంకాదు. అంతా తన భ్రమ. ఆ సౌధాలు కూలిపోలేదు. తళతళ మిల మిలా మెరిసిపోతూ, సౌధాలు తన కళ్ళెదుటే ఎప్పటిలాగే ఉన్నాయి. తన అంచనా ఎప్పుడూ తప్పుకాదు. తను అంత తెలివితక్కువది కాదు.

యింటికి రాగానే వెళ్ళి అతన్ని చుట్టేస్తే!

మీరు ఆ ఉత్తరంలో వ్రాసింది అంతా నిజమా!

మీరు వ్రాసినట్టుగానే అన్నమాట నిలబెట్టు కుంటారా! అని అడగాలనిపిస్తూంది.

ఒకవైపున దుఃఖం ముంచుకు వస్తూంది. మరోవైపు ఆనందాన్ని దాచుకోలేకపోతూంది. ఈ సంగతి తల్లికి తను చెప్తే మంచిదా! లేక అతన్ని చెప్పమంటే మంచిదా!

రోజా అలా ఆలోచనల్లో మునిగిపోయింది. ఎప్పుడు ఏ అదృష్టం భగవంతుడు ఎవరికి ఎలా కల్పిస్తాడో ఎవ్వరూ ఏం చెప్పలేరు.

* * *

కృష్ణసుమంత్ ఆ మర్నాడు సాయంత్రం రోజా యింటికి వచ్చాడు. గ్లాసుతో మంచినీళ్ళు తల్లికి తీసుకు వెళ్ళబోతున్నదల్లా టక్కున ఆగి పోయింది రోజా!

లోపలకి వస్తున్న అతనూ క్షణంసేపు అలాగే నిలబడిపోయాడు. ఇద్దరి కళ్ళూ క్షణంసేపు కలుసుకున్నాయి. అతని కళ్ళలో ప్రశ్నలు పరం పరంగా వెలువడుతున్నట్టున్నాయి.

నేను వ్రాసిన ఉత్తరం అందినదా?

చదువుకుని నువ్వు ఏమనుకున్నావు?

నన్ను అర్థం చేసుకున్నావా? లేదా?

నేను ఈ ఇంటికి రావటం నీకు ఇష్టమేనా?

అంతానీయిష్టంమీదేఆధారపడిఉంది. చెప్పు?

అని ప్రశ్నిస్తున్న అతని చూపులకి అర్థం గ్రహించుకున్న రోజా, చూపులతోనేజవాబుఇచ్చింది.

మీ ప్రశ్నలకి నేనేం సమాధానం చెప్పగలను!

మీ మాట నేను ఎప్పుడూ కాదనను, మీ యిష్టమే నా యిష్టం!

దిక్కులేని ఈ జీవితానికి భగవంతుడు ఇచ్చిన వరం అని మురిసిపోయి ఆనందిస్తాను!

మిమ్మల్ని ఓ దేముడిగా పూజిస్తాను! అన్నట్టు చూసింది.

కృష్ణసుమంత్ ఆ చూపులకి అర్థం గ్రహించుకున్నట్టుగా తేలిగ్గా నిట్టూర్చాడు. సంతోషంతో అతని ముఖం దీప్తివంతమైంది. తన ఉత్తరం చదువుకుని రోజా తనకి దూరం కాలేదు. తనని అర్థం చేసుకుంది. అంతేచాలు!

"ఈ ప్రపంచం అంతా ఏకమై తనకి ఎదురు నిలిచినా, తట్టుకుని నిలబడగలను" అన్న ధైర్యం తనకు వచ్చింది.

"రోజా!" ఆనందంగా, అస్పష్టంగా పలికాయి అతని పెదవులు.

అతని పిలుపు వినగానే తన సంతోషాన్ని వ్యక్త పరచాలని పిలవబోయి, అంతలోనే తనకు తాను నిలద్రొక్కుకుని ఆ ప్రయత్నం విరమించుకుని —

"లోపలకు రండి" అంది చిరునవ్వుతో.

/ఇంకా వుంది/



ఆధునిక పద్ధతులలో వర్ణచిత్రాలను వేస్తున్న యువకుడు శిరికొండ వేంకటేశ్వరరావు వేసిన చిత్రం

ఇదేం బుద్ధి?

మురాల ఇందిరా రఘు



"ఆఖరిసారి సినిమాకి వెళదామని అడిగాను. కాని ఆ చిన్న కోర్కె కూడా తీర్చలేదు సుమతీ నీవు" శ్రీహరిరావు వీడ్కోలు చెప్పే సందర్భంలో అన్నాడు.

"ముందు వచ్చే కాలంలో సినిమాలే కాదు, అన్నీ కలిసి చూడవచ్చులెండి. విచారపడకండి." శ్రీహరి కళ్ళల్లోకి చూస్తూ "టాటా" చెప్పింది వైజాగ్ ప్లాట్‌ఫారంమీద సుమతి.

ఇద్దరు ఆంధ్రా యూనివర్సిటీలో యం. ఏ పూర్తిచేశారు.

ఎవరి యిండ్లకు వారు వెళ్ళేటప్పుడు వియోగంలో వున్న ఘట్టంలో చివరిసారిగా సుమతి అన్న మాటలవి.

"మరి త్వరలో మన పెళ్ళి ఏర్పాటుచేస్తావా?" శ్రీహరి ప్రశ్న. "అది వీలుపడదండీ! మీరు పెద్ద వుద్యోగంలో చేరాలి అప్పుడే మా నాన్నగారు మన పెండ్లికి ఒప్పుకుంటారు" దానికి హంసపాదు పెట్టింది సుమతి.

ఆ మాట వినంగానే శ్రీహరి గుండె గుభేలు మంది. "ఈరోజుల్లో అంత పెద్ద వుద్యోగం రావటం మాటలా!" అనుమానం వెంటాడింది.

సుమతి, తాను చీకటి పడేవరకు పార్కులో వుండి ఒకరినొకరు గడిపిన క్షణాలు, సినిమాలో ఒకరి ప్రక్కన ఒకరు కూర్చుని ముఖంలో ముఖం పెట్టుకొని మాట్లాడిన సంఘటనలు గుర్తుకు వస్తే, ఎంత మధురమైన క్షణాలైనా అవి బాధాకరంగా అనిపించేవి శ్రీహరికి.

చదువు పూర్తి అయి, నాల్గు సంవత్సరాలు గడిచినా శ్రీహరికి వుద్యోగం దొరకలేదు. ఏదైనా దొరుకుతుందని హైదరాబాద్ వెళ్ళాడు.

సుమతి తల్లితండ్రులు కూడా హైదరాబాద్‌లోనే వుంటున్నారు. కాని లెటర్లు వ్రాయటానికి గాని, కలుసుకోడానికి గాని వీలులేదని సుమతి వ్రాసింది. తల్లిదండ్రులు ఆమెను అంత కట్టడిలో పెట్టినట్లు వ్రాసింది.

కొంతకాలం గడిచిన తరువాత, ఒక బీద కుటుంబం సంబంధించిన అమ్మాయిని, చాలా అందమైన ఆమెను పెళ్ళి చేసుకున్నాడు శ్రీహరి.

"ఎంతోమందికి నేను నచ్చాను. కాని, మా నాన్న యిచ్చే కట్నం నచ్చలేదని ఎంతోమంది తిరిగి వెళ్ళిపోయారు. మీరు నా పాలిట దైవంలా నిలిచారు" మొదటిరాత్రి సుగుణ, శ్రీహరికి కృతజ్ఞత చెప్పింది.

"అదేమిటి సుగుణా! డబ్బు తింటామా? మనకున్న చిన్న వుద్యోగం చాలు. మనం హాయిగా బ్రతకవచ్చు" శ్రీహరి సుగుణను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

"డబ్బే దైవం అనే యీరోజుల్లో మీలాంటి సహృదయులు దొరకటం నా అదృష్టమండీ" అతని కౌగిలిలోని వెచ్చదనానికి కరిగిపోతూ అంది సుగుణ.

అలా వారి జీవితం కొంతకాలం హాయిగా గడిచింది.

"సుగుణా! నేను ఆఫీసు పనిమీద బొంబాయి వెళుతున్నాను. మా బాస్‌ని భోజనానికి పిలిచాను. నా ప్రమోషను విషయం అతని చేతుల్లో వుంది. మరి నేను వెళ్ళకతప్పదు. డిన్నరు కేన్సిల్ అంటే అతను అపార్థం చేసుకుంటాడు. నీవు ఎలా అయినా మేనేజ్ చేయాలి" అన్నాడు శ్రీహరి.

"అయ్యో! అదెలా వీలుపడుతుందండీ. పరాయి మగవాడిని భోజనానికి పిలిచి, మీరు లేకపోతే ఎలాగండీ! ఏమీ పరవాలేదు. మీరు యింట్లో వున్న రోజు పిలవండి," సుగుణ మొండిగా అంది.

"అది సాధ్యం కాదు సుగుణా! మా బాస్ అసలే బ్రహ్మచారి. అతను అపార్థం చేసుకుంటే నా ప్రమోషను ఎగిరిపోతుంది." శ్రీహరి విషయం చెప్పాడు

"వీల్లేదండీ! నేను ఏర్పాటు చేయలేను" మొండిగా అంది సుగుణ.

"తప్పదు సుగుణా! ఈ రోజుల్లో ప్రమోషను రావాలంటే చాలా కష్టమైన పని. పై అధికారిని

కె. — లక్సెట్టిపేట

నేను సుమారు 10 సం॥ల క్రితం వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. క్రమేణా సంభోగములో తృప్తి వుండటము లేదు.

స్త్రీకిగాని, పురుషునికిగాని సుఖవ్యాధి అనేది జబ్బున్న వ్యక్తితో సంభోగిస్తేనే వస్తుందా ? లేక ఆ జబ్బు ఇంకా ఏ విధంగానైనా వచ్చే అవకాశమున్నదా ?

★ వేసెక్టమీ ఆపరేషన్‌కీ సంభోగ శక్తికీ సంబంధం లేదనే చెప్పవలసి ఉన్నది.

మామూలుగా వయస్సు పైబడే కొద్దీ సంభోగ శక్తి తగ్గుతుందని అందరికీ తెలిసిందే! అలా తగ్గటానికీ ఆపరేషన్‌కీ సంబంధం ఉండదు.

సుఖవ్యాధులు ఉన్నవారితో సంభోగిస్తేనే తప్ప ఇతరత్రా సుఖరోగాలు రావటానికి అవకాశం లేదు. (చేతులకిగాని శరీరంలోని ఇతర భాగాలలో పగుళ్ళు ఉండి ఆ భాగాలు సుఖరోగం ఉన్న భాగంతో కలుస్తే తప్ప)

సి. జి. — శ్రీకాళహస్తి

నా వయస్సు 25 సంవత్సరములు. నాకు

డాక్టర్ సలహాలు

ఒక సంవత్సరము నుండి మలమూత్ర విసర్జనము చేయునపుడు మూత్రముతోపాటు తెల్లని ద్రవము పడుచున్నది. ఇలా ఎందుకు జరుగుతుంది ? దీనికి నివారణోపాయము తెలుప ప్రార్థన ?

★ ఈ వయస్సులో దాదాపు ఇది సహజం అనే చెప్పాలి. వయస్సుతోబాటుగా ప్రకృతిసిద్ధంగా ఏర్పడే మార్పులవల్ల, కోరికలవల్ల సెక్స్ గ్రంథులు ఈ వయసులో ఎక్కువగా పనిచేయటం జరుగుతుంది. ఆ సమయంలో సెమినల్ ఫ్లూయిడ్ ఉత్పత్తి అధికం అవుతుంది. ఒక నిర్ణీత ప్రమాణాని కన్నా అధికంగా ఉత్పత్తి అయిన ద్రవం మామూలు మార్గంలో బహిర్గతమవటం సహజం. మలబద్ధకం మొదలయిన లక్షణాలు ఉన్న వారిలో ఈ లక్షణం ఇంకా ఎక్కువగా ఉంటుంది. కొందరికి మాత్రం గొనోరియా రోగంవల్ల మూత్రంలో తెల్లని చీము కారటం జరుగుతుంది.

డి. బి. ఆర్. — నిజామాబాద్

నా వయస్సు 18 సంవత్సరములు. ఛాతి, తొడలు బాగుగానే లావుగా వుంటాయి. చేతులు సన్నంగా వుంటాయి. కుడిచేయి కన్నా ఎడమ చేయి సన్నముగా వున్నది. ఎత్తు నా వయస్సుకి సరిపోయేలా వున్నదని నా నమ్మకము. చేతులు లావుగా అవ్వాలంటే ఏమి చెయ్యాలి ?

★ మామూలు పనులన్నీ కుడిచేతో చేసుకుపోయేవారికి కుడిచేయి కన్నా ఎడమచేయి కొద్దిగా సన్నగా ఉండటం మామూలే! కానీ పెద్దగా వ్యత్యాసం ఉండకూడదు.

మామూలుగా వ్యాయామం కొద్దిమాత్రంగానైనా ప్రతిరోజూ చేయటం అవసరం. "పుల్ — అప్స్" బుల్‌వర్కర్ మొదలయిన వ్యాయామాల వల్ల చేతులు దృఢంగా అయ్యే అవకాశం ఉంటుంది. అయితే ఈ వ్యాయామాలని క్రమబద్ధంగా ప్రతిరోజూ చేయవలసి ఉంటుంది. కొన్నిరోజులు చేసి వదిలివేయటంవల్ల ఫలితం ఉండదు.

— *డా॥ కె. వెంకటేశ్వరరావు*

అసంతృప్తి పరచటం మంచిదికాదు" అని వెళ్ళిపోయాడు శ్రీహరి.

కొన్నాళ్ళల్లోనే శ్రీహరికి ప్రమోషను వచ్చింది. పెద్ద అధికారిహోదాలో వున్న శ్రీహరి పటాటోపంగా వెళ్ళి సుమతిని కలిసాడు.

'సుమతీ! నేను యిప్పుడు ఒక బ్రాంచి మేనేజరిని, పెద్ద జీతం — ఇక ధైర్యంగా మీ నాన్నకి మన పెండ్లి విషయం చెప్పొచ్చు" శ్రీహరి ఆనందాన్ని పట్టలేకుండా అన్నాడు.

"మీకింత పెద్ద వుద్యోగం ఎలా వచ్చిందండీ!" సుమతి ఆశ్చర్యంగా అడిగింది.

"ఏముంది నీకు తెలుసుగా ఈ రోజులలో ఏ పని కావాలన్నా ఉత్తరం అంటే సిఫార్సు కావాలి. దానితోపాటే "దక్షిణం" కావాలి. అంటే డబ్బు పెట్టాలి! ఈ రెండిటిని మించినది మరొక దిక్కు వుంది. అదే ఆడదిక్కు. ఆడదాన్ని ప్రయోగిస్తే, పాసుపతం ప్రయోగించినట్లే" విజయగర్వంతో నవ్వాడు శ్రీహరి.

"మీరు దేన్ని ప్రయోగించినట్లు" సుమతి ఆత్రుతగా అడిగింది.

"అది తరువాత చెబుతానుగాని, మన పెండ్లి విషయం ఏమిటి చెప్పు" తొందరపడ్డాడు.

"మీకు పెండ్లి అయిందని విన్నాను" సుమతి చిన్నగా అంది.

"ఆ! ఏమి పెండ్లిలే! కట్నాలు యివ్వలేకపోతే పీటలమీద చెడిపోయిన పెండ్లి తాలుకు అమ్మాయిని చేసుకున్నాను. ఆ అమ్మాయికి ఇరవయ్యో, పాతికవేలో డబ్బు పారవేస్తాను" చిన్న విషయంగా చెప్పాడు శ్రీహరి.

సుమతి భయంతో కంపించిపోయింది.

"అంటే, చేసుకున్న భార్యను నా ఆస్తికోసం ఆశపడి, ఇరవయ్‌వేలుగాని, పాతికవేలుగాని యిచ్చి వదిలించుకుంటావన్నమాట" అతనివంక చిన్న భావంతో చూస్తూ అడిగింది.

"ఆమె ఒక రాత్రి మా బాస్‌తో కాపురం చేసింది" శ్రీహరి వున్న విషయం వివరించాడు.

"ఎలా చెప్పగలవు?" లాయరులా అడిగింది సుమతి.

"నాకు ప్రమోషను రావటమే దానికి నిదర్శనం" చిరునవ్వుతో చెప్పాడు శ్రీహరి.

"శ్రీహరీ! నీ నీచమైన డబ్బుదాహానికి యిక స్వస్తి చెప్పాలి. నీ పేరులోనే వుంది, నీవు డబ్బు హరించేవాడివని. ఇకనైనా నీ ప్రవర్తన మార్చుకో" సుమతి కఠినంగా శాసించింది.

"సుమీ! నేను తలుచుకుంటే నిన్ను కొనగలను నీవు నీ ఆస్తిని చూసి గర్వపడవద్దు" అన్నాడు శ్రీహరి.

"ఇక ఆపు శ్రీహరీ! ఇప్పుడు నేను తలుచుకుంటే నీ వుద్యోగం ఎగిరిపోతుంది. బజారులో బికారివి కాగలవు బుద్ధిగా నీ భార్య సుగుణను జాగ్రత్తగా చూచుకో, ఆమె నీ పాలిట దేవత" సుమతి సుభాషితం చెప్పింది.

"నీవు చేసుకున్నా చేసుకోకపోయినా సుగుణకు విడాకులివ్వక తప్పదు. ఆమె మా బాస్‌తో ఒకరాత్రి గడిపింది," విషయం వివరంగా చెప్పాడు శ్రీహరి.

"అది నిజం కాదు. ఆమెను పణంగా పెట్టుకుని ప్రమోషను సంపాదించాలని నీవు ఆ రాత్రి బొంబాయి ప్రయాణం పెట్టుకున్నావు. ఆ నీచమైన పని చేయలేక సుగుణ నా దగ్గరకు వచ్చి భోరున ఏడ్చింది. నీ భార్య నా చిన్ననాటి స్నేహితురాలు. అందుకు నేను కొంత సహాయం చేయాల్సి వచ్చింది. నీ బాస్ నాకు కాబోయే భర్త 'రజనీగంధ్' సోదరుడు రాజ్‌పాల్. వెంటనే విషయం తెలుసుకున్నాం. మేము అడ్డుపడ్డాం. తన కాపురం నిలపమని నీ భార్య సుగుణ ఏడ్చింది. నీ నీచమైన ప్రవృత్తి తెలిసికూడా, ఆమెను కనికరించి జాలితో నీకు ప్రమోషను యిప్పించాము. అంతే గాని నీ భార్యను తార్చటం మూలంగా వచ్చిన ప్రమోషను కాదు. ఇప్పుడు తెలుసుకో నీ భార్య దేవతో, దయ్యమో — ఆమెను వదిలిన మరుక్షణం నీవు బజారులో వుంటావు" — సుమతి ఆవేదనతో కూడిన గొంతుతో జరిగిన విషయం చెప్పింది.

"సుగుణ సుమతి చిన్ననాటి స్నేహితురాలు— చెడిపో. మనిషి" తనలో తాను గొణుక్కున్నాడు శ్రీహరి.

"ఇక మీరు వెళ్ళవచ్చు. సుగుణతో కలిసి ఎప్పుడైనాసరే మీరు రావచ్చు. తప్పు చేయటంకన్నా పశ్చాత్తాపం, దానవుణ్ణి మానవునిగా చేస్తుంది" సుమతి చెప్పింది.

తన స్వార్థంకొరకు మానవుడు పలుకుబడిని, డబ్బునేగాక ఆయిన ఆడదాన్ని కూడా పణంగా పెట్టటంలో ఎంత నీచత్వం వుందోననే ఆలోచన రాగానే శ్రీహరికి, ఒక్కసారిగా తలతిరిగినట్లు అనిపించింది. కొన్ని క్షణాలు ఏమీ కనిపించలేదు.

* * *

"సుగుణా! నీకు సుమతి, రాజ్‌పాల్ తెలుసా?" శ్రీహరి కళ్ళు ఎర్రచేసి యిల్లు అదిరిపడేటట్లు అరిచాడు.

"తెలుసు. కాని, నేను కాని పని ఏమి చేయలేదు." ధైర్యంగా సమాధానం చెప్పింది సుగుణ.

"వారినిద్దరిని అడ్డుపెట్టుకుని, నాటకమాడి నాకు ప్రమోషను యిప్పించావా? లేదా!" తుఫాను వురుములా అరిచాడు.

"చేశాను. అది మన యిద్దరి క్షేమం కోరే చేశాను. మీరు నిదానంగా ఆలోచిస్తే బోధపడుతుంది." ప్రశాంతమైన కంఠంతో సుగుణ సమాధానం చెప్పింది.

"లేదు సుగుణా! నిజంగా మన యిద్దరి క్షేమంకోరే చేశావు. నన్ను ఒక మనిషిగా తీర్చిదిద్దావు. నన్ను క్షమించగలవా?" కోపం నటించలేక, ఆపుకోలేని కన్నీటితో ఆమెను తన కౌగిలిలోకి తీసుకున్నాడు.

"పోనీలెండి, మనం సుఖజీవనం చేయటానికి ఆ దైవం కరుణించింది" ఆమె అతని హృదయం మీద వాలిపోయింది. ●



'గందరగోళం'లో ఒక దృశ్యం

బంగారు లక్ష్మితో పట్నం సంగతులు

రాజాకు, లక్ష్మికి పెళ్ళయింది. లక్ష్మి (జయసుధ) పల్లెటూరి పిల్ల. రాజా (చంద్రమోహన్) శ్రీమంతుడు ... అది మొదటి రాత్రి...తియ్యటి కబుర్లకు బదులు లక్ష్మి లేనిపోని విషయాల గురించి అడిగేసరికి రాజాకు చిరెత్తుకొచ్చింది.

"పాలు ..." అంది లక్ష్మి.

"ఆ అవసరం తర్వాత వస్తుంది. బల్లమీద పెట్టు," అన్నాడు రాజా.

"ఉండండి ... ఏమండీ, పట్నంలో పెద్ద పెద్ద మేడలుంటాయి కదండీ ?"

"అవును. ఓడలంత మేడలుంటాయి," అన్నాడు రాజా నిట్టూరుస్తూ.

"మా ఊళ్ళో మేకలు, గొర్రెలు తిరిగినట్టుగా – అక్కడ కార్లు, బస్సులు తిరుగుతుంటాయిగా ?"

"మరే ... తిరుగుతుంటాయి."

"అబ్బ ... ఉండండి. పట్నంలో బోలెడు సినిమాలు ఆడుతుంటాయి కదా ?"

"అవును. బోలెడుంటాయి," అన్నాడు నిరుత్సాహంగా.

"ఏమండీ, శంకరాభరణం – సినిమా చూశారా ?"

"ఆరుసార్లు చూశాను. చాలా ?" అన్నాడు నీరసంగా.

"ఏమండీ, పట్నంలో ... ?"

" — పట్నంలో ఆసుపత్రులు, పెద్ద ఆఫీసులు, ఫ్యాక్టరీలు, రైల్వేస్టేషను, బస్సులు ఉంటాయి. అనేకమైన హోటళ్ళు ఉంటాయి. హోటల్లో భోజనం నాలుగు రూపాయలు. ఇడ్లీ అర్ధరూపాయి. సాంబారు ఫ్రీ ... ఇది పట్నం యొక్క సంక్షిప్త చరిత్ర," అని అప్పజెప్తున్నట్లుగా గబగబ చెప్పి, చప్పన చప్పబడిపోయాడు రాజా.

—జి.వి.జి

లక్ష్మి తెల్లబోతూ చూస్తూండిపోయింది.

ఆర్. త్యాగరాజన్ దర్శకత్వంలో సి. దండాయుధపాణి నిర్మించిన దేవర్ ఫిలిమ్స్ "బంగారు లక్ష్మి" చిత్రానికి నిర్వహణ : చిత్తూరు ఆనందనాయుడు. నిర్మాణత : గుత్తా రాధాకృష్ణ. చిత్తూరు వెంకటేశ్వర ఎంటర్‌ప్రైసెస్ వారు 'నెగటివ్' హక్కుదారులు.

నిర్మాతగా తారల తండ్రి

"దుర్గా నాగేశ్వరరావుగారు డైరెక్టరు. జనవరిలో స్టార్ట్ చేసి, మార్చికి షూటింగ్ ఫినిష్ చేస్తాం," అన్నారు రమేష్. ఈయన జయసుధ, సుభాషిణీల తండ్రి. శ్రీ జ్యోతీ సినీ క్రియేషన్స్ పతాకంలో ఈయన నిర్మించే తెలుగు చిత్రంలో జయసుధ నాయిక. "మరి, మీ చిన్నకూతురు హీరోయిన్‌గా పిక్చర్ తీయరా ?" అన్నాను. "తీసేశాను తమిళంలో. 'మనవి ఉరువాగిరాళ్' అని పేరు. అందులో చిన్నమ్మాయితోపాటు సత్యకళ, పల్లవి, విజయన్, శ్రీకాంత్, శివరంజన్, సురుళిరాజన్, కాంతిమతి, వి.కె. రామస్వామి ఆక్ట్ చేశారు. త్వరలో రిలీజవుతుంది," అన్నారు రమేష్.



ఎల్ల వేళలా...

ఉదాహరణకు అల్పాహార సమయంలో...
నోరూరించే 'ప్రియ' టొమాటో, అల్లం పచ్చళ్లు మీరారగించే అల్పాహారానికి సరికొత్త రుచులను సమకూరుస్తాయి. ఇడ్లీ, దోసె, పకోడీ, సమోసా, బజ్జీ, గారె... ఏదయినా సరే– 'ప్రియ'తో జోడించండి. ఆ రుచి అపూర్వం.
మామిడికాయ, నిమ్మకాయ, గోంగూర, అల్లం, టొమాటో... అన్నీ మీకు నచ్చే పచ్చళ్లే. తెలుగు నేల నాలుగు చెరగులా గాలించి తెచ్చిన పళ్ళూ కాయలకు తగుపాళ్ళలో మసాలాలు మేళవించి, అధునాతన కర్మాగారంలో, పరిశుభ్రమయిన వాతావరణంలో తయారయిన పచ్చళ్లివి.

మీ 'ప్రియ'ను ఈ రోజే కొనండి. మీరు వెచ్చించే ప్రతి రూపాయికి మించిన కమ్మదనాన్ని చవి చూడండి.

తయారుచేయువారు:
ప్రియ ఫుడ్స్
ప్రైవేట్ లిమిటెడ్
వీరంకి, కృష్ణాజిల్లా.



ఎంతో రుచి... ఎంతో రుచి... ప్రియ

Marketed by
Margadarsi Marketing
PRIVATE LIMITED
Eenadu Compound,
Somajiguda,
Hyderabad-500 004.

KIRON/PF/ 80[9[TEL



'మంత్రాలయ శ్రీ రాఘవేంద్ర వైభవం'లో ఒక సన్నివేశం

"జైళ్లల్లో శ్రీదేవి, సుజాత"

★ హైదరాబాద్ సెంట్రల్ జెయిల్లో రౌడీ రాముడు – కొంటె కృష్ణుడు" షూటింగ్. నాయిక (శ్రీదేవి) ఒక దుర్మార్గుని బారినుండి తనను తాను రక్షించుకోడానికి చేయవలసి వచ్చే దొంగతనం చేసి, జైలుకు వెళ్లే సీను ... "నేను కాస్త గాభరాతోనే ఆ జైల్లోకి ప్రవేశించాను," అంది శ్రీదేవి. అక్కడ యావజ్జీవ కారాగార శిక్ష, మరణదండన విధించబడిన ఖైదీలు కొందరితో ఆమె మాట్లాడింది. వారిలో కొందరు ఖిన్న వదనాలతో ఉన్నారు. మరి కొందరు జీవితం మీద విరక్తి చెందినట్లు కనిపించారు కొంత మంది అసలు సినిమా విలన్‌లలాగే ఉన్నారట భీకరంగా.

"ఆ జెయిల్లో బందీలకు చక్కని వసతులున్నాయి. ఆదివారాలనాడు చికెన్, సోమవారాలనాడు మటన్ పెడతారట. శని, ఆదివారాలనాడు టెలివిషన్, నెలకోసారి సినిమా చూపిస్తారట," అంది శ్రీదేవి.

"మిమ్మల్ని టి. వి. లో చూశాం. ఇప్పుడు నేరుగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది," అన్నాడట ఒక ఖైదీ.

"నిజంగా నువ్వు హత్య చేశావా ?" అని ఒక ఖైదీని అడిగిందట.

"అవును. తొందరపడి చేశాను," అని జవాబిచ్చాడతను. "ఏదో ఆవేశంలో చేసేశాం," అన్నారట మరి కొందరు పశ్చాత్తాపంతో. ఒకతను మాత్రం "అవును. చేశాను. అది నా హాబీ," అన్నాడట.

దాంతో శ్రీదేవి గడగడలాడుతూ, వడివడిగా వెళ్లిపోయిందట షూటింగ్ స్పాట్‌కు.

శ్రీదేవి ఇటీవల మద్రాసులో చూసిన సినిమా "కోమా." "మొదటి రెండురోజులు చూసి భయపడిపోయాను. ఆ తర్వాత భయం పోయింది," అందామె లఘువుగా నవ్వుతూ.

★ "ఇ. పి. కో 302" అనే తమిళ చిత్రంలో మదర్ సుపీరియర్‌గా నటిస్తోంది సుజాత. మరణశిక్ష విధించబడిన ఒక ఖైదీని మదర్ సుపీరియర్ కలుసుకునే సీను ... మద్రాసు సెంట్రల్ జెయిల్లో 12 మంది బందీలున్న ఒక సెల్‌లో షూటింగ్‌కు అనుమతి లభించింది. షూటింగ్ ముందు సుజాతకు, టెక్నీషియన్‌లకు ఆ జైలులోని మరికొన్ని సెల్స్‌లను చూపించాడు డైరెక్టర్ జి. ఎస్. వాసన్. కొందరు ఖైదీలను సుజాత పలకరించింది. వాళ్ళు విష సూదులద్వారా ఘోర హత్యలు చేసినవారని తెలియడంతోటే ఆమె భయంతో ఆ సెల్‌లోంచి బయటకు పరుగు తీసింది. ఉప్పెనలా ఆమెకు దుఃఖం ముంచుకొచ్చింది. ఇక, ఆమె మూడ్ పోయిందని ఆనాటి షూటింగ్‌ను రద్దు చేయించాడు డైరెక్టరు. "నేనసలే పిరికిదాన్ని. హత్యలంటే హడల్. దొంగలంటే గాభరా ... మొదట భయం భయంగానే ఆ జైల్లోకి ప్రవేశించాను. ఘోర హంతకులతో మాట్లాడానని తెలిశాక నా చెవుల్లో పిడుగులు పడ్డాయి. నా ఒంటి మీదంతా తేళ్ళూ, జెర్రులూ ప్రాకినట్లయింది. నా పాదాల కింద భూమి కంపించినట్లు, నెత్తిన పిడుగు పడ్డట్లు అయింది. అంత భయాన్నీ పైకి కనపించకుండా లోలోపలే అణచుకునే ప్రయత్నం విఫలమయ్యేసరికి భోరున విలపించేశాను," అంది సుజాత.

'కొత్త జీవితాలు'లో సుహాసిని, హరిప్రసాద్



వడ్డే కిషోర్ సమర్పించు
విజయమాధవి పిక్చర్స్



నిర్మాత: వడ్డే శోభనాద్రి
దర్శకత్వం: వి.మధుసూదనరావు
నిర్వహణ: వడ్డే రమేష్



అన్నపూర్ణ నైజాం: శ్రీతారకరామ



భలే కాపురం

"జూలై 20 నుంచి 26 వరకు జరిగిన మూడవ షెడ్యూల్‌తో ఆరు రీళ్ళు తయారైంది. ఆగస్టు షెడ్యూల్‌లో నాలుగు పాటలు పిక్చరైజ్ చేస్తాం. దాంతో షూటింగ్ పూర్తయినట్లే," అన్నారు ఎస్. గోపాలకృష్ణ. ఈయన దర్శకత్వంలో జి. ఎ. రావు, ఎస్. తాజుద్దీన్ నిర్మించే జాన్‌పాక్ ఇంటర్నేషనల్ వారి "భలే కాపురం"లో చంద్రమోహన్, జయసుధ, గిరిబాబు, గీత, గుమ్మడి, పొట్టిప్రసాద్, సాక్షి రంగారావు, రమాప్రభ, సి. హెచ్. కృష్ణమూర్తి, రమామాలిని, జూనియర్ భానుమతి, జయమాలిని తారాగణం. జంధ్యాల, మహదేవన్, ఆర్. మధుసూదన్, సత్యం, కళాధర్, నాగేశ్వరరావు, రాజేశ్వరరావు తెరవెనుక కృషి చేస్తున్నారు.



'మదనమంజరి'లో జయమాలిని, రంగనాథ్



'పొదరిల్లు'లో జయలక్ష్మి, మురళీమోహన్, శ్రీధర్


జయశ్యాం దర్శకత్వంలో చిత్రాలు

లోగడ లెక్చరర్‌గా పనిచేసి, పలు నాటక నాటికలకు దర్శకత్వం వహించిన జయశ్యాం తొలిసారిగా దర్శకత్వం వహించిన సరళా ఆర్ట్ ప్రొడక్షన్స్ "కర్పూరశిల్పం" నాయికా నాయకులు ప్రతిమ, మనోరంజన్‌లకు కూడా ఇది తొలి అవకాశం. ప్రకాష్, వసంత, శ్రీనివాస్, శాంతి స్వరూప్, శేషగిరి, శకుంతల తక్కిన నటవర్గం. శోభారాజు అనే నూతన గాయనిని కూడా నిర్మాత ఎం. బక్షి పరిచయం చేస్తున్నారు. ఆమె ఆనంద్‌తో కలిసి "పిలిచే ఈ పూలతోట, పరిచే బంగారు బాట" అనే కోపల్లె శివరాం గీతాన్ని గానం చేసింది. పెండ్యాల స్వరకల్పనలో తతిమ్మా మూడు పాటలను ఆచార్య తిరుమల, వై. కృష్ణారావు రాశారు. "శైశవంలోనే వైవాహిక జీవితానికి దూరమైన కుమార్తె తీవ్రమైన మానసిక సంక్షోభానికి గురి అయితే, తన్మూలంగా ఆమె ప్రాణానికి ముప్పు వాటిల్లినప్పుడు క్రుంగిపోయిన కన్నతండ్రి ఆమె ప్రాణాన్ని నిలబెట్టేందుకు తీసుకున్న నిర్ణయం పర్యవసానంతో పతాక సన్నివేశం పూర్తవుతుంది," అన్నారు జయశ్యాం. ఆచార్య తిరుమల కథను, ఐ. దశరథరామయ్య ఛాయను, జి. జి. కృష్ణారావు కూర్పును, శీలావి శిల్పాన్ని సమకూర్చారు.

మయూర్ ఎంటర్‌ప్రైసెస్‌వారి "కొత్త వెన్నెల"లో ఆరు ప్రధాన స్త్రీ పాత్రలకు ప్రముఖ నటీమణులను ఎన్నుకుంటున్నట్లు, నాయక పాత్రలో ఓ 18 ఏళ్ళ యువకుడ్ని పరిచయం చేయదలచినట్లు తెలిపారు నిర్మాత కటికనేని మధుసూదనరావు. పెండ్యాల సంగీతం, ఐ. దశరథరామయ్య ఛాయ, జి. జి. కృష్ణారావు కూర్పు, పొన్నతోట రఘురాం ప్రొడక్షన్ బాధ్యతలను నిర్వహిస్తారు. "సెప్టెంబర్ ఫస్ట్ వీక్‌లో సాంగ్స్ రికార్డు చేస్తాం," అన్నారు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం నెరపే జయశ్యాం.



సర్దార్ పాపారాయుడు'లో ఎన్.టి.ఆర్., శారద



'బెబ్బులి'లో కృష్ణంరాజు, సుజాత

రో ప్రాణం

కుమార్ (చిరంజీవి) కళ్ళు మూసుకొని ్నడు. అతన్ని విజయ్ (కృష్ణంరాజు) హాలులోకి ెకొచ్చి, "జీవితంలో నువ్వు చూడాలని కోరుకునే ్వైనదేది ? ఆగు ! చెప్పకు ... మనస్సులో ెకొని కళ్ళు విప్పు. ఓపన్ చేసేయ్!" అన్నాడు.

కుమార్ కళ్ళు విప్పి, తల్లి (ఝాన్సి)ని ూసి, "అమ్మా ! నువ్వు ... ఇక్కడ ..." ంటూ చకితుడయ్యాడు.

"అంతా ఈ దేవుడి చలవ, బాబూ !" ందామె విజయ్‌ను చూపిస్తూ.

విజయ్ గంభీరంగా "అమ్మా ! నన్ను దేవుడ్ని స్తే, నేనో అమ్మని నష్టపోతాను," అంటూ ుమార్ వంక తిరిగి, "తమ్ముడూ ! మనస్సులో ోరుకున్నది మంచివాళ్ళకే జరుగుతాయట. కపోతే – నువ్వు కోరుకోకపోయినా – మరొకటి ెరిగిపోయింది," అన్నాడు లఘువుగా నవ్వుతూ.

"ఏమిటి ?" అన్నాడు కుమార్.

"అమ్మతోపాటు చెల్లికూడా ప్రత్యక్ష ైంది," అంది శాంతి (మోహిని) పక్కగది ుంచి వస్తూ.

"శాంతి నాకు ఆరో ప్రాణం," అన్నాడు విజయ్.

సినిమా

ఆనందోద్రేకంతో "అయితే, నాకు ఏడో ప్రాణం," అన్నాడు కుమార్.

"మరి, నీ ఆరో ప్రాణం ?" శాంతి క్రీగంట చూసింది.

"మన అన్నయ్య !" అన్నాడు కుమార్.

అంతా నవ్వుకున్నారు.

జయసుధ, సుజాత, సత్యనారాయణ, కె. వి. చలం, పి. జె. శర్మ, సావిత్రి, కాంతారావు, మాష్టర్ రాజు, బేబీ తులసి, బేబీ దేవి, ముక్కామల, రవికాంత్, రమణమూర్తి, భీమరాజు, సారథి, మల్లాది సత్యనారాయణ పాల్గొన్న ప్రభు చిత్రవారి "ప్రేమ తరంగాలు" చిత్రాన్ని ఎస్. పి. చిట్టిబాబు దర్శకత్వంలో ఎం. వి. హెచ్. రాయపరాజు నిర్మించారు. గొల్లపూడి, చక్రవర్తి, ఆత్రేయ, సి. నారాయణరెడ్డి, విలియమ్స్, భాస్కరరాజు, ఐ. అర్జునరావు, ఎం. రోసిరాజు, ఎస్. ఆర్. కృష్ణ, సి. హెచ్. సుబ్బారావు, సత్యనారాయణ, బి. సూర్యనారాయణ తెరవెనుక కృషి చేశారు.

టాక్సీ డ్రయివర్

"సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు షూటింగ్ ఉంటుంది. తొలి షెడ్యూల్ మైసూరు, ఊటీ ప్రాంతాల్లో జరుగుతుంది," అన్నారు కట్టా సుబ్బారావు. ఈయన డైరెక్షన్‌లో విశ్వ చిత్ర సినీ ఎంటర్‌ప్రైసెస్ అధినేత జి ఆర్. కె. రాజు నిర్మించే పై చిత్రంలో కృష్ణంరాజు సరసన నూతన తార గాయత్రి నాయిక. మోహన్‌బాబు, రావు గోపాలరావు, అల్లు రామలింగయ్య, కె. వి. చలం, పండరీబాయితోపాటు శంకరాభరణం రాజ్యలక్ష్మి ప్రధాన పాత్రధారులు. కాశీ విశ్వనాథ్, సత్యం, రాజారాం, కుదరవల్లి, కపిల నాగేశ్వరరావు తెరవెనుక కృషి చేస్తున్నారు.

ప్రేమనాటకం

కట్టా సుబ్బారావు దర్శకత్వం వహించే మరో చిత్రం పరిమళా ఆర్ట్స్ క్రియేషన్స్ "ప్రేమనాటకం". శారద, సంగీత, మంజుభార్గవి,



'భలే కాపురం'లో జయసుధ


గిరిజ, మురళీమోహన్, శరత్‌బాబు, నూతన్ ప్రసాద్, రావు గోపాలరావు, పి. ఎల్. నారాయణ, రాళ్ళపల్లి, కాకరాల. ఆగస్టు 15న పాటల రికార్డింగ్, సెప్టెంబర్ 1 నుంచి 7 వరకు తొలి షెడ్యూల్, అక్టోబర్ 1 నుండి 8 వరకు మలి షెడ్యూల్, నవంబర్ 1 నుంచి 6 వరకు చివరి షెడ్యూల్ జరుగుతుందని తెలియజేశారు నిర్మాతలలో ఒకరైన నందకుమార్. ఇతర నిర్మాతలు స్వామి, శంకరయ్య, బాలనాగయ్య. కాశీ విశ్వనాథ్ కథ – మాటలు, సత్యం సంగీతం, వేటూరి గీతాలు, వెంకట్రామన్ కూర్పుతో నిర్మాణత : అమరనాథ్.


'గూటిలోని రామచిలక'లో సరిత, మురళీమోహన్



ఇంకా ఎక్కువ ఇంధనము పొదుపు చేయండి!


నిమిషాలలో వంటంతా చెయ్యండి






అన్నం, పప్పు, కూరలు—ఒక్కసారే!

ప్రెస్టీజ్ వాడడం వల్ల దాని లోపలి గిన్నెలలో అన్నం, పప్పు, కూరలు మీరు ఒకే సమయంలో వండుకోవచ్చును. సాధారణంగా ప్రెషర్ కుకర్‌లో వంటకు పట్టే సమయం 15–20 నిమిషాలకన్న మించదు. ఆపైన తాలింపులకు మరో కొద్ది నిమిషాలు, అంటే మీ వంటంతా సిద్ధమయినట్లె.



ఎక్కువ వండే చోటు కోసం మరింత పెద్ద గిన్నెలు!

కాని, గిన్నెలు వాడడం వల్ల వంటకు కావల్సిన చోటు మరి బాగా తగ్గిపోదా? ప్రెస్టీజ్ వల్ల అలా జరగదు! కుకర్ ఎంత విశాలంగా ఉందో, ఇంచుమించుగా అంత విశాలంలోనూ, గిన్నెలు పట్టేలా ప్రెస్టీజ్ డిజైన్ చేయబడింది. అందుకే అదే సైజుగల ఇతర డిజైన్ల కుకర్‌ల కన్న ప్రెస్టీజ్, గిన్నెల కోసం మరింత చోటు సమకూరుస్తుంది. మీ అంతట మీరే చూసి తెలుసుకోండి.



ఎలక్ట్రిసిటీ, గ్యాస్, కిరసనాయిల్, బొగ్గులు—పొదుపు చేయండి!

కిరసనాయిల్ లేక బొగ్గులు, ఎలక్ట్రిసిటీ లేక గ్యాస్ పైనగాని ప్రెస్టీజ్‌తో అంతే నేర్పుగ వండవచ్చును. ఇది వంటకు పట్టే సమయాన్ని బాగా తగ్గిస్తుంది కనుక ఇంధనము ఖర్చులో పొదుపు. అటు డబ్బు, ఇటు సమయం కూడా పొదుపు చేయును.

గిన్నెల కోసం ఎంత ఎక్కువ చోటు?

ప్రెస్టీజ్ కుకర్‌ని మీ అంతట మీరే చూసి తెలుసుకోండి. అదే సైజులు గల ఇతర డిజైన్ల ప్రెషర్ కుకర్‌లతో పోల్చి చూసుకోండి. ప్రెస్టీజ్ "ప్రీత్ 6.5" మెడల్‌లో గిన్నెల కోసం 51% ఎక్కువ చోటు దొరుకును. ప్రెస్టీజ్ "ఎలిగెంట్"లో అయితే 101% ఎక్కువ చోటు గిన్నెల కోసం. ఒకే సమయంలో పూర్తి వంటంతా చేసుకొనేందుకు ప్రెస్టీజ్‌ని మించిన ప్రెషర్ కుకర్ లేదు.

Prestige

ఉచితం! "నిమిషాలలో వంటంతా చెయ్యండి" వివరాల పుస్తకము.

ఈ పుస్తకము కోసం, కన్స్యూమర్ సర్వీస్ మేనేజర్, ప్రెస్టీజ్ టిటి. (ప్రైవేట్) లిమిటెడ్, దూరవాణి నేషనల్ సర్వీస్ సెంటర్, నగర్, బెంగుళూరు 560 016 ఈ చిరునామాకు వ్రాయండి.

MCA-TI-55-Tel

(గత సంచిక తరువాయి)



[ఇంకా ఉంది]

అత్తలేని కోడలు

"గొల్లపూడి, సత్యం, వేటూరి సంగీత సాహిత్యాలతో కట్టా సుబ్బారావు దర్శకత్వంలో త్వరలో ప్రారంభించే 'అత్తలేని కోడలు' ఓ వెరైటీ కథ," అని తెలిపారు శ్రీ విష్ణుప్రియా ప్రొడక్షన్స్ అధినేత జాగర్లమూడి రాధాకృష్ణమూర్తి.

శుభోదయంలో చంద్రోద్యోగాన్వేషణ

చంద్రం (చంద్రమోహన్) పెదవి విరిచాడు. శారద (అన్నపూర్ణ) ప్రశ్నార్థకంగా చూసింది.

"ప్చ్! నా జాతకం ఏమిటో నా కర్థం కావడంలేదొదినా. అమావాస్యనాటి అర్థరాత్రి కరెంటుపోయినప్పుడు పుట్టిన ఫలితమో ఏమిటో— బ్రతుకంతా చీకటైపోయింది. తిరిగి తిరిగి విసుగొస్తుందే తప్ప — ఉద్యోగం దొరకడంలేదు... ఇప్పుడు చూడొదినా! ఈ ఇంటర్వ్యూ మలక్‌పేటలో. ఇంకొకటి హిమయత్‌నగర్, ఇంకొకటి అశోక్‌నగర్, ఇంకొకటి సంజీవరెడ్డి నగర్. పోస్ట్‌మన్‌లా ఊరంతా తిరుగుతున్నాననుకో. ఆ నీరసంలో — వాళ్ళేం అడుగుతున్నారో, నేనేం జవాబు చెబుతున్నానో నా కర్థం కావడంలేదు. మొన్నటికి మొన్న ఒక ఇంటర్వ్యూలో 'పూరీ జగన్నాథం గురించి మీకేం తెలుసు?' అని అడిగారు. ఆకలిమీదున్నానో ఏమో — 'జగన్నాథం హోటల్లో పూరీలు రుచిగా చేయబడును. తిన్నవారికి దేహదార్ఢ్యము, ధాతుపుష్టి కల్గును' అని అన్నాను. 'ఇంటికెళ్ళి పూరీలు వత్తుకోరా' అన్నారు.


"పోపుల డబ్బాలు అవీ వెతికితే — ఈ నాలుగు రూపాయిలూ దొరికాయ్. ఇవి తీసుకొని బస్సులో వెళ్ళిరా, నాయనా!" అంది శారద.

"ఏమిటో, వదినా! నేను మరీ సిగ్గుపడి పోయేలా చేస్తున్నావ్. నువ్విలా డబ్బిచ్చావని అన్నయ్యకి తెలిస్తే..."

"ఆయన మాత్రం ఇన్నేసి మైళ్ళు నిన్ను నడిచి తిరగమంటారేమిటయ్యా? మళ్ళీ అమృత ఘడియలు వెళ్ళిపోతాయేమో — వెళ్ళిరా."

"వస్తానొదినా!"


"భగవంతుడి దయవల్ల ఈసారన్నా అబ్బాయికి ఉద్యోగం దొరికితే..." అంటూ గోడకున్న పటానికి నమస్కరించింది శారద.



'దొడుదొంగలు'లో కృష్ణ, మాడ, చిరంజీవి

సినిమా

"ఆగస్ట్ 5 నుంచి 15 వరకు శ్రీకాళహస్తిలో జరిగే రెండవ షెడ్యూల్‌తో చిత్రం పూర్తవుతుంది," అన్నారు కె. విశ్వనాథ్. ఈయన కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో శ్రీరామ్ ఆర్ట్ పిక్చర్స్ "శుభోదయం" చిత్రం తొలి షెడ్యూల్ జూన్ 23 నుంచి జూలై 21 వరకు హైదరాబాద్‌లో జరిగింది. చంద్రమోహన్, సులక్షణ, సాక్షి రంగారావు, మనోరమ, చారుహాసన్, కృష్ణప్రియ, భానుప్రకాష్, అన్నపూర్ణ, విజయరాం, దాసు, రాంబాబు, పొట్టిప్రసాద్ పాత్రధారులు. జంధ్యాల, మహదేవన్, వేటూరి, కమ్మారి, తోట సహకారంతో ఎడిటర్ జి. జి. కృష్ణారావు సమర్పించే ఈ చిత్రానికి సి. హెచ్. నరసింహారావు నిర్మాత.



'మానవుడు – మహనీయుడు'లో శోభన్‌బాబు, సుజాత

సినిమా

కుమార్ తెరవెనుక కృషి చేస్తారు. "ఆత్రేయగారు మాటలు, పాటలను సుపర్బ్‌గా రాశారనడం పంచామృతం మధురంగా ఉందని చెప్పినట్లుంటుంది. విశేషమేమిటంటే ఎంతో క్విక్‌గా రాసిచ్చారు," అన్నారు పరమానందంతో డైరెక్టర్ ఎస్. పి. చిట్టిబాబు.

భారతీరాజా తొలి చిత్రం

"గురు" చిత్రాన్ని అందించిన సుజాత ఫిలిమ్స్ [ప్రై] లిమిటెడ్‌వారు కమలహాసన్, శ్రీదేవి జంటతో నిర్మించే చిత్రానికి కథ, చిత్రానువాదం, దర్శకత్వం భారతీరాజా నిర్వహిస్తారు. ఎం. ఎస్. దాస్ స్టంట్లు అదనపు ఆకర్షణ.

కట్టా – మీఠా


"కట్టా–మీటా" హిందీ చిత్రం ఆధారంగా కళైకూడమ్‌వారు నిర్మించే చిత్రానికి ఈరంకి శర్మ దర్శకుడు. ★

'నిజం దాగదు'లో మంజుల, శ్రీనాథ్




ప్రభు చిత్ర ద్వితీయ చిత్రం

"ప్రేమ తరంగాలు" చిత్రం సెప్టెంబర్ చివరి వారంలో విడుదలవుతుంది. "ఈలోగానే మరో చిత్రాన్ని ఎస్. పి. చిట్టిబాబు డైరెక్షన్‌లోనే ప్రారంభిస్తాం. ఆగస్ట్ 1 నుంచి 3 వరకు సాంగ్స్ రికార్డ్ చేస్తాం. సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు ఊటీ, కోడైక్కనాల్ ప్రాంతాలలో జరిగే షూటింగ్‌తో మూడు వంతులు పూర్తవుతుంది. అక్టోబర్ మొదటి వారంలో ప్యాచ్ వర్క్. డిసెంబర్‌లో క్రిస్‌మస్ సందర్భంగా రిలీజ్ చేస్తాం... ఇదొక చక్కని ప్రణయగాథ," అన్నారు ఎం. వి. హెచ్. రాయపరాజు. ఈయన నిర్మాణ నిర్వహణలో తయారయ్యే కొత్త చిత్రంలో చంద్రమోహన్, చిరంజీవి, రతి, రాధిక (స్వర్గీయ ఎం. ఆర్. రాధా కుమార్తె), కె. వి. చలం, చక్రవర్తి, భీమరాజు, శివకుమార్ ఆదిగాగలవారుంటారు. చక్రవర్తి, భాస్కరరాజు, డి. రాజగోపాల్, ఎస్. ఆర్. కృష్ణ, పి. దిలీప్







పోలీసుల అత్యాచారాలు
జుడిషియల్ కస్టడీలో స్త్రీ మానభంగం
ఏ.గ్రామంలో 9 మంది స్త్రీల మానభంగం
మానభంగం నేరానికి కానిస్టేబుల్ అరెస్టు
విశాఖ సమీప గ్రామంలో స్త్రీ మానభంగం
Cases of Rape: 8 Held in Tumkur
పోలీసుల గృహిణిపై ఘాతుకం
మరొక
బంగారం లాంటి ఇలు ఖాళీ చేస్తున్నారేమిటో?
అర్రే! పక్కవాటాలో పోలీసు ఇనిస్పెక్టర్ గారు దిగారు! ఈడొచ్చిన ఆడపిల్లలతో ఎలా వుండమంటారు?
పెట్టె పోయిందని పోలీసులకు రిపోర్టు ఇవ్వండి...
అమ్మో! పోలీసు రిపోర్టా? వద్దు! పోతేపోయింది పెట్టెగా!
సినిమాలో విలన్ రేప్ చేస్తున్నాడు! పక్కనవున్న అమ్మాయి దుస్తులు నన్ను పిచ్చి ఎక్కించాయి! రేప్ చేశా! అంతే! నేను నిర్దోషిని!
పోలీసు వస్తున్నాడు లోపలికి పో
రేప్ చేసి పారిపోతావా పద!!
మిస్టర్! నా వెనక ఎవరున్నారో... నేనెవరినో చెబితే.. నీ ఉద్యోగం పోతుంది!



ప్రేమలేఖ

చంద్రం

జవాను ఏడుకొండలు ఓ అర్జెంటు ఫైలు తెచ్చి అయ్యగారి టేబుల్‌మీద పెట్టి వెళ్ళాడు.

కళ్ళద్దాలు సవరించుకొని, యధాలాపంగా ఫైలు తెరిచిన ఆఫీసర్ శివానందం దృష్టిని, ఓ కాగితం మడత ఆకర్షించింది. మడిచి వుండటాన ఆ కాగితం ఫైలుకు సంబంధించింది కాదని తేలిపోగా, కుతూహలంగా విప్పి చూశాడు. అదొక ఉత్తరం.

''డియర్ ఆనంద్ ! ...''

ఆశ్చర్యపోయాడు శివానందం. ఉత్తరాన్ని చూసి ఆశ్చర్యపోయాడంటే ఉత్తరాల ముఖం ఎరగని వాడని కాదు శివానందం. సంబోధనలోని కొత్తదనం – 'డియర్' అన్న పదమే ఆయన్ని ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఆత్రంగా ఆసాంతం చదివేశాడు ఉత్తరాన్ని.

''డియర్ ఆనంద్ ! చివరికి నేనే తెగించి ఉత్తరం రాస్తున్నాను. మగాడివి గనుక నువ్వే ముందుగా ఆ పని చెయ్యాల్సింది. కాని, నువ్వు చెయ్యలేదు. నువ్వు ముందంటే నువ్వు ముందని యిద్దరం వంతులు వేసుకొని కూచుంటే, అమూల్యమైన కాలం వృధా అయిపోతుంది తప్ప, ఫలితం శూన్యం. అందుకనే ఆడదాన్నైనా నేనే ఆ అవకాశాన్ని తీసుకొని, మన ప్రణయ నాటకానికి నాందీ ప్రస్తావన చేస్తున్నాను. అన్యధా భావించవద్దు

ఏనాడో నా మనస్సు నీపై లగ్నమైంది. ఒక స్త్రీ తన హృదయాన్ని ఏ పరిస్థితిలో ఒక పురుషుడికి అర్పించుకొంటుంది ? – అందం చూశా ? గుణం చూశా ? డబ్బు చూశా ? హోదా చూశా ? – వీటన్నింటికీ అతీతమైన మరేదో చూశా ? – ఏమో నాకు తెలీదు. బహుశా ఏ స్త్రీ కూడా యిలాంటి ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పలేదేమో !

ఓ పవిత్ర క్షణాన, మధుర ప్రణయ భావ తరంగం నాలో వువ్వెత్తున లేచి, అందుకు కారణ భూతుడవైన నీ చుట్టూ పరిభ్రమించ సాగింది. అది మొదలుగా అనుక్షణం నిన్ను చూడాలని, నీతో మాట్లాడాలని, నీ సన్నిధిలో కాలం గడపాలని పరితపించిపోతున్నాను. కాని, నా మనస్సు విప్పి చెప్పే అవకాశం యింతవరకు తటస్థ పడలేదు. అనునిత్యం మనం తారసపడుతూనే వున్నా, ఏకాంతంగా సంభాషించుకోవటానికి ఒక్క క్షణం వీలు చిక్కటంలేదు. అయినా, నా కంటి చూపులు, మూగబాసలు నీకర్థం కావటంలేదా ? అర్థమయ్యీ బెట్టు చూపుతున్నావా ?

ఇంతకాలం చంద్రుని కోసం చకోరపక్షిలా, నీ పిలుపుకోసం ఎదురుచూస్తూ గడిపాను. ఇంక నిరీక్షించటం నావల్లకాని పని. అందుకనే ఈ లేఖ రాస్తున్నాను. వలచివచ్చిన స్త్రీ అలుసన్న

దగ్గు గప్‌చిప్

గ్లైకోడిన్, ఇబ్బంది పెట్టే
అన్ని రకాల
దగ్గుల కోసం



గ్లైకోడిన్, దగ్గును ప్రేరేపించే నాలుగు స్థానాలలో పనిచేస్తుంది.

1. మెదడులో దగ్గాలని అనిపించే కోరికను కలగనివ్వదు
2. గొంతులో గరగరలాడటం నుంచి ఉపశమనం ఇస్తుంది.
3. ఊపిరితిత్తుల్లోని కఫాన్ని బయటకు తెచ్చేస్తుంది.
4. ఛాతీలో, పట్టుకునేలాంటి అసౌకర్యాన్ని దూరంచేసి విశ్రాంతినిస్తుంది.

గ్లైకోడిన్ శ్వాస హాయిగా తీసుకునేందుకు, హాయిగా నిద్రపోయేందుకు తోడ్పడుతుంది.

గ్లైకోడిన్

దగ్గుల్ని తగ్గించడంలో భారతదేశంలో ముందడుగు.

Alembic

అలెంబిక్—డాక్టర్లకు వీరి మందులపై విశ్వాసం ఉంది.

everest/80/ACW/166 TL

సామెతగా చెయ్యకు. నీ అంగీకారం కోసం ఎదురు తెన్నులు చూస్తూ—

నీ స్వంతం కావాలనుకొంటున్న,

— కామేశ్వరి.''

ఉత్తరం చదవటం పూర్తయింది. శివానందం ఒళ్ళంతా చిరుచెమట పట్టింది. మామూలు ఉత్తరమా అది? — ప్రేమలేఖ! తన జీవితంలో ప్రేమలేఖ అందుకోవటం యిదే మొదటిసారి. అపూర్వమైన విషయం. అపురూపమైన అనుభవం. ఆశ్చర్యం, సంతోషం, సంభ్రమం ఒక్కసారే కలిగినయ్. వాటన్నింటినీ ఒక్కసారిగా తట్టుకోవటం కష్టమైపోయింది. రక్తప్రసరణం అధికమైంది.

కళ్ళజోడు తీసి టేబుల్‌మీద పెట్టి, రుమాలుతో ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. కొద్దిక్షణాలు విశ్రాంతి తీసుకున్న తరవాత, కళ్ళజోడు తగిలించుకొని, మరొకసారి ఉత్తరాన్ని చదివాడు — సవిమర్శకంగా.

శివానందం వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. జుట్టు నెరవటం, నడుం వంగటం లాంటి వార్ధక్య లక్షణాలు లేవుగనుక, చూపులకు కాస్త చిన్నవాడిగానే కనిపిస్తాడు. పాతిక సంవత్సరాలనాడు యింటర్మీడియెట్ పాసై, గుమాస్తాగా ఉద్యోగ జీవితం ప్రారంభించాడు. తరవాత తదేక దీక్షతో శ్రమించి, ఒకటి తరవాత ఒకటిగా డిపార్టుమెంటల్ పరీక్షలు గట్టెక్కి, ఓ ఏడాది క్రితమే ఆఫీసరు కాగలిగాడు.

యౌవన ప్రారంభదశలో స్త్రీ సంబంధమైన వూహలు రావటం, ఉక్కిరిబిక్కిరి కావటం కుర్రవాళ్ళకి సహజమే. కాలేజీలో చదువుకొనే రోజుల్లో, కనిపించిన ప్రతి ఆడపిల్లనీ తన కథానాయికగా వూహించుకొని, కలలు కంటుండేవాడు శివానందం. తనకైతే ఎవ్వరూ రాయలేదుగాని, తనుమాత్రం ఎంతోమందికి ఎన్నో ప్రేమలేఖలు రాశాడు. రాయటమైతే రాశాడుగాని, పోస్టుచేసే ధైర్యం లేకపోయింది. ఒకటి రెండు సందర్భాల్లో తప్ప మిగిలినవన్నీ తనదగ్గరే అట్టేపెట్టుకొని, కొంతకాలం తరవాత చింపిపారేశాడు. పోస్టు చేయబడిన ఆ ఒకటి రెండు ప్రేమలేఖలకు కూడా సమాధానాలు రాలేదు. అంతటితో ప్రేమలేఖల పర్వం పరిసమాప్తమైపోయింది.

ఆటు తరవాత ఉద్యోగంలో చేరటం, వివాహం కావటం, పిల్లలు పుట్టటం, ప్రమోషన్లకోసం పాకులాడటం... అంతులేని జీవితపోరాటం ప్రారంభమైంది. చిల్లరమల్లర వ్యవహారాల గురించి ప్రయత్నించేంత సావకాశం లేకపోయింది. అయినా, అప్పుడప్పుడు — అందమైన అమ్మాయిలు కంటబడినప్పుడు — గత స్మృతులు — తీరని కోరికలు — అసంతృప్తి — కెలకవెయ్యటం జరుగుతూనే వుంది.

'ప్రేమ'—అనేది ఓ అద్భుతమైన అనుభవం అనీ, ఒక వరం లాంటిదనీ, ఆ అదృష్టం అందరికీ పట్టదనీ ఎప్పుడో ఎక్కడో చదివాడు శివానందం. ప్రేమించటం కన్న ప్రేమించబడటం మరో గొప్ప విషయం అని కూడా విన్నాడు.

ప్రేమలేఖ

తను నిజంగా దురదృష్టజాతకుడే! ప్రేమించబడటం మాట దేవుడెరుగు — ప్రేమించటం అయినా సక్రమంగా జరిగి చావలేదు. శారీరకమైన అనుభవాలు లేకపోయినా, కనీసం ప్రేమలేఖల వరకు కథ నడిచి, ఆ తరవాత ఆగిపోయినా అంతగా విచారం లేకపోను. చరిత్ర ప్రసిద్ధాలైన ఎన్నో ప్రేమ కథలు మధ్యంతరంగా ఆగిపోయినవే కదా! నాయికా నాయకులు ప్రేమించుకుంటారు. పరిస్థితులో, పెద్దలో అడ్డుపడతారు. ప్రేమికులు కలుసుకోనే కలుసుకోరు. అయినా ఆ కథలన్నీ అజరామరాలై విరాజిల్లుతున్నాయి! ప్రేమ లేఖలు తను రాయటమే కాని, తనకు రాసినవారెవ్వరూ లేకపోయారు. పెళ్ళయిన తరవాత--కనీసం భార్య పార్వతి అయినా ఒక్క ప్రేమలేఖ రాసి అతని కోరిక తీర్చలేకపోయిందంటే — అది దురదృష్టం గాక మరేమవుతుంది?

పల్లెటూళ్ళో, సాంప్రదాయికమైన కుటుంబంలో పుట్టి పెరిగిన పిల్ల పార్వతి. తల్లిదండ్రులు చూసి, మెచ్చి, ముచ్చటపడి, కుదిర్చి, చేసిన పెళ్ళి తమది. పట్నవాసపు తళుకు బెళుకులు లేకపోయినా, సహజ సిద్ధమైన శరీర సౌష్టవం, తీర్చిదిద్దినట్టుండే కనుముక్కు తీరు, యౌవనపు సొంపు, పసిమిరంగు శరీర ఛాయా కలిగిన పార్వతిని చూసి, మనస్ఫూర్తిగా యిష్టపడ్డాడు తను.

బాల్యంలో కుమారీ శతకం, రుక్మిణీ కల్యాణం, గజేంద్ర మోక్షం టీకా తాత్పర్య సహితంగా కంఠోపాఠం చేసిన పార్వతికి, తెలుగు భాష రాయనూ చదవనూ బాగా వచ్చు. భార్యా విధుల్ని చక్కగా నిర్వర్తిస్తుంది. భర్తను సంతృప్తిపరచటంలో దనకు తనే సాటి. అవసరమైతే ఎంతటి త్యాగానికైనా సిద్ధపడుతుంది. కాని, ఏం లాభం? ఉత్తరాల దగ్గర కొచ్చేటప్పటికి అసంతృప్తి తప్పనిసరైపోయింది.

పార్వతిని పుట్టింటికి పంపిన ప్రతిసారీ మరీ మరీ చెప్పి పంపేవాడు శివానందం — ఉత్తరాలు రాస్తూండమని. అంతటితో వూరుకోక, ముందుగా తనే రాసేవాడు. అట్నుంచి వెంటనే సమాధానం వచ్చేది. కాని, పార్వతి రాసేదికాదు. తండ్రితోనో, అన్నతోనో రాయించేది. అదేమిటంటే — 'నాకు సిగ్గు బాబూ!' అనేది చెక్కిళ్ళు ఎర్రబడగా. ఇంకేం చెయ్యగలడు తను? అయినా ఒకటి రెండు సారులతో నిరుత్సాహపడి వూరుకోక, చాలాసార్లు నయానా భయానా చెప్పిచూశాడు. ఫలితం లేకపోయింది. అన్నివిధాలా అనుకూలవతియైన భార్యను ఆ ఒక్క కారణం దృష్టిలో వుంచుకొని, కొట్టటమో, తిట్టటమో, నిందించటమో, మరేదో విధంగా శిక్షించటమో చెయ్యకుండా, క్షమించగలిగాడు తను. కాని, కనీసం భార్య నుంచైనా ప్రేమలేఖ అందుకోలేని తన దురదృష్టాన్ని నిందించుకోకుండా ఉండలేకపోయాడు.

శివానందానికి కొన్ని నియమాలున్నాయి. సర్వసాధారణంగా వాటిని అతిక్రమించటం జరగదు. ఇంటిలో భార్యను వుంచుకొని, పైపై సరదాల కోసం బయట ప్రాకులాడటం అతని దృష్టిలో క్షమించరాని నేరం. భార్యను అన్యాయం చెయ్యటం ఒకటి, నైతికంగా దిగజారిపోవటం యింకొకటి — రెండూ క్షమార్హం కానివే. పెళ్ళయిన మరుక్షణం నుంచీ తన నియమానికి కట్టుబడివున్నాడు శివానందం. మనస్సుని, వూహల్ని జయించటం మానవమాత్రుడికి సాధ్యంకాని పనిగాని, భౌతికంగా మాత్రం అతను ఏకపత్నీవ్రతుడే. పెళ్ళయి, ముగ్గురు బిడ్డల తండ్రయి, రెండు పుష్కరాల దాంపత్య జీవితం అనుభవించిన తరవాత, యిప్పుడు — ఈ క్లిష్ట సమస్య ఎదురైంది.

మరొకసారి ఉత్తరం పరిశీలించాడు శివానందం

ఉత్తరం కామేశ్వరి రాసిందే — సందేహం లేదు. మరొకరెవరన్నా రాసి నాటకమాడుతున్నారనుకోవటానికి అవకాశం లేదు — ఈ ఫైలు ఆమె సీటుకు సంబంధించిందే గనుక!

కామేశ్వరి వయసు యిరవై పైనా — పాతిక లోపూ వుంటుంది. అంటే కాస్త అట్టూయిటుగా తన పెద్దకూతురి వయస్సన్నమాట! అలాంటిది నలభై అయిదు సంవత్సరాలు నిండిన తనను ప్రేమిస్తోందా లోకంలో యువకులే కరువైపోయినట్టు! ఆమె మనసులో ఏముందో ఎవరు చెప్పగలరు? ఎక్కడో చదివిన గుర్తు — పాశ్చాత్య దేశాల్లోని ఆడపిల్లలు ఈమధ్య ఎక్కువశాతం వయసుమళ్ళిన మగాళ్ళనే మోజు పడుతున్నారట! ఈమెకూడా అదే బాపతేమో!

మళ్ళీ ఒకసారి చదువుకున్నాడు శివానందం ప్రేమలేఖని.

'గోపాలరావుగారి అమ్మాయి'లో



ఒకప్పుడు ప్రేమలేఖ కోసం పరితపించి పోయాడు. ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఫలితం లేకపోయింది. భార్యవల్లకూడా ఆ కోరిక తీరక పోవటంలో పూర్తిగా నిరుత్సాహపడిపోయి, అది తీరని కోరికగానే భావించి, అంతటితో ఆ ప్రసక్తి మానుకున్నాడు. అలాంటి దిప్పుడ—అప్రయత్నంగా, అకాల వర్షాగమనంలా వచ్చిపడింది ఉత్తరం!

ఇది — ఈ ఉత్తరం — నిస్సందేహంగా ప్రేమలేఖే. కామేశ్వరి అనే యువతి, ఆనంద్ అనే — యువకుడు కాకపోవచ్చునుగాని, మగాడేగా— అతనికి రాసి పంపిన ప్రణయ సందేశం ప్రేమలేఖ కాక మరేమవుతుంది?

పదే పదే చదువుకున్నాడు శివానందం. వాక్యాలు, పదాలు ఎక్కడికక్కడ విడగొట్టి, పట్టి పట్టి చదువుకున్నాడు. శివానందం అన్న తన ముసలి పేరును నాగరీకంగా 'ఆనంద్' అని మార్చినందుకు సంతోషించాడు. వయసులోనూ, హోదాలోనూ పెద్దవాడైన తనను ఏకవచనంలో సంబోధించటాన్ని, సందర్భాన్నిబట్టి సలక్షణమేనని సమర్థించుకున్నాడు. తనలో ఏం చూసి ఆమె ప్రేమిస్తోంది? — అన్నది వూహకందని ప్రశ్నగా భావించి వదిలివేశాడు. వలచివచ్చిన స్త్రీని చులకన చెయ్యవద్దంటోంది! ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? ఆమె ఆహ్వానాన్ని అంగీకరించటమా? మానటమా?

విచిత్రమైన మానసికావస్థలో పడిపోయాడు శివానందం. ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వూహలతో, ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో చిక్కుకుపోయాడు. ఆలోచనలు పరిష్కారపథాన పయనించలేక పోతున్నాయి.



!. విజయ, జయసుధ

ఆలోచించలేక, ఆఫీసు పని చెయ్యలేక, కుర్చీలో కూర్చోలేక పైకి లేచాడు శివానందం. అంత గదీ తనొక్కడికే యిరుకైపోయినట్టు, పంకా తిరుగుతున్నా వుక్కపోస్తున్నట్టు, ఊపిరి సలపనట్టు అనిపించసాగింది.

స్ప్రింగ్ డోర్ తెరుచుకొని ముందు గదిలోకి వచ్చాడు

ఉద్యోగులంతా ఎవరి పనిలో వాళ్ళు లీనమై వున్నట్టు కనిపించారు.

శివానందం కాళ్ళు అప్రయత్నంగా కామేశ్వరి సీటువైపు నడిచినయ్. తలొంచుకొని బుద్ధిగా పనిచేసుకొంటోంది కామేశ్వరి. కొద్ది క్షణాలు పక్కనే నిలబడి, కుతూహలంగా చూశాడు శివానందం. ఏదో మాట్లాడాలనుకున్నాడు. కాని, ఏమీ మాట్లాడలేకపోయాడు. వెనక్కి తగ్గి, ఒకసారి గదంతా చుట్టివచ్చి, మళ్ళీ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

ఆ రోజంతా ఒక్క ఫైలు చూడలేదు. ఒక్క కాగితంమీద సంతకం చెయ్యలేదు. ఏదో ఆరాటం. ఎటూ తేల్చుకోలేని పరిస్థితి. ప్రేమలేఖ మాత్రం పదేపదే చదువుకున్నాడు.

గడియారం అయిదు కొడుతుండగా సీటు లోంచి లేచాడు శివానందం. ప్రేమలేఖ జేబులో పెట్టుకొని యింటికి వెళ్ళటం ఎలాంటి ప్రమాదాలకు దారి తీస్తుందో వూహించలేనంత అమాయకుడు కాడతను. అలా అని బయట వుంచటమూ శ్రేయస్కరం కాదు. అందుకని ఆఫీసుకు సంబంధించిన రహస్య పత్రాలు భద్రపర్చే యినప బీరువాలో దాచాడు.

బయటికి వచ్చాడన్న మాటేగాని యింటికి పోబుద్ధికాలేదు. అస్తవ్యస్తమైన ఆలోచనలతో సతమతమైపోతూ, బజారువెంట నెమ్మదిగా నడుస్తున్నాడు.

ఇప్పుడంటే ఆఫీసరుగాని, ఏడాది క్రితంవరకు అతను సాధారణ ఉద్యోగే. పని చేస్తున్నదేమో పైసా పై సంపాదనకు ఆస్కారంలేని నిప్పులాంటి డిపార్టుమెంటు. అదీగాక, వ్యక్తిగతంగా అతను నిజాయితీపరుడు. పైగా జీతమే జీవనాధారంగా గలవాడు. కాబట్టి, సదరు కారణాల వల్ల అతనికి వాహనయోగం లేకపోయింది. స్కూటరు, కారు వగైరా వాహనాల్ని తను స్వయంగా కొనుక్కోలేదు సరేసరి. కనీసం ప్రభుత్వ వాహనాన్నైనా వుపయోగించుకొనే అవకాశం అతను వెలగబెడుతున్న రెండవ తరగతి ఆఫీసర్ గిరీకి లేదు. ఎప్పుడో పాతికేళ్ళనాడు — ఉద్యోగంలో చేరిన తొలి దినాల్లో కొనుక్కున్న సైకిలు కూడా పోయినేడే పాత యినప సామానుల కొట్టులోకి వెళ్ళిపోయింది. మరోటి కొనుక్కుందాం అన్న ఆలోచన వచ్చింది గాని, గుమాస్తాలు, బంట్రోతులు జామ్మంటూ స్కూటర్లపైన తిరుగుతున్న ఈ రోజుల్లో, ఆఫీసరై వుండీ సైకిలు తొక్కుకోవటం నామోషీ అనిపించింది. అందుకనే ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

హోటల్లోదూరి, టిఫిన్ చేసి, కాఫీ తాగాడు.
మనసు యింటివైపు పోవటం లేదు.
ఏం చెయ్యాలి?

కాలక్షేపం చెయ్యటానికి ఆ ఊళ్ళో 'బీచ్' లేదు. 'పార్కు' అని పిలవబడుతున్న ప్రదేశం ఒకటుందిగాని, అది కేవలం బిచ్చగాళ్ళకే పరిమితమై వుంది. అందుకని, సినిమాకి వెళ్ళాడు. గత్యంతరం లేక వెళ్ళాడన్న మాటేగాని, సినిమా మీద మాత్రం మనసు నిలుస్తుందా? మధ్యలోనే లేచిపోయాడు. కాస్సేపు అటూ యిటూ తిరిగి, తొమ్మిదిన్నర — పదిగంటల మధ్య యింటి తలుపు తట్టాడు.

అతని రాకకోసమే నిద్రకాచుకొని ఎదురు చూస్తున్న పార్వతమ్మ వెంటనే తలుపు తెరిచింది.

పిల్లలు ముగ్గురూ నిద్రపోతున్నారు.

భోజనం ముందు కూచున్నాడన్న మాటేగాని, అన్నం సహించలేదు. అయినా పార్వతమ్మ వూరుకోలేదు. కొసరి కొసరి వడ్డించి, బలవంతంగా నాలుగు ముద్దలు తినిపించింది.

తలెత్తి భార్య ముఖంలోకి చూడలేకపోయాడు శివానందం ఇన్నేళ్ళ తన దాంపత్య జీవితంలోనూ భార్య ముందు తల వంచుకోవలసిన పరిస్థితి అతని కెప్పుడూ ఎదురవలేదు. కామేశ్వరి రాసిన ప్రేమలేఖ అతనిలో కలిగించిన సంచలనం యిప్పుడలాంటి పరిస్థితిని కల్పించింది.

మంచంమీద వాలాడుగాని, బుర్రను తొలిచేస్తున్న ఆలోచనలు నిద్రను దరిజేరనిస్తేనా?

ఓ రాత్రి వేళ — ప్రశాంతంగా నిద్రపోతున్న భార్యని కుదిపి లేపాడు శివానందం. బద్ధకంగా కళ్ళు తెరిచి, ఏదో చెప్పబోయిన భార్యకి ఆ అవకాశమే యివ్వలేదతను. భర్త ఉద్రేకం చూసి ఆశ్చర్యపోయింది పార్వతమ్మ. పార్వతిలో కామేశ్వరిని వూహించుకొని, యిరవై ఏళ్ళు చిన్నవాడైపోయినట్టు ప్రవర్తించాడు శివానందం. అసలు కారణం తెలీని పార్వతమ్మ భర్త చేష్టలకు తృప్తిగా నవ్వుకుంది.

ఆలోచనలు యింకా ఓ నిర్ణయానికి చేరుకోకపోయినా, శివానందం ప్రవర్తన — అసంకల్పితంగానే — కామేశ్వరి వైపు మొగ్గు చూపించసాగింది.

శివానందానికి ఖరీదైన సూటు ఒకటుంది. ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప, సాధారణంగా దాన్ని బయటికి తియ్యడతను. మామూలుగా అయితే ప్యాంటు, షర్టు వేసుకొని, చెప్పులు తొడుక్కుంటాడు.

రెండో రోజు ఉదయం నున్నగా గడ్డం గీసుకొని, సూటు పైకి తీశాడు శివానందం. స్వయంగా పాలిష్ చేసి బూటు తొడుక్కున్నాడు. టై కట్టి, కోటు కూడా వేసుకొని, ప్రత్యేకంగా ముస్తాబై, కొత్త పెళ్ళికొడుకులా ఆఫీసుకు బయలుదేరాడు.

ఏదైనా మీటింగుంది కాబోలు — అనుకుంది పార్వతమ్మ.

ఎండలో నడిస్తే, చెమటపట్టి, ముస్తాబు పాడైపోతుందని, రిక్షాలో ఆఫీసు చేరుకున్నాడు శివానందం. అప్పటికే స్టాఫ్ అంతా వచ్చేసి వున్నారు. క్రీగంట కామేశ్వరిని చూసుకుంటూ వెళ్ళి తన గదిలో ప్రవేశించాడు.

ఏమైనాసరే, యివ్వాళ కామేశ్వరితో

మాట్లాడెయ్యాలనుకున్నాడు శివానందం. కాని, ఏం మాట్లాడతాడు? ఎలా మాట కలుపుతాడు? ఆఫీసుకు సంబంధించిన విషయాలైతే — నిర్భయంగా, నిస్సంకోచంగా, నిర్మొహమాటంగా, అందరి సమక్షంలోనే మాట్లాడెయ్యగలడు. కాని, యిది ప్రైవేటు వ్యవహారమాయె! అదీగాక ఆమె కన్య. తను వివాహితుడు — బిడ్డల తండ్రి! పైగా యిది ప్రభుత్వ కార్యాలయం. తన వయస్సు, హోదా కూడా కొంత అడ్డువస్తాయి.

ఇంతకూ తను ఆమెతో ఏం మాట్లాడదలుచుకున్నట్టు?—తలపట్టుకొని ఆలోచిస్తున్నాడు శివానందం.

"మే ఐ కమిన్, సార్!" — తియ్యటి స్త్రీ కంఠం.

తలపైకెత్తిన శివానందానికి, స్ప్రింగ్ డోర్ వత్తిగించి పట్టుకు నిల్చున్న కామేశ్వరి కనిపించింది.

ఇహనేం — కాగల కార్యం గంధర్వులే తీర్చారు!

"ఎస్, కమిన్!" అనేశాడు సంభ్రమంగా.

నెమ్మదిగా గదిలో ప్రవేశించి, టేబుల్ ముందు ఖాళీ కుర్చీల కవతల, అపరాధిలా తల వంచుకు నిలుచుంది కామేశ్వరి. ఆమెనా భంగిమలో చూస్తుంటే — శోభనం పెళ్ళికూతురు సిగ్గు పడుతున్నట్టుగా అనిపించి, ముచ్చటేసింది శివానందానికి.

పుష్టిగా ఆరోగ్యంగా నిండు యౌవనంలో మిసమిసలాడుతున్న శరీరంతో, తీర్చిదిద్దినట్టున్న అవయవాల పొందికలో, ధరించిన వస్త్రాలకే సొగసులు కూరుస్తున్న కామేశ్వరి రూపం శివానందం కళ్ళను చెదరగొట్టింది. సభ్యతమరచి, రెప్పవెయ్యకుండా ఆమెను చూస్తూ, కొద్ది క్షణాల తరవాత తేరుకొని — "ప్లీజ్ బి సీటెడ్" అన్నాడు గౌరవ సూచకంగా లేచినిలబడి కుర్చీ చూపిస్తూ.

మొహాన గంటుపెట్టుకొని, ఎప్పుడూ చిర్రుబుర్రులాడుతూ వుండే ఆఫీసర్ శివానందం ఈ రోజు యింత సౌమ్యంగా, గౌరవంగా, ప్రవర్తించటం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది కామేశ్వరికి. ఒక విధంగా, అదంతా తన అదృష్టంగానే భావించిందామె. కాని, ఆయన ముందు కూచోవటానికి ధైర్యం చాల్లేదు. ఎప్పుడన్నా కూచొని వుంటేగా!

"ప్లీజ్ టేక్ యువర్ సీట్!" మళ్ళీ అభ్యర్థించాడు శివానందం.

అది ఆజ్ఞగా వినిపించింది కామేశ్వరికి. కూచోకపోతే ఆయనకి కోపం వస్తుందేమోనని చటుక్కున కూచుని, తల దించుకుంది.

ఉత్తరం అయితే ధైర్యంగా రాయగలిగింది గాని, ఎంతైనా ఆడపిల్లకదా! ఆ మాత్రం సిగ్గుండటం సహజమే—అనుకున్నాడు శివానందం.

ఆమె భయపడుతున్నదో, సిగ్గుపడుతున్నదో అర్థం చేసుకోగల స్థితిలో లేడతను.

కొంచెం తలెత్తి నెమ్మదిగా అన్నది కామేశ్వరి — "మీతో ఓ విషయం మాట్లాడాలని వచ్చాను సార్!"

"వినటానికి నేను సిద్ధంగా వున్నాను."

ప్రేమలేఖ

"నిన్న నేను పంపించిన పి–1 ఫైలు..."

"...చూశాను."

"అందులో ఒక ఉత్తరం..."

"...వుంది. చదివాను."

"దయచేసి అది యిచ్చెయ్యండి సార్!"

"రాయటంవరకే నీ చేతుల్లో వుంది. తిరిగి యివ్వటం అనేది నా యిష్టానిష్టాలపై ఆధారపడి వుంది."

"క్షమించండి సార్! అది మీకు రాసింది కాదు."

షాక్ అయాడు శివానందం—"నాకు రాసింది కాదూ!"

"అవును సార్! చిన్న పొరపాటు జరిగి పోయింది."

"పొరపాటా? మన ఆఫీసులో నేను కాక మరో ఆనంద్ ఎవరున్నారు?"

"ఈ ఆనంద్ మా బంధువుల అబ్బాయి సార్! ఈ ఊళ్ళోనే బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఈ సంబంధం కోసం మా పెద్దవాళ్ళు కూడా ప్రయత్నిస్తున్నారు."

"మరి ఉత్తరం నాకు పంపటంలో నీ ఉద్దేశ్యం?"

"పంపాలని పంపలేదు సార్! తరవాత పోస్టు చేద్దామని సొరుగులో పెట్టాను. కాగితాల్లో కలిసిపోయి, ఫైలుతో వచ్చేసినట్టుంది!"

"ఫైలుతో వచ్చేసినట్టు ఎలా తెలిసింది?"

"అక్కడంతా వెదికాను సార్! కనబడలేదు. సంతకానికి పంపించిన ఫైలు యింకా తిరిగి రాలేదు గనుక, మీరింకా చూసి వుండరని, ఒకవేళ అందులో కలిసివుంటే అడిగి తీసుకోవాలనీ వచ్చాను. ఉన్నట్టు మీరే చెప్పారుకదా సార్ - యింతకు ముందు." అమాయకంగా చెప్పుకొచ్చింది కామేశ్వరి.

"ఇదంతా నిజమేనని నమ్మమంటావా? నాతో హాస్యాలాడటం లేదు గదా!"

"ఎంతమాట సార్! మీతో హాస్యాలా? మీరు నాకు తండ్రిలాంటి వారు సార్!"

చెంపమీద చెళ్ళున కొట్టినట్టయింది శివానందానికి. ప్రేమలేఖ ఎక్కించిన నిషా ఒక్కసారిగా దిగిపోయింది. పెద్దకూతురు కళ్ళముందు మెదిలింది. ఎదిగిన కూతుళ్ళకు వరుళ్ళి వెదకవలసిన ఈ వయసులోనా తనకిలాంటి పాడుబుద్ధి పుట్టటం? అదృష్టం బావుంది గనుక ఉత్తరం తనకు రాయలేదంది కామేశ్వరి. కర్మం కాలిపోయి తనకే రాశానని వుంటే — తనేం చేసేవాడు? భార్య, సంఘం, నీతి, పరువు, హోదా...అన్నింటినీ కాదని. ఆమె వెంటపడి వుండేవాడా? ఏమో, ఏం జరిగి వుండునో! ప్రేమలేఖ ప్రమాదకరమైనది. వివాహ బంధాన్ని పరమ పవిత్రమైనదిగా భావిస్తూ, నైతిక జీవితానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ, ఎంతో నిష్ఠగా కాలం గడుపుకొస్తున్న తననే ఓ పూవు వూపిందంటే — ప్రేమలేఖ ప్రభావం సామాన్యమైనదకోవటానికి వీల్లేదు. ఉచితానుచితాలకు సంబంధించిన తర్కవితర్కాలలో తలబద్దలు కొట్టుకొంటూ, తను కాబట్టి యింతవరకు కాలయాపన చేశాడు గాని, ఇదే మరొకడెవడైనా అయితే మరుక్షణంలోనే కార్యరంగంలోకి దూకి వుండును.

కామేశ్వరి చేసింది పొరపాటే. కాని, తను మాత్రం ఏం నిర్వాకం చేశాడు? ఒక విధంగా చూస్తే — దారి తప్పి వచ్చినా, కామేశ్వరి ప్రేమలేఖ తనకు మేలే చేసింది. తనలో నిద్రాణమై వున్న వివేకాన్ని వెన్నుతట్టి లేపి, కర్తవ్యాన్ని గుర్తు చేసింది. తన నైతిక ప్రవర్తనకు యిదొక పరీక్ష. కామేశ్వరి దయవల్ల చివరికి తనే నెగ్గాడు. అందుకు ఆమెకు ధన్యవాదాలు చెప్పుకోవాలి.

"చూడమ్మా! ప్రేమలేఖ అనేది అత్యంత ప్రమాదకరమైనది. అది వుద్దేశించబడిన వారికే చేరాలిగాని, మరొకరి చేతిలో పడకూడదు. అలా జరిగితే ఎన్నో అనర్థాలు జరిగిపోతాయ్. నువ్వు రాసిన ప్రేమలేఖ అదృష్టవశాత్తు నా చేతిలో పడింది కనుక సరిపోయింది. అదే మరే కుర్రాడి చేతిలోనో పడిందనుకో — అప్పుడేం జరుగుతుందో తెలుసా! — నువ్వు నిజంగానే తనను ప్రేమిస్తున్నావన్న భ్రమలో పడిపోయి, లేనిపోని ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటాడు. నిన్నూ యిబ్బందుల్లో పడేస్తాడు. అందుకని ప్రేమలేఖలు రాయదలచిన వాళ్ళంతా ఏం చెయ్యాలంటే — ముందుగా కవరు తెచ్చుకొని, అడ్రసు రాసి తయారుగా వుంచుకోవాలి. తరవాత ఉత్తరం రాసి, కవర్లో పెట్టి, అంటించి, వెంటనే స్వహస్తాలతో పోస్టు చెయ్యాలి. ఇలాంటి విషయాల్లో మూడో వ్యక్తికి ప్రవేశం కల్పించకూడదు. అర్థమైందా?"

"అర్థమైంది సార్! ఇకముందు తప్పకుండా మీ సూచన పాటిస్తాను సార్! దయచేసి నా ఉత్తరం యిప్పించేస్తారా సార్!"

రాక రాక వచ్చిన ప్రేమలేఖ — తనది కాకపోయినా, తన చేతికి చిక్కి, తనను పరీక్షకు నిలబెట్టిన చరిత్రాత్మకమైన ప్రేమలేఖ — అడిగింది కదా అని తిరిగి ఆమె కిచ్చెయ్యటం శివానందానికి నచ్చలేదు. అందుకనే — "ఇంకెక్కడి ఉత్తరం? నిన్ననే చింపి పారేశాను. ఇలాంటి పొరపాటేదో జరిగివుంటుందని వూహించి, దాన్ని అలాగే వుంచటం ప్రమాదకరమని భావించి, ఆ పని చేశాను. ఓ గంట పర్మిషన్ తీసుకొని, నా సూచనలు పాటించి, మరో ప్రేమలేఖ రాసుకో. వెళ్ళు. విష్ యూ గుడ్ లక్." అనేశాడు నేర్పుగా తన పెద్దరికాన్ని నిలబెట్టుకుంటూ.

"థాంక్యూ సార్!" అంటూ వుషారుగా లేచింది కామేశ్వరి.

కమల విడాకులు

జి. సరస్వతి



గోదావరి ఎక్స్‌ప్రెస్ చీకటిని చీల్చుకుంటూ విశాఖపట్నం వైపు పరుగులు పెడుతూంది. కిక్కిరిసి ఉన్న జనరల్ కంపార్ట్‌మెంటులో ఒక మూలగా సూట్‌కేసు పట్టుకొని నిలబడిన రామం శారీరకంగా, మానసికంగా నరకం అనుభవిస్తున్నాడు. కమల తనను విడిచి వెడుతూందన్న విషయం అతన్ని చిత్రహింసలకు గురిచేస్తూంది. ఈ విపత్తుకు తనే కారణం అన్న సంగతి పదే పదే గుర్తుకొస్తూ అతన్ని క్రుంగదీస్తూంది. ఇన్నాళ్లూ ఏవేవో భ్రమలకు లోనై దిగులుతో, వేదనతో కమలను పూర్తిగా నిరక్ష్యం చేశాడు. ఈ సాయంత్రంతో తన భ్రమలు తొలగిపోయాయి. మనస్సులో కమల చోటు చేసుకోవటం ప్రారంభించింది. కాని సమయం మించిపోయింది! 'భగవాన్! నా కమలను నాకు దక్కించు' అని పదే పదే వేడుకోసాగేడు రామం.

* * *

మోహన్ రామం క్లాసుమేటు. ఒకట తరగతి నించి బి. ఏ. వరకు ఇద్దరగా కలిసి చదివారు. వారికి ప్రాణస్నేహం ఏర్పడింది. మోహన్ చెల్లెలు శారద రామంతో చాల చనువుగా ఉండేది. శాంతమ్మకు బుద్ధిమంతుడైన రామాన్ని చూస్తే అభిమానం. ఆమెకు భర్త పోయాడు. పెద్ద ఇల్లు, బోలెడు ఆస్తి ఉన్నాయి. తెలివితేటలతో అన్ని వ్యవహారాలను చూసుకుంటూ పిల్లల్ని జాగ్రత్తగా చదివిస్తూ ఉండేది.

యవ్వనంతో బాటు సోయగాలను సంతరించుకున్న శారదపై ప్రేమ పెంచుకున్నాడు రామం. ఆమె చూపే ఆప్యాయత, స్నేహభావం, తనను చూడగానే వెలిగే ఆమె కళ్లు అతనెన్నో ఆశల హర్మ్యాలు నిర్మించుకోవటానికి దోహదం చేశాయి. భవిష్యత్తును గురించి తియ్యని కలలు కంటూనే దీక్షతో, పట్టుదలతో చదివి బి. ఏ. ఫస్టుక్లాసులో ప్యాసయాడు రామం. బ్యాంకు టెస్టులో, ఇంటర్వ్యూలో నెగ్గి క్లర్కుగా పోస్టింగురాగానే విజయనాడ వెళ్ళిపోయాడు. మోహన్ 'లా' కాలేజీలో చేరేడు. శారద ఇంటరు సీనియరులోకి వచ్చింది.

* * *

రామం సంక్రాంతికి సెలవు పెట్టి తల్లిదండ్రుల దగ్గరికి విజయనగరం వచ్చేడు. అప్పటికి తను ఉద్యోగంలో చేరి రెండేళ్ళు దాటింది. మోహన్ లా ప్యాసయి ప్రాక్టీసు పెట్టాడు. శారద బి. యస్‌సి ఫైనలియరుకి వచ్చింది.

ఒరోజు సాయంత్రం రామం మోహన్ ఇంటికి వెళ్లేసరికి శాంతమ్మ హాల్లో కూర్చొని స్నేహితురాలితో మాట్లాడుతూంది.

'రాం! ఎప్పుడొచ్చావు? బాగున్నావా?' అంటూ ఆప్యాయంగా పలకరించింది.

'మోహన్ గదిలో కూర్చోనోయ్! పావుగంటలో వస్తాడు,' అంది. రామం గదిలోకి వెళ్ళి కూర్చొని పత్రిక తిరగవేయసాగేడు. శాంతమ్మ, ఆమె స్నేహితురాలి సంభాషణలో తన పేరు వినబడే సరికి ఆసక్తిగా వినసాగేడు.

'వదినెగారూ! మీ శారదను ఇతనికిస్తారా? ఈడూజోడూ బాగుంటుంది.' అంది ఆమె.

'మా అమ్మాయిని ఇంజనీరుకో, డాక్టరుకో ఇవ్వాలనుకుంటున్నానమ్మా! ఇతను బి. ఏ. ప్యాసయి బ్యాంకులో గుమాస్తాగా చేస్తున్నాడు' అంది శాంతమ్మ.

'ఆస్తిపాస్తులైనా లేవా వదినెగారూ!'

'ఆస్తిపాస్తులేం లేవుగాని బాధ్యతలు మాత్రం బోలెడున్నాయి. తండ్రి సెంకడరీ

గ్రేడు టీచరు. ఇతనే పెద్దకొడుకు. అక్కకు పెళ్ళయింది. ఇంకా తమ్ముళ్ళని చదివించాలి. చెల్లెలికి పెళ్ళి చేయాలి. అలాంటి కుటుంబంలో నాపిల్ల ఏం సుఖపడుతుంది? అందుకే బాదరబందీలులేని పెద్దసంబంధంకోసం చూస్తున్నాను' అంది శాంతమ్మ. ఆమె తగ్గుస్వరంతో మాట్లాడినా ప్రతిమాటా రామం చెవిలో దూరింది. తను శారదపట్ల ఆశలు పెంచుకో కూడదనే శాంతమ్మ అలాగ మాట్లాడిందేమో అనిపించింది. అతని మనస్సు చిన్నబోయింది. తోబుట్టువులు పైకిరావటానికి చేయూత నిచ్చేవాడు భార్యను సుఖపెట్టలేడా? తోబుట్టువుల బాధ్యతలెప్పటికీ ఉండిపోవుకదా! గుమాస్తాగా ఉద్యోగంలో చేరినవాడు తనశక్తిసామర్థ్యాలతో ప్రమోషన్లు సంపాదించుకోలేడా? వరుడికి బాదరబందీలుండరాదనే శాంతమ్మ స్వార్థపుటాలోచనకి రామానికి అసహ్యం కలిగింది. అయినా తనకు కావలసినది శారద! సూటిగా తను, ఆమె బైటపడకపోయినా తమ మనస్సుల్లో అనురాగం ఉంది. శారద తననే చేసుకొంటానని పట్టుబడితే శాంతమ్మ కాదనలేదు! ఒక్కగానొక్క కూతురు మనస్సు నొప్పించలేదు! రామానికింక అక్కడ కూర్చోబుద్ధికాలేదు. హాల్లోకి వచ్చాడు. 'నేను మళ్ళీ వస్తానండి' అని శాంతమ్మతో చెప్పేసి బైటికి నడిచాడు.

బజార్లో పరాగ్గా నడుస్తూన్న రామం, "రామం, ఎప్పుడొచ్చావు?" అన్న పలకరింతతో ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా శారద నవ్వుతూ నిలబడుంది.

'శారదా! ఒక్కసారి పార్కుకి వస్తావా? ముఖ్య విషయం మాట్లాడాలి' అన్నాడు రామం.

'ఏమిటబ్బా అంత ముఖ్య విషయం?' అని ఆశ్చర్యపడుతూనే శారద అతని వెంట నడిచింది. మూలగా ఉన్న సిమెంటు బెంచిమీద కూర్చున్నారు.

'శారదా! చిన్నప్పటినుంచీ మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకుందామనుకుంటున్నాను' అన్నాడు రామం. శారద గుండె ఝల్లుమంది. సెలనవ్వులు చూస్తూ తలవార్చుంది. చిన్నప్పటి నుంచి తెలిసిన రామం, అందగాడు, గుణవంతుడు అయిన రామం తనను ఆరాధిస్తున్నాడు. తనకింకేం కావాలి! అతనితో తన వైవాహిక జీవితం సుఖసంతోషాలతో వర్ధిల్లుతుంది!

'నీ ఇష్టం చెప్పు శారదా!' అంటూ రామం ఆత్రుతగా అడిగాడు ఆమె ముఖంలోకి చూడటానికి ప్రయత్నిస్తూ. సిగ్గుతో వాలిపోయిన కళ్ళను ఎత్తి 'నా కిష్టమే రామం' అంది శారద. రామం ఆనందంతో తల మునకలై అంతలోనే చిన్నబోతూ, 'మీ అమ్మగారికి మన పెళ్ళి ఇష్టంలేదు శారదా! స్వతంత్రించి పెళ్ళి చేసుకోవటానికి సాహసించగలవా?' అని అడిగాడు.

'మా అమ్మ నా కోరికను కాదనదు రామం! మొదట ఒద్దన్నా నేను పట్టుపడితే తప్పకుండా ఒప్పుకుంటుంది.' అని శారద నమ్మకంగా చెప్పగానే రామం తేలికపడ్డాడు.

'మీ అమ్మగారు ఒప్పుకోగానే నాకు ఉత్తరం రాయి శారదా! నేను మా వాళ్ళకు తెలియబరుస్తాను' అని తన అడ్రసు ఒక కాగితం మీద వ్రాసి ఆమె చేతికిచ్చాడు. తరువాత రామం బజార్లోకి, శారద ఇంటికి నడిచారు.

* * *


శారద దగ్గిర్నుంచి రావలసిన తియ్యని కబురుకోసం క్షణమొక యుగంగా ఎదురు చూసిన రామానికి ఆమె పెళ్ళి శుభలేఖ చూసేసరికి మతిపోయినట్లయింది. ఆ రోజంతా పిచ్చివాడిలాగా తిరిగాడు. మనస్సుకు నచ్చని పెళ్ళిని చేసుకుంటున్న శారద ఎంత బాధపడుతూందో అని దుఃఖించాడు. గొప్పింటి సంబంధం చేయాలనే ఆశతో గాఢంగా ప్రేమించుకున్న తమను విడదీసిన శాంతమ్మను కసితీరా తిట్టుకున్నాడు. చాలా రోజులవరకు అతను మామూలు మనిషి కాలేకపోయాడు. విజయనగరం వెళ్ళడం మానేశాడు.

* * *

రామం పరీక్షలో, ఇంటర్వ్యూలో నెగ్గి ప్రొబేషనరీ ఆఫీసరుగా సెలక్టయాడు. తమ్ముళ్ళు ప్రకాశం, చంద్రం డాక్టర్లుగా ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. అన్నదమ్ములు ముగ్గురూ తల్లిదండ్రులకు అండగా నిలబడి చెల్లెలు కళ్యాణి పెళ్ళి ఘనంగా జరిపించారు.

రామానికెన్నో సంబంధాలు రాసాగాయి. శారద నుంచి మనస్సు మళ్ళించలేని రామం తనకు పెళ్ళి చేసుకొనే ఉద్దేశ్యం లేదని తండ్రి నారాయణమూర్తికి వ్రాసేవాడు. ఉద్యోగాల్లో స్థిరపడిన ప్రకాశానికి, చంద్రానికి పెళ్ళిళ్ళు చేసుకోవాలని ఉండేది. కాని తల్లిదండ్రులతో బాటు తమ ఉన్నతికి శ్రమించిన అన్న పెళ్ళి చేసుకోనిదే తాము చేసుకోవడం భావ్యం కాదని నిర్ణయించుకున్నారు. ఆ సంగతి వారికి తెలియజేశారు.

సంపాదనపరులు, బుద్ధిమంతులు అయిన ముగ్గురు కొడుకులూ పంతాలతో బ్రహ్మచారులుగా ఉండిపోతారేమోనని భయం పట్టుకుంది సావిత్రమ్మకు. పెద్దకూతురు విజయ దగ్గరకు వెళ్ళి రామాన్నెలాగైనా పెళ్ళికి ఒప్పించమని చెప్పింది.



కమల విడాకులు

విశాఖపట్నంలో ఉంటున్న విజయ అర్జంటుగా రమ్మని వ్రాసిన ఉత్తరం చూసుకొని రామం నాలుగు రోజులు సెలవు పెట్టి విజయవాడ నుంచి వచ్చాడు.

భోజనాలు, పనులు పూర్తయాక విజయ తీరిగ్గా తమ్ముడి దగ్గరికి వచ్చి కూర్చుంది.

'రామం! నువ్వు వీలైనంత తొందరగా పెళ్ళి చేసుకోవాలి. నీ వల్ల ప్రకాశం, చంద్రం కూడ పెళ్ళిళ్లు చేసుకోకుండా ఉండిపోయారు' అంది. రామం బాధగా అక్కగారి వైపు చూశాడు.

'నా కోసం వాళ్ళను పెళ్ళిళ్ళు మానుకోమనే మూర్ఖుడిని కానక్కా! నాకు చేసుకోవాలని లేదు. వాళ్లిద్దరికీ నచ్చినపిల్లల్ని చూసి చేసెయ్యండి' అన్నాడు.

'ఇంటికి పెద్దకొడుకువి, నువ్వు ఒంటరి బ్రతుకు ఈడుస్తూ ఉంటే మేమంతా సంతోషంగా ఉండగలమా రామం? మన బ్రతుకు మన ఒక్కరి కోసమే కాదు. అయినవాళ్ళను సంతోషపెట్టడం కోసం రాజీ పడక తప్పదు. నా మాట విను రామం. అమ్మను, నాన్నను చిన్నపుచ్చకు' అంది విజయ నచ్చజెప్తూన్నట్లు. రామం మాట్లాడలేదు. అతని మౌనాన్ని అంగీకారంగా తీసుకొని విజయ అడ్వొకేటు వెంకట్రామయ్యగారి అమ్మాయిని చూపెట్టింది. చామన చాయలో, కళ గల ముఖంతో, బారెడు జడతో ఆకర్షణీయంగా ఉన్న కమలను రామం సరిగా చూడనేలేదు. 'శారద కానప్పుడు ఎవరైతేయేం?' అనుకున్నాడు. అందగా ఉన్న రామాన్నిచూసి కమల కలల్లో తేలిపోయింది. రామం పెళ్ళాడ్డమే చాలన్నట్లు సావిత్రమ్మ, నారాయణమూర్తి కట్నం, లాంఛనాల విషయంలో ఏ విధమైన షరతులూ పెట్టలేదు. వాళ్ళడగలేదని లోటు చెయ్యకుండా ఘనంగా పెళ్ళి చేశారు వెంకట్రామయ్యగారు.

పెళ్ళయిన వెంటనే సంవత్సరాది పండుగ రావటంతో నాలుగైదు రోజులు అత్తారింట గడపక తప్పలేదు రామానికి. భార్యను వెంట పెట్టుకొని సినిమాకు, షికారుకుగాని, ఊళ్లోవున్న అక్కగారింటికి కాని వెళక పోవటం గమనించి వెంకట్రామయ్యగారు, భార్య రుక్మిణమ్మ ఆశ్చర్యపడ్డారు. అల్లుడి వైఖరి వారికేమి అంతుపట్టలేదు. మొహమాటస్తుడు కాబోలు అని సర్దిపుచ్చుకున్నారు.

శ్రావణమాసంలో కమల విజయనగరం వెళ్ళి నోములు నోచుకుంది. సావిత్రమ్మ కోడల్ని తీసుకొని వెళ్ళి దిగబెట్టింది. క్రొత్త సంసారానికి కావలసినవన్నీ అమర్చి, కమలకు జాగ్రత్తలు చెప్పి వారం రోజులుండి వెళ్ళిపోయింది.

* * *

కమల వంటపనిలో, ఇంటిని తీర్చిదిద్దడంలో నేర్పరి. ఇంటిని నీటుగా ఉంచడం, రామం బట్టలు విప్పటికప్పుడు సబ్బుతో ఉతికి ఇస్త్రీ చేసి పెట్టడం, అతని వస్తువులన్నీ వెతుక్కోవలసిన అవసరం రాకుండా సర్ది ఉంచడం చేసేది. అతను నోరు విప్పి అడగకుండానే అతని అవసరాలు గ్రహించి వేళకన్నీ అమర్చేది. కాని కమల రామం మనస్సుకు దగ్గరగా రాలేకపోయింది. అతని మనస్సెప్పుడూ శారద చుట్టూ తిరుగుతూ ఉండేది. ఆమెను పొందలేక పోయిన తన దురదృష్టానికి చింతిస్తూ కమలకు దూరంగా ఉండిపోయాడు. భర్త నిరాదరణ కమలను రంపపు కోతగా ఉండేది. కాని తల్లిదండ్రులు ఆందోళన పడతారనే భయంతో తన వ్యథను ఏనాడూ వారికి తెలియ బరచలేదు. పుట్టింటికి అరుదుగా వస్తూ ఉండేది, అందరితో సరదాగా గడిపేది.

* * *

రామం పెళ్ళయి మూడేళ్ళు గడిచిపోయాయి. ప్రకాశానికి, చంద్రానికి కూడ పెళ్ళిళ్లయాయి. హైదరాబాదులో ఉంటున్న ప్రకాశానికి కూతురు పుట్టిందని తెలిసి చూడటానికి వెళ్ళిన సావిత్రమ్మ తిరిగి విజయనగరం వెళ్తూ విజయవాడలో దిగింది. సావిత్రమ్మను చూసి రామం, కమల ఎంతో సంతోషపడిపోయారు. కమల అత్తగారికన్నీ రుచిగా వండి పెట్టింది. దుర్గగుడికి తీసుకొని వెళ్ళింది. రామం తల్లికి జరీచీర, తండ్రి కోసం జరీపంచెల చాపు కొన్నాడు.

పెళ్ళయి మూడేళ్ళు దాటినా రామం


త్రివిధచర్యగల ట్రిలో నీలి డిటర్జెంట్ బిళ్ళ
మరే ఇతర పేరెన్నికగన్న డిటర్జెంట్ బిళ్ళలకన్న 25% ధర తక్కువ
అదనంగా నురుగు
అదనంగా శక్తి
అదనంగా పొదుపు
NEW Triple action
Trilo
Extra lather • Extra power • Extra economy
A Godrej product
గోద్రెజ్

కమల విడాకులు

భార్యకు దూరంగా ఉంటున్నాడని. కమల తన ఆవేదనను ఎవరితో చెప్పుకోలేక మనస్సులోనే ఇముడ్చుకొని కుమిలిపోతూందని గ్రహించిన సావిత్రమ్మ చాల బాధ పడింది.

ఆ రోజు ఉదయం తొమ్మిదిన్నరయింది. రామం భోజనంచేసి, బట్టలు మార్చుకొని, క్రాపు దువ్వుకుంటున్నాడు. కమల పెరట్లో బట్టలు ఉతుక్కుంటూంది.

'రామం!' అని పిలుస్తూ సావిత్రమ్మ గదిలోకి వెళ్ళింది.

'ఏమమ్మా!' అంటూ తల్లి వైపు తిరిగాడు రామం.

"కమలను నువ్వు నిరాదరణ చేయడం బాగాలేదు రామం! ఎన్నో ఆశలతో మన ఇంట అడుగు పెట్టిన ఆడపిల్లను దుఃఖ పెట్టడం తగదు' అంది సావిత్రమ్మ నచ్చ చెప్పే ధోరణిలో రామం తల్లి మాటలువిని నిర్లక్ష్యంగా తల విదిలించాడు

'నేనేం లోటు చేసాను?' అన్నాడు ఎదురుగానట్టు.

'ఏం లోటు చేస్తున్నావో నీ మనస్సుకు తెలియదా రామం?' ఎదురు ప్రశ్న వేసింది.

'పెళ్ళొద్దు, పెళ్ళొద్దు అని గోల పెడితే వినకుండా చేశారు కదా! అనుభవించవలసిందే' అన్నాడు రామం జోళ్ళు తొడుక్కుంటూ.

'అందుకని నీ మంచిచెడ్డల్లో, కష్టసుఖాల్లో తోడు నీడగా ఉంటున్న భార్యను ఉసురు పెడతావా రామం?' అందిసావిత్రమ్మ బాధగా.

'అమ్మా! నన్ను విసిగించకు. కావాలంటే కమలను నీతో తీసుకొని వెళ్ళు. నాకు మన శ్శాంతిగా ఉంటుంది' అనేసి వెళ్ళడానికి ఉద్యుక్తుడయాడు.

"తప్పకుండా తీసుకొని వెళ్తానురా! పుట్టింటికి కూడ వెళ్ళడం తగ్గించి నీ అవసరాలన్నీ చూస్తూ ఉంటే నీకా పిల్ల విలువ తెలియటం లేదు. నాలుగు రోజులు దూరంగా ఉంటే నువ్వే పరుగెత్తుకొని వస్తావు అంది సావిత్రమ్మ."

ఆరాత్రే గోదావరి ఎక్స్‌ప్రెస్‌కి కమలను కూడ ప్రయాణం చేయించి విశాఖపట్నం తీసుకొనివెళ్ళి పుట్టింట దిగబెట్టింది సావిత్రమ్మ. రామం కాపురం గురించి విజయతో చెప్పి బాధ పడింది. రెండు రోజుల తరువాత విజయనగరం వెళ్ళి పోయింది.

* * *

వింత కాదనుకున్నా కమల వెళ్ళగానే ఇల్లంతా చిన్నబోయి నట్లనిపించింది రామానికి. 'ఆమె గాజుల గలగలలు, ఆమె పాదాలకుండే వెండి మువ్వల పట్టాల చేసే చిరుశబ్దాలు, పూజ చేసుకుంటూ సన్న గొంతుతో చదివే శ్లోకాలూ వినబడకపోవడం వెలితిగా తోచింది. రంగు రంగుల చీరలు -రవేసుకొనే దండెం బోసిగా ఉంది. పెరట్లో మొక్కలకున్న పువ్వులువాడిపోయి రాలిపోతూ ఉండటం చూసిన రామానికి పూలచెండుతో ఉండే కమల బారెడు జడ గుర్తుకు వచ్చింది. తనకు తెలియకుండానే తన మనస్సు ఇవన్నీ గమనించిందా ?' అనుకొని ఆశ్చర్యపోయాడు.

ఆరోజు సాయంత్రం ఆఫీసు వదిలాక గవర్నరుపేట సెంటరులో నడుస్తున్న రామం 'హలో రామం' అన్న పలకరింపుతో ఉలిక్కిపడ్డాడు. ఎదురుగా మోహన్ నవ్వుతూ నిలబడి ఉన్నాడు. అతని ప్రక్కన శారద, ఇద్దరు అందమైన పిల్లలు ఖరీదైన దుస్తుల్లో మెరిసి పోతున్నారు. శారద పెట్టుకున్న నగలు ఆమె చాల గొప్పింటి కోడలని చెప్పక చెబుతున్నాయి.

"మా పిన్నిగారి అమ్మాయి పెళ్ళి కని వచ్చాం రామం! మా బావ అర్జంటు పనులుండటంవల్ల పెళ్ళయిన వెంటనే హైదరాబాద్ వెళ్ళిపోయాడు. నేను రేపు శారదని, పిల్లల్ని తీసుకొని విజయనగరం వెళ్తున్నాను." అన్నాడు మోహన్. శారద ఇప్పటికీ తనని గాఢంగా ప్రేమిస్తూ ఉంటుందని, మనస్సును చంపుకొని పెళ్ళి చేసుకోవలసి వచ్చినందుకు కుంగిపోతూ ఉంటుందని ఊహించిన రామం ఆమె కళ్ళలోని తృప్తిని, గర్వాన్ని చూసి విస్తుపోయాడు.

"రామం జ్ఞాపకమున్నాడా శారదా?" అని మోహన్ చెల్లెల్ని అడిగాడు.

'లేకేం?' అంటూనే శారద పిల్లల్ని తీసుకొని ఎదురుగా ఉన్న షాపులోకి

నడిచింది. తనతో ఒక్క మాటైనా మాట్లాడని ఆమె నిర్లక్ష్య వైఖరికి రామం మనస్సు చిన్నబోయింది. కొంచెం సేపు రామం, మోహన్ మాట్లాడుకున్నారు.

'వస్తానోయ్ రామం! విజయనగరం వచ్చినప్పుడు మా యింటికి రా' అనేసి మోహన్ కూడా షాపులోకి నడిచాడు. రామం బరువుగా అక్కడినించి కదిలాడు.

'రామం, రామూ' అంటూ అతి ప్రియంగా ఆప్యాయంగా మాట్లాడే శారద, 'మన పెళ్ళికి అమ్మని ఒప్పిస్తాను' అని తియ్యని వాగ్దానం చేసిన శారద, తనెదురుపడినా పలకరించడానికి కూడ ఇష్టపడని స్థితికి వచ్చింది. అయినా తన పిచ్చిగాని, శారద మాట్లాడినా తనకుగాని, ఆమెకుగాని ఒరిగేదేముంది— ఇద్దరి దారులూ వేరైనప్పుడు? దిగులు, ఒంటరితనం నిండిన మనస్సుతో రామం తిరిగి తిరిగి రాత్రి తొమ్మిది గంటలవుతూ ఉండగా ఇల్లు చేరాడు. వీధి వరండాలో ఉన్న కుర్చీలో కూర్చొని పత్రిక తిరగవేస్తున్న అక్క విజయను చూడగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది.

'ఎప్పుడొచ్చావక్కా?' అంటూ గబగబా తాళం తీసి అన్ని గదుల్లో లైట్లు వేశాడు.

'ఈస్టుకోస్టులో వచ్చానురా! నువ్వెలాగూ ఇంటిదగ్గరుండవని నా ఫ్రెండు కుసుమ ఇంటికి వెళ్ళాను. సాయంత్రం ఇక్కడికి వచ్చాను. నువ్విప్పటికి వచ్చావు' అంది విసుగ్గా. ప్రక్కింటి వాళ్ళని గిన్నె అడిగి పోయించుకున్న పాలతో కాఫీ పెట్టింది. కాఫీ త్రాగాక రామం కొంత సేద దీరాడు. విజయ గబగబా వంట చేసింది. ఇద్దరూ స్నానాలు చేసి భోజనాలు చేశారు. రామం గదిలోకి వచ్చి అక్కకు పక్క ఏర్పాటు చేసి తనొక మంచం మీద నడుం వాల్చాడు. విజయ వంటిల్లు సర్ది, వక్కపొడి నములుతూ వచ్చి తిరిగి మంచం మీద కూర్చుంది.

'నాలుగురోజుల క్రిందట కమల వాళ్ళ కజిన్‌తో బజారులో కనబడిందిరా' అంది విజయ. పత్రిక తిరగవేస్తున్న రామం మాట్లాడలేదు.

'వాళ్ళ మేనత్త కొడుకని పరిచయం చేసింది. ఎంత అందంగా ఉన్నాడో! అమెరికాలో డాక్టరుగా ఉన్నాడుట ...' రామం ఉలిక్కిపడి నిటారుగా అయ్యాడు. చేతిలోని పత్రిక జారిపోయి క్రిందపడింది. విజయ అదేం పట్టనట్టు చెప్పుకుపోతోంది.

'మొదట కమలను అతనికే ఇవ్వాలనుకున్నారుట. కాని అమెరికా వెళ్ళినవాడు ఎప్పటికి వస్తాడో. వచ్చినా చేసుకుంటాడో లేదోనని ఊరుకున్నారుట. అతనికి మాత్రం కమలంటే చాలా ప్రేమట. 'కమల కాపురం సవ్యంగా లేదు కదా! విడాకులు తీసుకుంటే నేను కమలను పెళ్ళి చేసుకొని అమెరికా తీసుకొని వెళ్ళిపోతాను' అంటున్నాడుట. వాళ్ళీ సంగతులన్నీ నాతో చెప్పి విడాకులకు నీ ఆమోదం తీసుకొని రమ్మని నన్ను పంపారు.'

'అక్కా! మీ కందరికీ మతులు పోయాయా? పెళ్ళయిన పిల్లకు మళ్ళీ పెళ్ళా?' అని అరిచాడు.

'పెళ్ళయిందన్న పేరే కాని ఆ పిల్ల ఒక్కనాడైనా సంతోషంగా గడిపిందా? నిన్ను పెళ్ళాడిన నేరానికి నీకు సేవచేస్తూ మూడేళ్ళు గడిపింది. కాని అప్పటి ముచ్చటా ఏమైనా తీర్చావా? ఏ పాపం ఎరగని కమల నీ నిరాదరణతో ఎందుకు క్రుంగిపోవాలి? అందుకే నీతో మాట్లాడి వీలైనంత త్వరలో విడాకులు ఏర్పాటు చేస్తానని చెప్పాను.' అక్క ధోరణికి బిత్తరపోయాడు.

'పెళ్ళంటే నూరేళ్ళపంట అంటూ ఉపన్యాసాలు దంచుతావే! అలాంటి నువ్వు విడాకులకు వత్తాసు పలుకుతున్నావా?' అన్నాడు కోపంగా.

'పెళ్ళంటే నిజంగా నూరేళ్ళపంటే రామం. కాని ఆ పంటకు ప్రేమానురాగాలనే ఎరువు, నీరు ఉంటే కదా అది పచ్చగా ఉంటుంది. అవి కరువై ఎండిపోతున్న పంటను నిర్మూలించక చేసేదేముంది? అయినా కమలంటే నీకెలాగూ ఇష్టం లేదు కదా! విడిపోవడమే మంచిది. నీ ఇష్టం వచ్చిన రీతిలో నువ్వుండవచ్చు' అంది విజయ. రామం దిగ్గున లేచాడు. అందిన బట్టలూ, డబ్బూ సూట్‌కేసులో కూరేడు. 'ఆ విడాకుల వ్యవహారమేమిటో తేల్చుకొని వస్తాను' అని జోళ్ళు వేసుకొని గబగబా బైటికి నడుస్తుంటే విజయ తెల్లబోయి చూస్తూ నిలబడిపోయింది.

* * *

ఉదయం తొమ్మిదవుతూ ఉండగా రేగిన జుట్టు, ఎర్రనికళ్ళు, నలిగిన బట్టలతో సూట్‌కేసు పట్టుకొని రిక్షా దిగిన రామాన్ని చూసి వెంకట్రామయ్యగారు కంగారుగా లోపలికి ఆహ్వానించారు. రుక్మిణమ్మను కేకవేశారు. ఆవిడ లోపలి నించి వచ్చి ఆప్యాయంగా పలకరించి, వెళ్ళి కొడుకు వాసు చేత కాఫీ పంపింది.

కమల మాత్రం కనబడలేదు. 'బావతో ఎక్కడో షికార్లు చేస్తూంది కాబోలు' అనుకున్నాడు కసిగా. 'నువ్వు స్నానం, భోజనం కానిచ్చి విశ్రాంతి తీసుకోవోయ్ రామం! సాయంత్రం మాట్లాడుకుందాం' అన్నారు వెంకట్రామయ్యగారు కోర్టుకు వెళ్ళడానికి హడావిడి పడుతూ.

పన్నెండవుతూ ఉండగా రామం భోజనానికి కూర్చున్నాడు. విస్తట్లో ఉన్న పదార్థాలను చూస్తూ, 'బలి పశువును మేపడమంటే ఇదే కాబోలు' అనుకున్నాడు. రుక్మి

భూమధ్య రేఖంత పొడవైన గొట్టం!

సోవియట్ యూనియన్ 1976 నుండి 45వేల కిలోమీటర్ల నూనె, సహజ వాయువు రవాణా గొట్టపు మార్గాలను నిర్మించింది. వీని మొత్తం పొడవును భూమధ్య రేఖ పొడవుతో పోల్చవచ్చు. ఈ గొట్టపు మార్గాలు సైబీరియా, మధ్యాసియాలలోని నూనె, సహజ వాయువు నిధులను సోవియట్ యూరోపియన్ ప్రాంతం మధ్య భాగంతో కలుపుతున్నాయి. యూరప్ ఖండం మొత్తంలో అత్యంత పెద్దదైన "సోయూజ్ గొట్టపు మార్గం" దక్షిణ ఉరాల్స్ నుండి పశ్చిమ సరిహద్దు వరకూ వెళుతుంది. సోవియట్ యూనియన్, తదితర తూర్పు యూరప్ సోషలిస్టు దేశాలు ఈ గొట్టపు మార్గాన్ని నిర్మించాయి. దీనివల్ల బల్గేరియా, హంగరీ, జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్, పోలెండ్, చెకోస్లోవాకియా, రుమేనియాలకు సోవియట్ సహజ వాయువు సరఫరాలు ఎంతో ఎక్కువ పెరిగాయి.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

రచయితలకు గమనికలు

★ ఆంధ్ర సచిత్ర వారపత్రికకు కథలూ యితర రచనలు పంప దలచుకున్నవారు సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ–520 003 అన్న చిరునామాకి వ్రాయాలి.

★ కవరు మీద శీర్షిక పేరు పేర్కొనడం మంచిది. రచయితలు తమ పూర్తి పేరూ చిరునామా రచన చివరకూడా స్పష్టంగా వ్రాయాలి– హామీ పత్రం జత చెయ్యాలి.

★ గేయాలు తిప్పి పంపబడవు. వీటి పరిశీలనకు కూడా సుమారు ఏడు నుంచి తొమ్మిది వారాల గడువు అవసరం.

★ కథలుగాని, యితర రచనలుగాని త్రిప్పి పంపబడాలని కోరుకునేవారు– వారి స్వంత చిరునామా గల తగినన్ని తపాలాబిళ్ళ అంటించిన కవరు పెట్టడం అవసరం.

★ రచనల గురించి పంపిన వెంటనే గాక తొమ్మిది వారాల తరువాత మాత్రమే. వాటిపై నిర్ణయం కోసం ఎదురుచూడడం మంచిది. రచనల గురించి ఉత్తర ప్రత్యుత్తరాలకి తావులేదు కాని–తప్పనిసరి పరిస్థితులలో వాటిపై వ్రాయవలసివస్తే రచయితలు– రచన పేరు– అది పంపిన తేదీ, వివరంగా వ్రాయందే, వాటి గురించి పరిశీలించడం కష్టం.

★ మా కార్యాలయానికి రచనలు తెచ్చి ఇచ్చేవారు కూడా పై నిబంధనలన్నీ పాటించాలి. వారికి కూడా స్వంత చిరునామా గల తగినన్ని తపాలా బిళ్ళ అంటించిన కవరు జత చెయ్యాలి అన్న నిబంధన వర్తిస్తుంది.

★ కార్టూన్లు పంపేవారు కూడా 8 వారాలలోగా మా మీద ఉత్తరాల దాడి చెయ్యకూడదు... ప్రతి కార్టూన్ వెనుక పూర్తి పేరు, చిరునామా వ్రాయాలి.

★ ప్రత్యేక సందర్భాలుగా వేసిన కార్టూన్ల కవర్ల పై ఆ విషయం వ్రాస్తే వాటి పరిశీలన త్వరితంగా జరుగుతుంది.

★ కార్టూన్ల ఎంపిక తరువాత వాటి ప్రచురణ వీలు వెంబడి జరుగుతుంది.

★ రచయితలకు కార్టూనిస్టులకు ఒక్క ఉత్తరాలు, ప్రశ్నావళి, డాక్టర్ సలహా శీర్షికలో 'పద్మ' వారికి తప్ప తతిమ్మా అందరికీ; అవి పడ్డ "ప్రతు"లను– కాల క్రమంలో వాటి పారితోషికాలను పంపుతాము. కాపీలు–టపాలో పోయే ప్రమాదం వుంటుందే తప్ప పంపకపోవడం జరుగదు. పం,

కమల విడాకులు

అమ్మ కొసరి కొసరి వడ్డించింది. కాని కూతురు గురించి ఒక్క మాట మాట్లాడ లేదు. దాంతో రామం అనుమానం బలపడి మనస్సు మరింత వికలమైపోయింది. సరిగ భోజనం చేయకుండానే లేచిపోయాడు.

సాయంత్రం వాసుతో షికారుకు వెళ్ళి వచ్చాడు. ఎనిమిదవుతూ ఉండగ మావగారితోపాటు భోజనానికి కూర్చో అయిందనిపించి, తనకు కేటాయించిన గదికి చేరాడు. అత్తవారి ధోరణి అతనికేమీ అంతుపట్టలేదు. తనుగా ఏమీ మాట్లాడ లేక పోయాడు.

రాత్రి పది గంటలైంది. దారీ తెన్నూ లేని ఆలోచనలతో సతమతమౌతున్నాడు రామం. మూడేళ్ళుగా పరిచితమైన గాజుల గలగలలు, వెండి మువ్వల పట్టాల చిరుశబ్దాలు వినిపించి, ఉలిక్కిపడి కళ్ళు విప్పి చూశాడు. కమల టేబిలుమీద మంచినీళ్ళ మరచెంబు, గ్లాసు ఉంచి వెనుదిరిగి వెళ్ళబోతూంది. రామం ఒక్క ఉదుటున లేచి వెళ్ళి కమలను చేతులలో చుట్టేశాడు.


'నా పొరపాటును క్షమించి ఓర్పుతో నన్ను నీ వాడిని చేసుకోవాలి కాని, నాకింత శిక్ష విధిస్తావా కమలా?' అన్నాడు పశ్చాత్తాపం నిండిన స్వరంతో. కమల తెల్లబోతూ భర్త మొహంలోకి చూసింది. అతని కళ్ళు అనురాగ వర్షాన్ని కురిపిస్తున్నాయి.

'నువ్వు విడాకులు తీసుకొని మీ డాక్టరు బావను పెళ్ళాడి అమెరికా వెళ్తావని విజయక్క చెప్తే ఎంత బాధపడిపోయానో తెలుసా? నువ్వెక్కడ దూరమైపోతావో అని వెంటనే పరుగెత్తుకొని వచ్చాను. నన్ను విడిచిపెట్టవద్దు కమలా! మనం మన ఇంటికి వెళ్ళిపోదాం.' రామం మాటలు మృదుమధురంగా తొలిసారిగా చెవులకు సోకుతూ ఉంటే పరవశించిపోయిన కమల 'నాకసలు మేనత్తలే లేరు, ఇంక కొడుకెక్కడనించి వస్తాడు?' అంది గుసగుసగా. విజయకు శతకోటి వందనాలర్పిస్తూనే భర్త గాఢ పరిష్వంగంలో కరిగిపోయింది.

* * *

చిరునవ్వులు చిందిస్తూ గుమ్మంలో కొచ్చిన రామానికి, కమలకు హారతితో స్వాగతం పలికింది విజయ.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక పరిశీలనార్థం పంపే బొమ్మలు, ముఖచిత్ర రచనలు పంపేవారు కూడా వాటితోపాటు తగినన్ని తపాలా బిళ్లలు అంటించిన కవరును జతపరచకపోతే అవి త్రిప్పి పంపబడవు. -సం.



సెంటిమెంట్

సి.డి.యస్. రామయ్య



జ్యోతి యింటి మెట్లెక్కబోతూ, తన ముంజేతివాచీని ఒక్కసారి చూసుకుంది. పావుతక్కువ, అయిదయింది. తను రావడంలో ఆలస్యమేం జరగలేదని నిర్ధారణ చేసుకుని, లోపలికి వెళ్ళింది. పురుషోత్తంగారు వడివాకిలిలో వాలుకుర్చీలో కూర్చుని దినపత్రిక చూస్తున్నారు. ఆయన పత్రికలో లీనమైతే — చుట్టూరా సంగతి లెక్కలోకిరాదు.

ఆయన ముఖంనుండి పత్రికను కాస్త తొలగించి, చిలిపిగా ఆయన కళ్ళలోకి చూసింది జ్యోతి.

"వచ్చావా, జ్యోతి!...లోపలికి వెళ్ళి పనులు చూసుకోతల్లీ!" అన్నాడు పురుషోత్తంగారు బుజ్జగింపుగా!

తను కాలేజినుండి రావడం ఆలస్యం అయిందని, ఆయన కోప్పడతాడేమోనని అనుకున్న జ్యోతికి— ఆయన బుజ్జగింపు కొంత ఊరటను కలిగించింది. గోముగా తలూపి, లోపలికి నడిచింది.

ఆరింటికి రానున్న పెళ్ళిచూపులవాళ్ళ ఎదుట ప్రదర్శించేందుకు లక్ష్మిని అలంకరిస్తోంది సుందరమ్మ. ఆమె పురుషోత్తంగారి వదినగారు. ముత్తైదువ తనంతో గంభీరంగా వుంటుంది. పురుషోత్తంగారి భార్య 'పోయాక'—ఆయన పిల్లలు— లక్ష్మి, జ్యోతిల బాగోగులను ఆమెగారే అప్పుడప్పుడూ చూస్తూంటారు. ఆమెగారి భర్త—అంటే పురుషోత్తం అన్నగారు— మరోగదిలో కూర్చొని, రేడియో వింటున్నారు.

"పెద్దమ్మా! అక్క 'చూపుల ప్రదర్శన'లో నేను చేయగలిగింది ఇంకేమైనా వుందా?" అని అడిగింది జ్యోతి — ఆమె కురుల్లో కొంత పూలసరాన్ని తురుముతూ.

"శుభం అని జరిగేవరకూ — నువ్వు కాస్త అల్లరిచేయకుండా వుంటే—అదేచాలు, తల్లీ!" అని మందలించినట్లు అంది సుందరమ్మ.

ఆ మాటలకు లక్ష్మి నవ్వింది. ఆ నవ్వు వినగానే, జ్యోతికి అణుకనిండిన కోపం పొంగుకొచ్చింది. చివ్వున లక్ష్మి ముందుకు వచ్చి—ఆమె ముఖంలోకి మరామరా చూడబోయింది. కాని, పెళ్ళిచూపుల కారణంగా ఆమె ముఖంలో కనిపించే వింతశోభను కొన్ని క్షణాలవరకూ కళ్ళార్పకుండా చూసి— నవ్వున ఆమె బుగ్గను ముద్దెట్టుకుని, తుర్రున బయటికి పరుగుతీసింది జ్యోతి.

అరుగంటల ప్రాంతంలో పెళ్ళిచూపులవాళ్ళు వచ్చారు. వరుడు కాదలచిన యువకుడు—సీతారాం, అతని తల్లిదండ్రులు, మరో దూరపు బంధువొకాయన— ఆ కార్యక్రమానికి హాజరయ్యారు. వాళ్ళను పురుషోత్తంగారు, ఆయన అన్నగారూ

ఆహ్వానించి, గౌరవించారు. సుందరమ్మ దగ్గరనుండి అన్ని పనులూ చేయిస్తోంది- జ్యోతివేళ, పరిచయాలూ, వాకబులూ అంతా ఓ విధంగా ముగిశాక, మాపులక్ష్మి లక్ష్మిని తీసుకొచ్చింది జ్యోతి ఏదో భయం తోను, సిగ్గుతోనూ కెంపులు తిరిగిన లక్ష్మి ముఖాన్ని తదేకంగా చూస్తూ కూర్చున్నాడు సీతారాం.

పలకరింపులూ, అడగటాలూ, చెప్పటాలూ సర్వం జరిగిపోయిన పిదప, లక్ష్మిని లోపలికి తీసుకెళ్ళింది సుందరమ్మ. అంతవరకూ మంచిసావళాన్నే జ్యోతికి - ఎందుకో మనస్సు ఉండబట్టలేక పోయింది. "క్షమించాలి!..." అంటూ సీతారాం, వాళ్ళతాలూకు మనుషుల యెదుటకు వచ్చి నిలబడింది.

పురుషోత్తంగారు, తన కుమార్తె జ్యోతి, అల్లరితో- ఏం గొడవ తెచ్చిపెడుతుందోనని కంగారు పడ్డారు.

"నాకు తెలిసిన రెండు మాటలేవో చెప్పాలనుకుంటున్నాను. దయచేసి, అనుమతించగలరా?" అంటూ సీతారాం ముఖంలోకి సూటిగా చూసి ప్రశ్నించింది జ్యోతి.

సీతారాం తన తల్లిదండ్రులవేపు ఒకసారి చూసాడు. వాళ్ళు మొదట ఆశ్చర్యపోయినా, తేరుకొని- "దానికేం తల్లీ! అడుగు!" అన్నారు సీతారాం తండ్రిగారు.

"జ్యోతీ!" అనే మందలింపు కేక- పురుషోత్తంగారి నుండి వినిపించిందామెకు. జ్యోతి ఒక్కసారి తండ్రికేసి చూసింది. ఆయన ముఖంలో కోపం రంగులు రంగరించుకుని వున్నాయి.

"అమ్మాయేదో అడగాలని, చెప్పాలని ఉబలాట పడుతోంది! చెప్పనివ్వండి, పురుషోత్తంగారూ!" అన్నాడు వియ్యంకుడు.

జ్యోతి క్షణంసేపు మౌనం వహించి, "నే వింతగా ప్రవర్తిస్తున్నందుకు అందరూ నన్ను క్షమించండి! కాని, కొన్ని సమస్యలు- పెళ్ళి జరిగాక అందర్నీ ఇబ్బంది పెట్టవచ్చు. అలా జరగకూడదనే ఆశయంతోనే కొన్ని విషయాలు మీకు చెప్పదలుచుకున్నాను. బహుశ మీకు కొంత తెలిసి వుండవచ్చు ననుకుంటాను." అంది వినయంగా.

ఆమె ఏ విషయం గురించి మాట్లాడుతోందో- వచ్చిన యువకుడికిగానీ, అతని తల్లిదండ్రులకుగానీ తెలుసుండకపోవచ్చు. అందువల్ల, "ఏ విషయం గురించి?" అని ప్రశ్నించాడు సీతారాం.

"మా అమ్మ విషయం!" అని సూటిగా జవాబిచ్చింది జ్యోతి.

"మీ అమ్మ 'పోయింది' అన్న విషయం మాకు తెలుసు జ్యోతీ!" అన్నారు సీతారాం నాన్నగారు.

జ్యోతి పెదిమల మధ్య చిరునవ్వు మెదిలింది.

"ఆ 'పోయింది' అన్న పదానికి ఎన్నో అర్థాలుంటాయని మీకు తెలిసి వుండవచ్చు గదా! ఆ విషయం గురించి పూర్తి నిజాన్ని మీకు చెప్పాలనేదే నా ఆశయం. ఎందుకంటే, దాపరికంతో జరిపించిన పెళ్ళిలు తర్వాతి కాలంలో ఏ దారిన పడతాయో అందరికీ తెలుసు."

"ఇందులో దాపరిక మేముందని?"


"చెప్పక పోవడం దాపరికమే అవుతుంది గాబట్టి, చెప్పదలుచుకున్నాను. మా అమ్మ- మా అక్కనూ, నన్ను నవమాసాలు మోసి కన్నమాట వాస్తవమే! కాని, నాకు మూడో యేట- మమ్మల్ని, నాన్నను విడిచి ఎటో వెళ్ళిపోయింది. నేను పెరిగి పెద్దవాళ్ళమైనా, నా మటుకు ఆమె చనిపోయిందనే భావిస్తున్నాను. ఆమె చేసిన ఆ 'నేరం' మా జీవితాలకు 'మచ్చ'గా పరిణమిస్తుందనే భావన ఏర్పరచుకోడం తప్పుకాకపోయినా- దాన్ని దాచి, ఎదుటివారిని మభ్యపెట్టి- పెళ్ళిళ్ళు చేసుకోవాలనే దురాశ మాకులేదు. మా చిన్నతనంలోనే మాఅమ్మ చనిపోయినట్లు మేము నిర్ణయించుకొన్నాం. ఒకవేళ- ఆమె చేసిన నేరం మా జీవితాలకూ వర్తించవలసిందేనని అనుకుని- ఆ 'మచ్చ' మాకు రుద్దగలిగితే...," జ్యోతికి ఆపైన మాటలు పెగల్లేదు. దుఃఖం పెల్లుబికింది.


సీతారాం తండ్రిగారు కూర్చున్నచోటు నుండి లేచి వచ్చి, జ్యోతితలను గారాబంగా నిమిరాడు.


"మీ విషయం అంతా నాకు తెలుసమ్మా తల్లీ! ఏడవకు! నేనూ పిల్లల్ని కన్నవాణ్ణే! ఇందులో మీ తప్పేం లేదని మాకు మాత్రం తెలియదా?" అన్నారాయన. ఆ తర్వాత, తన కుమారుడికి లక్ష్మి నచ్చిందనీ, మిగతా వ్యవహారాలు మాట్లాడుకుని, ముహూర్తం నిశ్చయం చేయవలసిందనీ పురుషోత్తంగారికి చెప్పారు.

జ్యోతి మనస్సు సంతృప్తితో నిండిపోయింది. ఉత్సాహంగా లక్ష్మి దగ్గరకు వెళ్ళింది చెప్పడానికి. లక్ష్మి గోడకి చేరగిలబడి-విచారిస్తోంది. తన ప్రవర్తన ఆమెకు బాధ కలిగించిందని వూహించిన జ్యోతి- "అక్కా! నేనేమైనా తప్పుగా ప్రవర్తించి వుంటే, నన్ను క్షమించక్కా!" అని ప్రాధేయపడింది.

జ్యోతిని ఆప్యాయంగా కౌగిలించుకుంది లక్ష్మి- "లేదు జ్యోతీ!... నువ్వు నాకంటే చిన్నదానివైనా - నీ ముందుచూపు ఎంత మేలు జరిపించగలదో తెలుసుకున్నానమ్మా!" అంది.







సెంటిమెంట్

ఇద్దరూ ఒకరినొకరు ఓదార్చుకుని ఆఖరికి నవ్వుకున్నారు.

* * *

పెళ్ళిపీటలపై కూర్చున్న కొత్తదంపతుల్ని కళ్ళార్పకుండా చూస్తూ నిలబడ్డారు పురుషోత్తంగారు. అప్పుడప్పుడూ, తన తండ్రికేసి చూసి—సంతృప్తి, ఆనందంతో ముసిముసినవ్వులు నవ్వుతోంది లక్ష్మి. తన కంటూ నియమితమైన బాధ్యతాయుత కర్తవ్యాలను చేయబోతూ — తరుచూ అల్లరిగా—అటూ ఇటూ తిరుగుతూ గొడవ చేస్తున్న జ్యోతి మాటలు—మంగళ వాయిద్యాల చప్పుడులో లీనమైపోతున్నాయి.

నిండు ముత్తయిదువలా ప్రత్యక్షమయ్యే లక్ష్మి ముఖం చూస్తున్నంతసేపు, పురుషోత్తంగారికి ఏవో పాత జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. అలాగే తనూ, తన ప్రక్కన సుశీల కూర్చుని వైభవంగా పెళ్ళి చేసుకున్నారు. సుశీల తనకు సమమైన అందచందాలు గలది అని చెప్పడంకంటే — ఎన్నోరెట్లు ఎక్కువైనదని చెప్పవచ్చు. సన్నటి శరీరం, పరిమిత శరీరావయవాలు గలిగి, అచ్చం సినిమా తారలా వుండేది. చేతలలోనూ, మాటలలోనూ చలాకీతనమూ వుండేది. అయినా ఎప్పుడూ సంసార విషయంగా తన మాటకు అడ్డుచెప్పేదిగాదు. ఆమె అనునయం పొందిన తర్వాత, తన అదృష్టానికి తల్చుకుని గర్వపడిన రోజులు కూడా లేకపోలేదు. సుశీలతో గడిపిన అయిదు సంవత్సరాల జీవితంలోనూ — అయిదుయుగాల సార్థకత అనుభవించినట్లు వూహించేవాడు. ఆ కాలంలోనే లక్ష్మి, జ్యోతిలను మోసి, కని, పెంచింది సుశీల.

కాని, పూత మెరుగులో పెల్లుబికిన సుశీల అనురాగ బంధాలు— కేవలం వివాహ బంధం పేరిట బలవంతంగా యేర్పడ్డవేనని, ఆ తర్వాతగానీ తెలియరాలేదు. ఆమె మనస్సులోని ఆశయాల తరంగాలు — ఒక రోజు ఆమెను తీటువైపుగానో లాక్కుపోయాయి. తననూ, పిల్లల్నీ కూడా లెక్క చెయ్యకుండా— ఇల్లు విడిచి వెళ్ళిపోయింది.

తన భార్య చేసిన అఘాయిత్యానికి తను కారకుడు కాకపోయినా, లోకం తనను చూసి పరిహసించింది. పిల్లల్ని పెంచడంతో పాటే

వన్నిటినీ సహించాడు తను. ఏలాగో రోజులు సంవత్సరాలు గడిచిపోయాయి. ఎగిరిపోయిన చిలుక, ఎక్కడో మరో రూపం ధరించి వుందని కొందరు అతని దృష్టికి తీసుకు వచ్చినా— తను ఏవిధంగానూ ఆరాటపడకుండా ఈనాటికి లక్ష్మికి పెండ్లి చేయగలుగుతున్నాడు— కాని, వివాహ బంధంలో ఏర్పడ్డ కోత— తనను తరచూ బాధ పెడుతూనే వుంది

'భగవాన్! ఈ కఠోరమైన కోతను లోకంలో మరెవ్వరికీ కలగనివ్వకు!' అని లోలోన కుమిలిపోయారు పురుషోత్తంగారు.

నిర్ణీత వేళలో లక్ష్మి మెడలో మంగళసూత్రధారణ శుభంగా జరిగిపోయింది. తన చేతనున్న అక్షింతలు నూతన దంపతులపై చల్లి, మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు పురుషోత్తంగారు. ఆయన కళ్ల వెంబడి ఆనంద బాష్పాలు రాలాయి!

అదే సమయంలో పెళ్ళివాకిట ముందుగా వీధి ముంగిట ఒక అందమైన కారు ఒకటి వచ్చి ఆగింది. అందులో నుండి ఖరీదైన బట్టలు ధరించి, కళ్లకు చలవ అద్దాలు తొడుక్కున్న ఒక యువతి దిగింది. ఆమెను చూడగానే—చుట్టూ నిలబడివున్న వారిలో కొందరు— "సినిమా తార-సుహాసినీదేవి!" అంటూ గుసగుసలాడుకున్నారు. మరికొందరు ఆమె చుట్టూరామూగి, ఏదో వింత వస్తువును చూసినట్టు చూడసాగారు.

సుహాసినీదేవికి నడివయస్సు వుంటుంది. మెరుగులు దిద్దిన ముఖం అందంగానూ, గంభీరంగానూ వుంది. ముడిగా అరబోసుకున్న కురుల వెనుక రెండు గులాబీపూలు వున్నాయి. ఖరీదైన చీర కట్టుకుంది. చేతిలో హేండ్ బ్యాగ్ వుంది. ఆమె కారు నుంచి దిగి, చుట్టూరా కలయ చూసి, తేలికగా చిరునవ్వు నవ్వింది. ముందుకొస్తున్న జనాన్ని "ప్లీజ్! కాస్త దారి ఇవ్వండి!" అంటూ పెళ్ళి వాకిటవేపు బయలుదేరింది.

వీధి ముంగిట కనిపించిన అలజడిని గుర్తించిన పెళ్ళి జనం వారు అవేపు తిరిగి చూశారు— పురుషోత్తంగారితో సహా! సుహాసినిదేవి వేపు చూసిన ఆయనకు— ఆమెను గుర్తించడానికి ఆట్టే సేపు పట్టలేదు. ఆతురత, ఆందోళన, అనుమానం— ఇలాంటివి ఆయనను కలవరపెట్టసాగాయి. నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వచ్చి, వాకిలిముందు నిల్చారు.

కళ్ళద్దాలు చేతికి తీసుకుని, పురుషోత్తంగారి ముఖంలోకి— కొన్ని క్షణాలవరకు కళార్పకుండా చూస్తూ నిలబడిపోయింది సుహాసినీదేవి.

ఆయన పలకరించలేదు. ఆయన పలకరిస్తారని ఆమె కూడా ఎదురు చూసినట్టు లేదు. ఇద్దరిమధ్యా కొన్నిక్షణాలు నిశ్శబ్దం!

"ఎవరు వచ్చారు, నాన్నా?" అని ప్రశ్నిస్తూ లోపలినుండి జ్యోతి విసురుగా వచ్చి— అవతల నిలబడ్డ సుహాసినీదేవిని ఒక్కసారి ఆపాదమస్తకం పరిశీలించింది.

ఆమె కూడా— ఆశ్చర్యంగా జ్యోతివేపు కళార్పకుండా చూసింది. ఆమె కన్నుల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"మీరు?..." అని సందేహాస్పదంగా తడబడింది జ్యోతి!

"అదేమిటి, జ్యోతీ! ఈమె ప్రఖ్యాత సినిమాతార సుహాసినీదేవిగారు... సినిమాల్లో చూసే వుంటావు!" అని సమాధానమిచ్చారెవరో!

"ఏ సినిమా తారకూ మేము ఆహ్వానం పంపలేదే!" అని హేళనగా జవాబిచ్చిన జ్యోతి తన తండ్రివేపు ప్రశ్నార్థంగా చూసింది.

పురుషోత్తంగారు ముఖం పక్కకు తిప్పుకున్నారు.

సుహాసినీదేవి కొన్ని క్షణాలు మౌనం వహించిన తర్వాత, "నిజమే, తల్లీ! కాని, దారినపోతూ— ఇక్కడ... జరుగుతున్న... పెళ్ళికి, ఈ పెళ్ళిని... సరదాగా... చూడాలని ఆశపడ్డి వచ్చాను..." అని కంపిత కంఠంతో అంది. ఆమె ఎన్నో సినిమాల్లో విషాదం ప్రదర్శించవలసినప్పుడు— ఇలాగే అనేది. కాని, ఈ రోజు నిజంగానే అంటున్నదనీ, నటన ప్రదర్శించడంలేదని— అక్కడున్న వారిలో ఏ కొద్దిమందికో— ముఖ్యంగా పురుషోత్తంగారికి— తెలుసు!

సెంటిమెంట్

"పోనీలే, జ్యోతీ! ఆహ్వానించకపోయినా వచ్చిన అతిథిని- అగౌరవించడం మంచిది కాదు, పద్ధతిగాదు... లోపలికి తీసుకు వెళ్ళు!" అని జ్యోతిని సముదాయించ బోయారు పురుషోత్తంగారు. ఈ లోపుగా పెళ్ళి పందిరి జనం అంతా అక్కడ గుమిగూడారు.

"అతిథిమాట దేవుడెరుగు!" అంటూ విరుచుకుపడింది జ్యోతి. "ఇదిగో చూడండి సుహాసినీదేవిగారూ! మీ వరదాలు, ఆశయాలూ తీర్చుకోడానికి ఇది అనువైన చోటుగాదు... మీరెవరో, మీరెంతటి వారో నాకు బాగా తెలుసు! చనిపోయిందనుకుంటున్నా..."

"జ్యోతీ! నోరు మూసుకుని లోపలికి వెళ్ళు!" అంటూ మధ్యలో విసుగు, కోపంతో అరిచారు పురుషోత్తంగారు.

"ఆ అమ్మాయిని మాట్లాడనివ్వండి! ఆ బంగారు పలుకులు వినాలని, ఆముఖాలు చూడాలని ఎంతగా తపించి పోతున్నానో- వారికేం తెల్సు? కాని, నేను నేరం చేసిన దాన్ని... మీకు, పిల్లలకూ తలవంపులు తెచ్చినదాన్ని... ఆ మాటలు పడడంలో అన్యాయమేమీ లేదు... ఇవన్నీ జరుగుతుందని తెలిసే- ఇవనిక్కడికి వచ్చాను..." అంది సుహాసినీదేవి.

ఆమె ఎవరో జ్యోతికి తెలిసిపోయి వుంటుందని అనుమానించారు పురుషోత్తంగారు. ఆ బాధను కప్పిపుచ్చుకోడానికి ఏం చేయడానికీ తోచలేదు. ఈలోపల వియ్యంకులవాళ్ళు, అనవసరమైన గలాభాను వారించబోయి, మూట్లా మూగిన జనాన్ని చెదరగొట్టి, సుహాసినీదేవిని మరోవేపుకు తీసుకునిపోయి, ఓ చోట కూర్చోబెట్టారు.

మిగతా పెళ్ళి తతంగమంతా జరుగుతూండగా — సుహాసినీదేవి నిస్తబ్దతగా చూస్తూండిపోయింది. ఆమె ఎవరితోనూ మాట్లాడలేదు. ఆ విషయంలో ఎవరూ కూడా శ్రద్ధ తీసుకోలేదు.

అంతా ముగిసిన తర్వాత, సుహాసినీదేవి నూతన దంపతులను కళ్ళారా చూసి- ఆనందించింది. కాని, అక్షింతలు వేయలేదు. ఆమెనలా వేయమని ఎవరూ కూడా సూచించ లేదు. ఆమెను చూసినప్పుడు లక్ష్మికి ఏదో బాంధవ్యం పెనవేసుకున్నట్టనిపించినా, బయటకి కనిపించుకోలేకపోయింది.

ఆ పెళ్ళికి సుహాసినీదేవి రాకను గురించి కొందరు ఏదోవిధంగా గుసగుసలాడు కున్నారు, గాని పెళ్ళికి సంబంధించిన వియ్యంకులెవరూ దాన్నిగురించి ఏది పట్టించుకున్నట్టుగా కనిపించలేదు.

అక్కడినుండి సుహాసినీదేవి బయలుదేర బోతూ- పురుషోత్తంగారిని మూగబాధతో ఏదో హెచ్చరించింది. కాని, ఆయన చేతులు జోడించి- అపరిచిత వ్యక్తికి చేసినట్టుగా- నమస్కరించి ఊరుకున్నారు.

సుహాసినీదేవి కారులో కూర్చోబోతూండగా- జ్యోతి ఆమె దగ్గరికి పరిగెత్తు కొచ్చింది. ఆమె ముందెప్పటిలాగే ఆప్యాయంగా నిమిరింది సుహాసినీదేవి. గడుగ్గాయిగా వున్న ఆ గడుసుదాన్ని చేతుల్లోకి తీసుకుని, ముద్దెట్టుకోవాలనిపించింది. కాని ....

"స్వార్థంకోసం మమత, మమకారాలను విదిల్చుకుని వెళ్ళిపోయిన నా తల్లి—ఏ నాడో చనిపోయిందని నిర్ణయించుకుని, నిన్ను వదిలేశాను. మళ్ళీ — ఏ పరిస్థితుల్లోనూ నీ ముఖం చూడడానికి ప్రయత్నించకు ... తెలిసిందా! — ఐ హేట్ యూ!" అని కడుపు మంటను కక్కి— కారు తలుపును విసురుగా మూసింది జ్యోతి.

కోరిక

'నేను' పువ్వును కాదు
'మానవత' పుష్పాన్ని
కావాలి నాకు.
నీలాకాశంలా
సువిశాల సాగరంలా
మనసున్న మనిషి
కావాలి నాకు.

— ఎస్. మునిసుందరం

హైదరాబాద్ నోట్‌బుక్

శ్రీ లక్ష్మీకాంత మోహన్:

"మూకే, మూకే సరస్వతి" అన్నారు లోకజ్ఞులైన పెద్దలు. ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరి కెరుక. అలాగే ఎవరు ఎంతటి మేధావులో, ఎలా రూపొందుతారో! మొన్నటి జులై 1 వ తేదీకి అరవయ్యవ సంవత్సరంలో ప్రవేశించిన శ్రీ లక్ష్మీకాంత మోహన్ కూడా అలాటి వాడు. జాతిరత్నం. 60 సంవత్సరాలలో ఒక్క మారైనా జ్వరని చిది ఎరుగడు. ప్రజలలో నిత్యం పని చేయాలనే నిరంతర తపన. పెద్ద పెద్ద ఉద్యోగాలు వచ్చినా మానివేశాడు. వ్యాసంగంది పోరు పోరవే అయినా, షేక్స్పియర్ నాటకాలన్నిటినీ ఒంటి చేత్తో మీద అనువదించాడు. ఆ నాటకాలను గురించిన విపుల పరిశోధన విమర్శ కావించారు. పది భాగాలలో ఇది 4000 గ్రంథాల సారాంశం. దీనిని దేశ విదేశ విద్వాంసులు, విమర్శకులు వేనోళ్ల పొగిడారు. షేక్స్పియర్‌ను గురించి ఈయన వ్రాసిన ఒక గ్రంథం లక్నో, నాగపూర్ విశ్వవిద్యాలయాలలో ఆదరణ పొంది, కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈయన హామ్లెట్ అనువాదం పాఠ్య పుస్తకమయింది. జానపద కళా స్వరూపాలు గొల్ల సుద్దులు, బుర్రకథలు వంటివి ఆపోశనం పట్టాడు. నిజాం పరిపాలనను ఎదిరించిన తెలంగాణా ప్రజల పోరాటాన్ని చిత్రిస్తూ సింహగర్జన అనే నవలను, తెలుగులోను, ఆంగ్లంలోను రచించాడు. లెనిన్‌ను గురించి, మే డేలను గురించి కథలు వ్రాసిన తొలి భారతీయుడు. 1958లో ఆకాశవాణివారు నిర్వహించిన అఖిలభారత జానపద గేయ స్పర్ధలో బహుమతి పొందాడు. భారతదేశమంతటా పర్యటించి జానపద కళలను ప్రదర్శించి ప్రశంస పొందాడు. తెలంగాణా తొలి రాజకీయ నవల అయిన సింహగర్జన ఆంధ్ర, మద్రాసు హైదరాబాద్ ప్రభుత్వాల నిషేధానికి గురిఅయిందని గర్వంతో మురిసి పోతాడు. మావోను గురించి 1940 లోనే కావ్యం వ్రాసి తర్వాత వారికి మార్గ దర్శకుడయ్యాడు. ఇక రాజకీయ జ్యోతిషాలు చెప్పడంలో దిట్ట. ఇరాన్, హత్యకు గురి అవుతాడని అందరికీ చెప్పగా, రక్త దోషంతో మరణిస్తాడని, దశాబ్దం క్రిందే చెప్పాడు. జనతా పార్టీ నిలువుగాను, అడ్డంగాను, వక్రంగాను, ఐమూలగాను చీలి పోతుందని, 1971 లోనే వ్రాశాడు. గుంటూరు జిల్లా రేపల్లె తాల్లూకా వెల్లటూరులో పుట్టాడు 1921 జులై ఒకటవ తేదీన. 1952 నుంచి హైదరాబాద్‌లో వుంటున్నాడు. డాక్టర్ వి. కె. గోకాక్ అన్నట్లు ఈయన రచన భగ్గుమనే అగ్ని పర్వతం లాంటిది. ఆరాటంలో, ఆవేదనతో కాగిపోతుంటాడు. ఇలాటి ప్రజా శక్తిని ఆంధ్రావని వినియోగించుకోవాలి.

శ్రీ బాలశివయోగి జన్మదినం:

శ్రీ బాలశివయోగి కేవలం గారడీవారివలెనే అద్భుతాలు చేసే ప్రజలను మభ్యపుచ్చే వ్యక్తి కాదు. విద్యా, వైద్య, ఆధ్యాత్మిక రంగాలలో ప్రజలను ఆదుకుంటున్న వ్యక్తి. పెక్కు విద్యాలయాలను, విద్యార్థి వసతి గృహాలను ప్రారంభించారు. హిమాలయసానువులలో సురధునీ తీరాలలో పెక్కేండ్లు ఆచరించిన తపః ఫలితంగా రుదంతి అనే మూలికను కనుకొని, దానితో పుట్టకురుపును [క్యాన్సరును] పోగొడుతున్నారు. కుష్ఠు నివారణకుగూడ ఔషధిని కనుగొన్నారు. ఆధ్యాత్మికంగా తేజో మార్గమనే నూతన యోగమార్గం కనుగొన్నారు. ఆయన 27వ జన్మదినోత్సవం జులై 27వ తేదీన బర్కత్ పూర్‌లోని ఆంధ్ర యువతీ మండలి హాలులో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనంలో శ్రీయుతులు తిరుమల రామచంద్ర, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, ముదిగొండ వీరభద్ర మూర్తి, పోతుకూచి సాంబశివరావు, ఆచార్య తిరుమల, కుమారి మంత్రిప్రగడ శేషబాయి, తుంగతుర్తి విశ్వనాథశాస్త్రి ముఖ్యులు పాల్గొన్నారు. శ్రీ బాలశివయోగి కూడా కవి. ఆయన తమ ఆధ్యాత్మిక రచనను వినిపించారు. ఈ కలియుగం ఆకలి యుగం అన్నారాయన.

మస్తకాలలో పుస్తకాలు దూర్చుకోడం వల్ల ప్రయోజనం లేదని, సాధన కావాలని, కష్టాలు మానవుని మెరుగు పెడతాయని ఆయన తమ సందేశంలో అన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొన్నవారిని ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ ఎం. గోపాలకృష్ణారెడ్డి ఇద్దరు శాలువలతో సత్కరించారు. కవి సమ్మేళనానికి శ్రీ దేవులపల్లి రామానుజరావు అధ్యక్షత వహించారు.

ఉపశ్రుతి:

"కష్టాలు మానవుని మెరుగు పెడతాయంటారు కదా పెద్దలు. జన్మంతా కష్టపడుతున్న వారికి భగవంతుడు జన్మంతా మెరుగు పెడుతున్నట్టేనా? మరి ఆ మెరుగు అతనికీ, లోకానికీ లాభించేదెప్పుడు?" అనడిగాడు ఒకరు నవ్వుతూ. "వెర్రి వాడా? జన్మ అనేది పాత బొక్కెనలాంటిది. మరో జన్మం లేదూ! ఈ మెరుగులు అందుకు!" అన్నాడొక వేదాంతి.

—తిరుమల రామచంద్ర

మాస్కో ఒలింపిక్స్ వాస్తవాలు, వివరాలు

మాస్కో ఒలింపిక్స్‌లో 81దేశాలు పాల్గొన్నాయి. ఇందు పాల్గొన్న ప్రతినిధి వర్గ సభ్యుల మొత్తం సంఖ్య 8,034. ఇందు 5,748 మంది క్రీడాకారులు; మిగతావారు అధికారులు, వైద్య, సాంకేతిక సిబ్బంది.

ఈ క్రీడల్లో ఐదు ఖండాల్లోని 73 దేశాలకు చెందిన 1245 మంది అంపైర్లుగా వ్యవహరించారు. ఒలింపిక్ క్రీడలను బహిష్కరించిన అమెరికా, పశ్చిమ జర్మనీ, కెనడా, జపాన్ల నుండి కూడ అంపైర్లు వచ్చారు. బహిష్కరణోద్యమ వైఫల్యానికి మరో తార్కాణమిది. 180,000 విదేశీ పర్యాటకులు మాస్కో సందర్శించారు.

ఈ సందర్భంలో 97 సార్లు ప్రపంచ రికార్డులు, 240 సార్లు ఒలింపిక్ రికార్డులు బద్దలయ్యాయి, ఒకసారి నెలకొన్న రికార్డు మరి రెండు, మూడు నిముషాల్లోనే బద్దలయ్యేది. అంతిమంగా 36 ప్రపంచ రికార్డులు, 74 ఒలింపిక్ రికార్డులు నెలకొన్నాయి. హై జంప్‌లో 2.36 మీటర్లు దూకి జి. డి. ఆర్. కు చెందిన గెర్డ్ వెస్సింగ్ అపూర్వమైన రికార్డు నెలకొల్పడమే గాక, ఫైనల్‌లో పాల్గొన్న ఆరుగురూ ఒలింపిక్ రికార్డును అధిగమించడం మరో విశిష్టత.

25 దేశాలు స్వర్ణ పతకాలు గెల్చుకోగా, మొత్తం 36 దేశాలు వివిధ పతకాలు గెల్చుకున్నాయి. జింబాబ్వే మహిళా హాకీజట్టు స్వర్ణపతకం గెల్చుకుంది. ఇథియోపియా పరుగుపందాల్లో ఉన్నత శిఖరాలందుకుంది. 5,634 మంది వార్తా ప్రసార నిపుణులు మాస్కో ఒలింపిక్స్ కలాపాల్లో పాల్గొన్నారు. ఇందు 2 599 మంది పత్రికలవారు, 2,935మంది రేడియో, టి.వి. లకు చెందినవారు.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street
Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.

దేశాన్ని కలిసికట్టుగా ఉంచేదేది?

"ప్రధానంగా ప్రజల దేశాభిమానము,
దేశం కోసం పాటుపడేందుకూ,
త్యాగాలు చేసేందుకూ వారి సుముఖత.
ఇదే పూర్తి వాస్తవికత కాదనాలి. ఎందుకంటే
దేశ భవిష్యత్తుతో తమ ప్రయోజనాలు ముడిపడి
ఉన్నాయని ప్రతి ఒకరికి తెలుసు."

—ఇందిరా గాంధి.



రండి, మనమంతా కలిసి పనిచేద్దాం

davp 80/160

మీ ఇంటికి పెయింట్ వేయించాలి కదూ?

అయితే రండి, నెరొలాక్ పెయింట్స్ నుంచి ఏం చెయ్యాల్లో తలుసుకుందాం.

మీ యిల్లంటే మరి అది మీ కోరికలకి రూపం. పుస్తకాలూ, పటాలూ, బొమ్మలూ, ఫర్నిచర్, యివన్నీ మీ అభిలాషని వ్యక్త పరుస్తాయి. సంగీతంలోని నినాదం, రంగుల వర్ణ సౌందర్యం, మీ జీవిత వైఖరిని వైభవంతో నింపుతుంది. మీ వ్యక్తిత్వం కనిపించేలాంటి అటువంటి యింటిని అలా చేసుకోవాలంటే, మనస్సును లగ్నం చెయ్యవలసి వుంటుంది. మీ అవసరాలూ, మీ పసందూ, యివే వాటి భాషగా మారుతుందిక.

మొదటిగా మీరు తెలుసుకోవలసిందల్లా మీ కసలు ఏం కావాలీ అని. ఇంటిని పెయింట్ చేసే ముందు మీ అవసరాలూ, అభీష్టాలూ వీటిని పూర్తిగా తెలుసుకోవాలి.

మొట్టమొదటిగా మీకు మీరుగా యీ ప్రశ్నల్ని వేసుకోండి:

నా కసలు పెయింట్లను గూర్చి ఏ రకమైన సమాచారం కావాలి?

పెయింట్‌లో ఏ రకమైన కలయిక వలన నాకు అది తక్కువ ఖర్చుతో సర్వోత్తమమైనదిగా తయారు అవుతుంది?

ఇంట్లో ప్రతి గదికీ ఏయే రంగు వెయ్యాలి?

పెయింట్ వేసే సమయంలో ఎదురయ్యే సమస్యల్ని ఏ విధంగా ఎదుర్కోవాలి?

నేను పెయింట్‌ని ఎంచుకోడానికీ, వేయించడానికీ ఎవరెవరిని సంప్రదించవలసి ఉంటుంది?

ఇటువంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు రాబోయే మా విజ్ఞాపనలలో మీకు అందుతూ వుంటాయి. మరి యిటువంటి ప్రత్యేకమైన సమాచారం ఎందుకివ్వాల్సి వస్తోందంటే, దాంతో మీరు యిక యింటిని పూర్తిగా ఆత్మవిశ్వాసంతో పెయింట్ చేయించుకోవచ్చు గనక.



నెరొలాక్ పెయింట్స్

ఇంటా బయటా అందరూ మెచ్చేవి, మనసుకు నచ్చేవి